# Vr̥d'dhōpaniṣat kāvyaṁ sāhitya sāmājikānśāla pariśīlana

A Dissertation submitted to the University of Hyderabad in partial fulfillment of the degree of

MASTER OF PHILOSOPHY

In

Telugu

By

**G. KRISHNAVENI**

**Supervisor**

**Prof. PILLALAMARRI RAMULU**

**Department of Telugu**
**School of Humanities**
**University of Hyderabad**
**Hyderabad – 500046**

**December – 2022**

# ఎన్. గోపి వృద్ధోపనిషత్ కావ్యం సాహిత్య సామాజికాంశాల పరిశీలన

ఎం. ఫిల్., పట్టా కోసం హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన వ్యాసం


పరిశోధన

**జి. కృష్ణవేణి**

పర్యవేక్షణ

**ఆచార్య పిల్లలమర్రి రాములు**



తెలుగు శాఖ

మానవీయ శాస్త్రాల విభాగం

హైదరాబాద్ విశ్వవిద్యాలయం

గచ్చిబౌలి, హైదరాబాద్ — 500046

తెలంగాణ


డిసెంబర్ — 2022

# CERTIFICATE

This is to certify that the dissertation entitled ***"Vr̥d'dhōpaniṣat kāvyaṁ sāhitya sāmājikānśāla pariśīlana"*** submitted by **Ms. G. Krishnaveni** bearing Registration No.20HTHL09 in partial fulfillment of the requirements for the award of **Master of Philosophy in Telugu** is a bonafide work carried out by her under my supervision and guidance.

The Dissertation has not been submitted previously in part or in full to this or any other University or Institution for the award of any degree or diploma.

Further the student has passed the following courses towards fulfillment of course work required for M.Phil. (Recommended by the Doctorial Committee) on the basis of the following courses passed during her M.Phil. programme.

| Course Code | Name of the Course | Course Credits | Pass/Fail |
|---|---|---|---|
| HT700 | Research Methodology | 4 | Pass |
| HT701 | History of Telugu Research | 4 | Pass |
| HT702 | Specialized Area | 4 | Pass |
| HT703 | Broad Field | 4 | Pass |

**Prof. Pillamarri Ramulu**
Research Supervisor

**Head, Department of Telugu**

**Dean, School of Humanities**

# DECLARATION

I, **G. Krishnaveni** hereby declare that this Dissertation entitled ***“Vr̥d'dhōpaniṣat kāvyaṁ sāhitya sāmājikānśāla pariśīlana”*** submitted by me under the guidance and supervision of Prof. Pillamarri Ramulu is my bona fide research work and is free from plagiarism. I also declare that it has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma. I hereby agree that my thesis can be deposited in Shodhganga/ INFLIBNET.

Date: **G. KRISHNAVENI**

**(Regd. No.20HTHL09)**

# విషయసూచిక

**కృతజ్ఞతలు**

**ప్రవేశిక**

## మొదటి అధ్యాయం

## ఆచార్య ఎన్. గోపి జీవితం – సాహిత్యం (1 - 20)

1.0. పరిచయం

1.1. జననం

1.2. విద్యాభ్యాసం

1.3. వైవాహిక జీవితం

1.4. ఉద్యోగ జీవితం

1.5. రచనలు

1.5.1. కవిత్వ సంపుటాలు

1.5.2. విమర్శన గ్రంథాలు

1.5.3. పరిశోధనలు

1.5.4. అనువాదాలు

1.5.5. యాత్రా చరిత్రలు

1.5.6. నానీల సృష్టికర్త

1.5.7. పత్రికా సంపాదకులు

1.5.8. ఇతరాలు

1.6. ఆచార్య గోపి పొందిన పురస్కారాలు

1.7. ఆచార్య గోపి పై ప్రముఖుల అభిప్రాయాలు

# రెండవ అధ్యాయం

## వృద్ధోపనిషత్ సామాజిక అంశాల పరిశీలన (21 - 81)


2.0. పరిచయం

2.1. వృద్ధాప్య చిహ్నాలు

2.2. వృద్ధాప్య సమస్యలు

2. 2. 1. శారీరక సమస్యలు

2. 2. 2. మానసిక సమస్యలు

2. 2. 3. సామాజిక సమస్యలు

2. 2. 4. ఆర్థిక సమస్యలు

2.3. కుటుంబ వ్యవస్థలో వృద్ధుడు

2.3.1. ఇంట్లో వృద్ధుల పరిస్థితులు

2.3.1.1. కుటుంబం – వృద్ధుడు

2.3.1.2. కుటుంబం – వృద్ధురాలు

2.4. ఆహ్లాదకరమైన కుటుంబ పరిస్థితులు

2.4.1. మనుమడు – వృద్ధులు

2.4.2. మనుమరాలు – వృద్ధులు

2.5. సమాజంలో వృద్ధులు

2.5.1. వృద్ధాప్య పెన్షన్లు

2.5.2. బ్యాంకు కౌంటర్ల దగ్గర /వివిధ ప్రదేశాలలో

2.5.3. వృద్ధాశ్రమాలు

2.6. వృద్ధుల మనోభావాలు

2.6.1. వయసు మళ్లిన గాథలు తీరనివ్యథలు

# మూడవ అధ్యాయం

## ఆచార్య ఎన్. గోపి రచన శిల్పం (82 – 105)


3.0. పరిచయం

3.1. శిల్పం – నిర్వచనం

3.2. ఆచార్య ఎన్. గోపి రచన శిల్పం

3.2.1. భావచిత్రాలు

3.2.2. ప్రతీకలు

3.2.3. అలంకారాలు

3.2.3.1. ఆధునిక కవిత్వంలో అలంకారాలు

3.2.3.2. అలంకార ప్రయోజనం

3.2.3.3. అలంకార నైపుణ్యం

3.2.3.4. శబ్దాలంకారాలు

3.2.3.4.1. వృత్త్యనుప్రాస అలంకారం

3.2.3.4.2. అంత్యానుప్రాస అలంకారం

3.2.3.5. అర్థాలంకారాలు

3.2.3.5.1. రూపకాలంకారం

3.2.3.5. ఉపమానాలు

3.2.4. రసం

3.2.5. మానవతావాదం

3.2.6. ప్రశ్నార్థకాలు

## నాల్గవ అధ్యాయం

## వృద్ధోపనిషత్ కవి సందేశం (106 – 125)

4.0. పరిచయం

4.1. నిరాశ నిస్పృహలను జయించడం

4.2. చిరకీర్తికై పాటుపడడం

4.3. సమాజానికి వృద్ధుల పురస్కృతి

4.4. వృద్ధులలో సమాజం గుర్తించిన ప్రయోజనాలు

**ముగింపు** ------------------------------ 126 – 127

**ఉపయుక్త గ్రంథసూచి** 128 – 130

**అనుబంధం** 131 – 133

*****

# కృతజ్ఞతలు

నాకు జన్మ నిచ్చిన నా తల్లిదండ్రులు సత్యమ్మ, వెంకటయ్యలకు, నాకు ఊహ తెలిసినప్పటి నుంచి నన్ను పోషించిన నానమ్మ తాతయ్య నర్సమ్మ, హన్మయ్యలకు, పాఠశాల స్థాయి నుండి విశ్వవిద్యాలయం వరకు చదువు నేర్పిన గురువులందరికి...

నా ఆసక్తిని గమనించి పరిశోధనాంశాన్ని సూచించి తమ పర్యవేక్షణలో పరిశోధన చేయడానికి అవకాశం కల్పించి ఎంతో సహృదయతో ఆత్మీయంగా పలకరిస్తూ పరిశోధనకు కావలసిన అమూల్యమైన సలహాలు సూచనలు ఇస్తూ సమయానికి నా పరిశోధన పూర్తి చేయడానికి సహాయ సహకారాలు అందించిన గురువుగారు ఆచార్య పిల్లలమర్రి రాములు గారికి ప్రత్యేక ధన్యవాదాలు.

'వృద్ధోపనిషత్' ఈ కావ్యం పై పరిశోధన చేయాలని అడగగా వెంటనే గోపి గారి సలహా కొరకు సంప్రదించినప్పుడు ఆ కావ్యంపై పరిశోధన చేయమని ప్రోత్సహించి అందుకు తగిన సలహాలు, సూచనలు ఇస్తూ తగిన ఆధార గ్రంథాలు సూచించిన ఆచార్య ఎన్. గోపి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

నాకు పరిశోధన చేయడానికి అవకాశం ఇచ్చిన తెలుగు శాఖాధిపతి ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారికి ప్రత్యేక ధన్యవాదాలు.

ఎం. ఏ లో తమ బోధనల ద్వారా నన్ను పరిశోధన స్థాయిలో నిలబెట్టిన హైదరాబాద్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ఉన్నటువంటి అధ్యాపకులు ఆచార్య రేమిళ్ళ వెంకట రామకృష్ణశాస్త్రి గారికి, ఆచార్య ఎస్. శరత్ జ్యోత్స్నారాణి గారికి, ఆచార్య తుమ్మల రామకృష్ణ గారికి, ఆచార్య జి అరుణ కుమారి గారికి (విశ్రాంతాచార్యులు), ఆచార్య పమ్మి పవన్ కుమార్ గారికి, ఆచార్య ఎం. గోన నాయక్ గారికి, ఆచార్య డి. విజయలక్ష్మి గారికి, డాక్టర్ డి. విజయ కుమారి గారికి, డాక్టర్ బాణాల భుజంగరెడ్డి గారికి, డాక్టర్ భూక్యా తిరుపతి గారికి, కీ. శే. ఎండ్లూరి సుధాకర్ గారికి హృదయపూర్వక నమస్కారాలు.

నా పరిశోధనకు కావలసిన అమూల్యమైన గ్రంథాలు సేకరించుకోవడనికి సహకరించిన హైద్రాబాద్ విశ్వవిద్యాలయం ఇందిరాగాంధీ మెమోరియల్ గ్రంథాలయం వారికి ధన్యవాదాలు.

నేను డిగ్రీ మూడవ సంవత్సరం చదువుతున్నప్పుడు డిగ్రీ అయిపోయిన తర్వాత ఏమి చేయాలో తోచనప్పుడు, ఎం ఏ (తెలుగు) చెయ్యండి అని సలహా ఇచ్చిన డాక్టర్ నారాయణరావు సార్ గారికి ప్రత్యేకంగా...

నేను ఎం. ఫిల్ లో చేరిన తర్వాత పరిశోధన ఏ విధంగా చేయాలి అనే సలహాలు ఇచ్చినటువంటి మంత్రి మల్లేష్ అన్న, కమలాకర్ అన్న, రాజీవ్ అన్న, సుదర్శన్ అన్న, సైదారావుకి, శ్రీనివాస్ సారులకు...

నా ఎం.ఫిల్ పరిశోధన లో భాగంగా నేను ఏద్దైనా రాసినప్పుడు దానిని చూసి, దానికి తగిన సలహాలు సూచనలు అందించిన నా తోటి విద్యార్థులు అయిన మల్లేష్, మధులకు స్నేహపూర్వకంగా...

నేను పిహెచ్. డి స్థాయి వరకు చదువుకునేందుకు ముఖ్య కారకులు అయిన నా కుటుంబ సభ్యులు బాబాయి పవన్, అక్క లక్ష్మి, మేనత్త సంతోష, అలాగే గత కొన్ని సంవత్సరాల నుండి నాకు తోడుగా ఉన్న ఆత్మీయ స్నేహితులు సంతోష, మల్లేశం, శ్రీనివాస్, నర్సిములు అన్న, వెంకటేష్, శ్రావణ్ లకు, పరిశోధన సమయంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన మిగతా మిత్రులందరికీ...

హృదయపూర్వక ధన్యవాదాలు.

**మీ**

**జి. కృష్ణవేణి**

# ప్రవేశిక

తెలుగు సాహిత్యంలో ఎందరో కవులు సమాజ శ్రేయస్సు కోరి సాహిత్య కృషి చేస్తున్నారు. ఇంకొందరు సమాజంలో చైతన్యం తీసుకొచ్చేలా కవిత్వం రాస్తున్నారు. మరికొంతమంది మనుషులలో కనుమరుగైపోతున్న మానవతా విలువలను తట్టిలేపేందుకు కృషి చేస్తున్నారు. ఈ చివరి కవులలో ముందువరుసలో నిలవదగిన గొప్ప మానవతావాది ఆచార్య ఎన్. గోపి గారు. వీరి కలం కొన్ని సార్లు సమాజంలోని అనేక సమస్యలతో సతమతమవుతున్న మనిషి జీవితాన్ని ఆధారంగా చేసుకుని సాగుతుంది, ఇంకొన్ని సార్లు ప్రాంతీయ అస్తిత్వానికి ఊపిరి పోస్తుంది. తెలుగు సాహిత్యంలో ఐదు దశాబ్దాలుగా సుదీర్ఘ ప్రయాణం చేసి కవిత్వంలో బహు పార్శ్వాలను అందించిన నిబద్ధ సాహితీవేత్త వారు.

కవి బాధాతప్తుల పక్కన నిల్చేవాడని ప్రగాఢంగా విశ్వసించే గొప్ప మానవతావాది కాబట్టే నేడు ఈ **"వృద్ధోపనిషత్"** కావ్యం ద్వారా పాఠకుల ముందుకు వచ్చారు. ఇందులో మొత్తం నలభై ఒక్క (41) కవితలు ఉన్నాయి. గోపి గారు ఈ కావ్యాన్ని సాహితీప్రియుడు వంగల హర్షవర్ధన్ గారికి అంకితం ఇచ్చారు. ఈ కావ్యంలో **"వయోధికులనే"** ప్రధాన వస్తువుగా ఎంచుకుని వారిలో ఆత్మ స్థైర్యాన్ని నింపి, వారిని మానసికంగా, ధైర్యంగా ఉండేటట్లు ప్రయత్నం చేశారు. వృద్ధాప్యం దేహానికే కాని జ్ఞానానికి కాదన్న వాస్తవాన్ని ఈ కావ్యం ద్వారా నిరూపించారు.

ఆధునిక సమాజం సాంకేతిక విజ్ఞానపరంగా పరుగులు పెడుతోంది. ఈ ఆధునిక పోకడలలో మనుషులు ఒక యంత్రం మాదిరిగా తయారయ్యి మానవతా విలువలను కోల్పోతున్నారు. కాలమనేది దోసిట్లో పట్టుకున్న నీరులా వేళ్ల మధ్య నుంచి జారిపోతుంది. రెప్పలు మూయటం తెరవటంలోనే మనిషి జీవితం పరుగులు తీస్తుంది.

"పరుగులు తీసే జీవితంలో
ముసుగులు తొడిగిన పరిణామాలెన్నో"

ఈ "వృద్ధోపనిషత్" కావ్యాన్ని పఠిస్తున్నంతసేపు, పరిశీలించినప్పుడు నాకు కొంతమంది మేధావుల సూక్తులు కూడా జ్ఞప్తికి వస్తున్నాయి.

"నేను నా పూర్వీకుల భుజాలపై నిలబడటం వల్ల ముందుకు చూడగలిగాను" అన్న గొప్పతనం ఐన్ స్టీన్ గారిది. "నా పూర్వీకులంతా మూర్ఖులు. పనికిరాని వారు. నేనే మేధావిని" అనటం ఆధునిక తెలుగు మేధావుల లక్షణంగా మారింది. ఇక్కడ పూర్వీకులు అంటే ఎవరో ప్రాచీన కాలంవారు కాదు. మనకంటే ఒక తరం ముందు జన్మించి, మనకంటే ముందు జీవితానుభవాన్ని పొందినవారు వారే మన పెద్దలు. గోపి గారు పై సూక్తికి బద్ధులు కనుకనే వారు "వృద్ధోపనిషత్" కావ్య కర్తవ్యాన్ని నిర్వర్తించడానికి పూనుకున్నారు.

నేను ఎం. ఫిల్‌లో పరిశోధనాంశం గురించి గురువుగారు ఆచార్య పిల్లలమర్రి రాములు గారిని సలహా అడగగా, సార్ వెంటనే ఆచార్య ఎన్. గోపి గారు రాసినటువంటి "వృద్ధోపనిషత్" కావ్యాన్ని సూచించి పరిశోధన చేయమనడం నన్ను సన్మార్గంలో ప్రయాణించేందుకు దోహదపడిందని నేను ప్రగాఢంగా విశ్వసిస్తున్నాను.

**"ఎన్. గోపి వృద్ధోపనిషత్ కావ్యం సాహిత్య సామాజికాంశాల పరిశీలన"** అనే పరిశోధన వ్యాసాన్ని ఎం. ఫిల్ కాల పరిధి దృష్ట్యా నాలుగు అధ్యాయాలుగా విభజించాను. ఒక్కొక్క అధ్యాయంలో నేను పరిశోధించి పరిశీలించిన అంశాలను కింద పొందుపరిచాను.

మొదటి అధ్యాయం **"ఆచార్య ఎన్. గోపి జీవితం – సాహిత్యం"**. ఈ అధ్యాయంలో గోపి గారి బాల్యం, వైవాహిక జీవితం, ఉద్యోగ జీవితం, సాహిత్య ప్రస్థానం, విమర్శన గ్రంథాలు, పరిశోధన కృషి, అనువాదాలు, యాత్రాచరిత్ర గ్రంథాలను గురించి పరిచయం చేస్తూ, గోపి గారు ప్రవేశపెట్టిన నూతన కవిత ప్రక్రియ నానీలు మొదలైన అంశాలను మొదటి అధ్యాయంలో పరిచయం చేశాను.

రెండవ అధ్యాయం **"వృద్ధోపనిషత్ సామాజిక అంశాల పరిశీలన"**. ఈ అధ్యాయంలో వృద్ధోపనిషత్ కావ్యంలోని సామాజికాంశాలను గురించి విశ్లేషించాను. ప్రపంచంలోని ప్రతి ప్రాణి జీవన యాత్రలో వృద్ధాప్యం ఒక మజిలీ లాంటిది. మనుషులలో కూడా అది ఒక సామాన్యమైన దశ, ప్రకృతిసిద్ధమైన దశ. అలాంటి సమయంలో వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరిస్తూ, వృద్ధులను చైతన్యపరిచే విధంగా గోపి గారు వారి కలాన్ని ఎలా పయనింపజేశారో

వివరించాను. అదేవిధంగా శేష జీవితంలో కుటుంబ సభ్యులు వృద్ధులను ఎలా ఆదరిస్తున్నారు, వృద్ధులు సమాజం, కుటుంబం నుండి ఎదుర్కొంటున్న సమస్యలను, వారి శారీరక, ఆర్థిక, సామాజిక, మానసిక పరిస్థితులు ఏ విధంగా ఉన్నాయనే అంశాలను ఈ అధ్యాయంలో తెలియజేశాను.

మూడవ అధ్యాయం **"ఆచార్య ఎన్. గోపి రచనా శిల్పం"**. ఈ అధ్యాయంలో గోపి గారి రచన శైలి, కావ్యంలో శిల్ప ప్రయోగం ఏ విధంగా ఉందనే విషయాలను వివరించాను. అలాగే వృద్ధోపనిషత్‌లో కవి ఉపయోగించిన ప్రతీకలు, భావచిత్రాలు, అలంకారాలు, మానవతావాద దృష్టి మొదలైన అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాను.

నాల్గవ అధ్యాయంలో **"వృద్ధోపనిషత్ కవి సందేశం"**. ఈ అధ్యాయంలో గోపి గారు ప్రబోధించిన జీవిత సాఫల్య సూత్రాలను గురించి చర్చించాను. వృద్ధాప్య సమయంలో వృద్ధులు తమ వృద్ధాప్య జీవితాన్ని ఏ విధంగా గడపాలి, వృద్ధాప్య భావనను ఎలా జయించాలనే అంశాలను పరిశీలిస్తూ, వృద్ధుల పట్ల కుటుంబాలు మరియు సమాజం ఎలా ప్రవర్తించాలనే విషయాలను తెలియజేశాను. సమాజానికి వయోధికుల జ్ఞాన సంపద వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేసేలా గోపి గారు రాసినటువంటి కవితాంశాలను గురించి ఈ నాల్గవ అధ్యాయంలో విశ్లేషించాను.

## మొదటి అధ్యాయం

# ఆచార్య ఎన్. గోపి జీవితం - సాహిత్యం

# మొదటి అధ్యాయం

# ఆచార్య. ఎన్. గోపి జీవితం – సాహిత్యం

## 1.0. పరిచయం

ఆధునిక తెలుగు సాహిత్యంలో గోపి గారికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. ప్రస్తుత వర్తమాన కాలంలో ఆయన గురించి తెలియని సాహితీ ప్రియులు లేరనడంలో అతిశయోక్తి లేదు. నూతన కవితా ప్రక్రియ నానీల సృష్టికర్తగా తనకంటూ ప్రత్యేకమైన పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య ఎన్. గోపి. ఈయన చిన్నతనం నుండే కవిత్వ కళను ఒంటబట్టించుకొని సమాజంలో జరుగుతున్న అనేక అంశాలను, సంఘటనలను, మార్పులను వస్తువులుగా ఎంచుకొని, సంఘంలోని లోపాలను ఎత్తి చూపే ప్రయత్నం చేస్తున్నారు. సాహిత్యం ద్వారానే సమాజాన్ని అధ్యయనం చేసి మనుషుల మనస్తత్వాలను అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. తనకు కనిపించిన, తాను అనుభవించిన, మనసుకు స్ఫురించిన ప్రతి విషయాన్ని, ప్రతి సన్నివేశాన్ని వాస్తవిక దృక్పథంతో తన కవిత్వంలో చూపించారు.

ఎన్. గోపి గారిని మొదట గోపి అని పిలిచేవారు. ఆయన వేమనపై అపారమైన పరిశోధన చేసిన తర్వాత వేమన గోపి అనే పేరును సాహితీ లోకంలో స్థిరపరుచుకున్నారు. ఆ తర్వాత తెలుగులో సృష్టించిన నూతన కవితా ప్రక్రియగా నానీలు ప్రవేశపెట్టి ఎందరో కవులకు ఆదర్శంగా నిలిచారు. అప్పటి నుండి నానీల గోపి, నానీల నాన్నగా ప్రసిద్ధి చెందారు. ఇప్పుడు వెలువరించిన వృద్ధోపనిషత్ కావ్యం మూలంగా తెలుగు సమాజంలో గొప్ప మానవతావాదిగా నిల్చిపోతున్నారు.

ఆధునిక కవితా రంగంలో విస్తృతమైన కవిత్వాన్ని రాసిన వారిలో గోపి ముందుంటారు. తెలుగు సాహిత్యంలో ఐదు దశబ్ధాలుగా సుదీర్ఘ ప్రయాణం చేసి కవిత్వంలో స్థానీయతను ప్రతిబింబింపజేస్తున్న నిబద్ధ సాహితీవేత్త. సాహిత్య బాటలో కవిగా, పరిశోధకులుగా, విమర్శకులుగా, అనువాదకుసుగా, కాలమిష్టుగా అనేక రూపాలలో రూపాంతరం చెందుతూ

తనదైన శైలిలో గుర్తింపు తెచ్చుకున్నారు. కాలానికి అనుగుణంగా కవితలు రాస్తూపోవడం మూలంగా వీరి కవిత్వం నిండా మానవతావాదం, అభ్యుదయ దృక్పథం, సామాజిక స్పృహ దర్శనమిస్తాయి.

గోపి గారు చిన్ననాటి నుండే సాధారణ జీవితాన్ని గడిపినా, పేదరికం వల్ల ఏనాడు కష్టాలకు కుంగిపోకుండా నిత్యం తన పని తాను చేసుకుంటూ శ్రమని నమ్ముకుని ముందుకు సాగారు. వారి నిబద్ధతకు నిదర్శనమే "ప్రజాకవి వేమన" పరిశోధన గ్రంథం. ఈ పరిశోధనలో గోపిగారు వేమనను ప్రజాకవిగా గుర్తించి నిరూపించే ప్రయత్నం చేశారు. వేమన ప్రభావం మూలంగానే మనిషిని కేంద్రంగా చేసుకొని కవిత్వం రాస్తూ వచ్చారు. చిన్నప్పుడే కలంపట్టి జీవిత సత్యాలనే అక్షర రూపాలుగా మార్చారు. అనుభవమే అక్షరమవుతుంది. ఎంత గొప్పగా అనుభవాల్ని పోగేసుకోగల్గితే అంత గొప్పగా అక్షరాల్ని పేర్చగలమని నిరూపించిన అక్షర శిల్పి గోపి గారు.

ఆచార్య ఎన్. గోపిగారు స్పృశించిన ప్రతి వస్తువు కవితామయమవుతుంది. ఎందుకంటే చిన్న రొట్టె ముక్కను చూసినా, బొంతను చూసినా, కన్నీళ్ళుకార్చే కళ్ళను చూసినా అందులో కవితా వస్తువును దర్శిస్తారు. సాధారణంగా రహదారి పక్కన పెరిగేటటువంటి తంగెడుపూలకు తెలంగాణరాష్ట్ర కష్టజీవుల సంస్కృతికి ఉన్న విడదీయరాని అనుబంధాన్ని వివరించారు. తంగెడుపూలను "మనసున్నపూలు, మమతలున్న పూలు, వలపు బాసలు నేర్చిన పూలు, పేద పూలు పేదల పూలు...! అంటూ అంచులోకి నెట్టివేయబడిన శ్రామికసంస్కృతికి ప్రతీకలుగా పేర్కొన్నారు. అప్రధానీకరింపబడిన, మనసులు మమతలు ఉన్నవి"[1] అంటూ తంగెడుపూల మనస్తత్వాన్ని తెలంగాణ ప్రజల మనసులతో మమేకం చేసిన గోపి గారి భావాన్ని పెన్నా శివరామకృష్ణగారు ఎంతో అద్భుతంగా వివరించారు. 'కాదేదీ కవితకనర్హం' అని శ్రీశ్రీ అన్నట్టు గోపిగారు ఏ వస్తువునయినా కవిత్వంగా చిత్రించగల ప్రతిభాశాలి, ప్రజ్ఞాశీలి. భిన్న వస్తువుల ఎంపికలో ముందుగా చెప్పుకునేది వృద్ధోపనిషత్ కావ్యం. ఎందుకంటే ఇంతకుముందు ఎంతో

[1] శివరామకృష్ణ, పెన్నా. ఎన్. గోపి కవితా తత్త్వ వివేచన. 2020. ప్రవాహిని ప్రచురణలు. హైదరాబాదు. పుట. 12

మంది కవులు జాలితో వృద్ధాప్యంపై, వృద్ధాప్య సమస్యలపై అక్కడక్కడా కవిత్వం రాసే ప్రయత్నం చేసారు. ఇంకొంతమంది కవులు పెద్దలపై స్మృతి కవిత్వం కూడా రాసారు. అందులో నాయిని సుబ్బారావు గారు 'మాతృగీతాలు' లో తన తల్లిపై స్మృతి కవిత్వం రాస్తూ...

'ఎవ్వడా క్రూరకర్ముడెవడు ! నీల
జలదనిరముక్తశైశిరశర్వరీప్ర
శాంతమలవాటుపడిన నిశాంతమందు
అకట నట్టింటదీపమార్పినాడు.'

తల్లిపై ఉన్న ప్రేమను, తల్లి మరణం వలన పొందిన వేదనను వివరించాడు. కానీ ప్రత్యేకంగా వృద్ధులలో మానసిక స్థైర్యాన్ని నింపి వారి అభ్యున్నతికై కవిత్వం రాసే ప్రయత్నం చేసిన వారు చాలా అరుదు. అలాంటిది గోపిగారు 'వృద్ధోపనిషత్' అనే కావ్యాన్ని రాసి సమాజానికి పెద్దవారు, వయోధికులు, అనుభవజ్ఞులు ఎంత ముఖ్యమో తెలియజేస్తున్నారు.

## 1.1. జననం

ఆచార్య ఎన్. గోపి పూర్తి పేరు నక్క గోపాల్. ఈయన 1950 జూన్ 25వ తేదీన నల్లగొండ జిల్లా భువనగిరి ప్రాంతంలోని రాజంపేట గ్రామంలో నక్క లక్ష్మమ్మ, చెన్నయ్య దంపతులకు జన్మించాడు. వీరికి మొత్తం ఐదుమంది సంతానం. పెద్ద కూతురు ఆండాళమ్మ, రెండవ కూతురు లక్ష్మీ నరసమ్మ, మూడవ కుమారుడు కృష్ణమూర్తి, నాల్గవ కుమారుడు గోపి, ఐదవ కుమారుడు వెంకటేశం. వీరిది చేనేత మధ్యతరగతి కుటుంబం. గోపి గారి తండ్రి చేనేత వృత్తిని చేస్తూ రాజంపేట నుండి భువనగిరి వరకు ముప్పై కిలోమీటర్లు నేసిన బట్టల మూటలు నెత్తిన పెట్టుకుని నడుచుకుంటూ వెళ్లి బట్టలు అమ్మి జీవనం కొనసాగించేవారు. అలా గోపి గారి తండ్రి యుక్త వయస్సులో ఎంతో కష్టపడడం మూలంగా చిన్న వయస్సులోనే మంచాన పడ్డారు. తరువాత కుటుంబ భారం అంతా తల్లి లక్ష్మమ్మ మీదనే పడింది. తల్లి రోజూ పంటపొలాల్లో కూలీ పని చేస్తూ పిల్లలను పోషించింది.

కుటుంబంలోని ఆర్థిక సమస్యల మూలంగా పెద్ద కూతురు ఆండాళమ్మకు తండ్రి 13వ ఏటనే పెళ్లి చేశారు. వివాహం జరిగిన కొన్ని రోజులకే రజాకార్ల ఉద్యమ కాలంలో ఆమె హత్యకు గురైంది. ఆమె జీవితాన్ని ఆధారంగా చేసుకుని బల్ల గౌతమయ్య అనే జానపద కవి నక్క ఆండాళమ్మ అనే కథను ఉయ్యాల పాట రూపంలో జానపద గేయాన్ని రాశారు. తెలంగాణలో జరిగే బతుకమ్మ పండుగ సందర్భంలో స్త్రీలు నక్క ఆండాళమ్మ పాటను పాడేవారు. గొప్ప కవి పరిశోధకుడు అయిన ఆరుద్ర గారు తన "సమగ్రాంధ్ర సాహిత్యం"[2] గ్రంథంలో నక్క ఆండాళమ్మ వృత్తాంతాన్ని రాసారు. గోపి గారి అన్న కృష్ణమూర్తి రైల్వే ఆఫీసర్ గా పనిచేసి పదవి విరమణ పొందారు. గోపి గారి రెండవ అక్క లక్ష్మీ నరసమ్మ ఉపాధ్యాయురాలిగా పనిచేశారు. తమ్ముడు వెంకటేశం కూడా ఉపాధ్యాయులుగా కొనసాగారు.

## 1.2. విద్యాభ్యాసం

గోపి గారి తండ్రి మరణించిన తర్వాత తల్లి ఒక్కరే కూలీ పనులు చేస్తూ ఎంతో కష్టపడి పిల్లలను ప్రయోజకులను చేసింది. గోపి గారి ప్రాథమిక విద్య కాసమోల్ల బడిలో సాగగా, మాధ్యమిక విద్య సి.పి.యస్ పాఠశాలలో పూర్తయ్యింది. తొమ్మిదవ తరగతి నుండి పన్నెండవ తరగతి వరకు హయ్యర్ సెకండరీ పాఠశాలలో చదివారు. పాఠశాల స్థాయి విద్యాభ్యాసం అంతా పల్లె ప్రాంతాలలో సాగినప్పటికి ఉన్నత విద్య మాత్రం హైదరాబాదులో అభ్యసించారు. అప్పట్లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో డిగ్రీ కూడా ఉండేది. గోపి గారికి ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ శాఖ, అలాగే తెలుగు శాఖ రెండింటిలో కూడా సీట్ వచ్చింది. మొదట ఇంజనీరింగ్ లో చేరినప్పటికీ తెలుగు సాహిత్యం పట్ల ఉన్న అభిరుచి బి. ఎ తెలుగులోకి మారేలా చేశాయి. తెలుగు సాహిత్యంపట్ల ఉన్న ఆసక్తే గోపి గారికి తరగతిలో ఎక్కువ మార్కులతో ఉత్తీర్ణత పొందేందుకు ఉపకరించింది.

గోపి గారికి చిన్నతనం నుండే కవిత్వం రాయాలనే అభిరుచి ఉంది. ఏడవ తరగతి చదువుతున్నప్పుడే భువనగిరిలో ఉన్న లైబ్రరీలో ఐదు రూపాయలుకట్టి సభ్యత్వం తీసుకుని అక్కడ

2ఎన్. గోపి కవితా తత్త్వ వివేచన. పెన్నా శివరామకృష్ణ. 2020. పుట. 103.

ఉన్న పుస్తకాలు చదివి వాటిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించేవారు. ఎక్కువగా సి. నారాయణ రెడ్డి(సినారె) గారి పుస్తకాలు చదవడం మూలంగా సినారె సాహిత్యానికి ముగ్ధులైపోయారు. చదివిన పుస్తకాలకు అర్థం చేసుకున్న తీరునుబట్టి ఆ పుస్తకాల మీద ఉన్న చిరునామా సహాయంతో సినారెగారికి ఉత్తరాలు రాసి పంపేవారు, అవి చూసిన సినారెగారు తిరిగి ఉత్తరం రాసేవారట. ఒకరోజు సినారెగారిని చూడడానికి గోపిగారు భువనగిరి నుండి సికింద్రాబాద్ వచ్చి, అక్కడినుండి ఆర్ట్స్ కాలేజీ వరకు నడుచుకుంటూవెళ్లి కలిసారట. అక్కడ నారాయణరెడ్డిగారు గోపి గారిని చూసి నువ్వు ఇంత చిన్నవాడివా కవిత్వం భలే రాస్తున్నావే అని మెచ్చుకున్న సందర్భం గోపి గారికి జీవితంలో మరిచిపోలేని మధుర జ్ఞాపకం.

బి. ఎ లో మంచి మార్కులతో పాసయ్యి మెరిట్ స్కాలర్షిప్ పొంది, ఆ స్కాలర్షిప్ సహాయంతో ఎం. ఏ ఉస్మానియా ఆర్ట్స్ కళాశాలలో చేరారు. ఎం. ఏలో కూడా తరగతిలోనే కాకుండా విశ్వవిద్యాలయం మొత్తంలో మొదటి శ్రేణిలో పూర్తిచేసారు. గోపిగారు ఎం. ఏ పూర్తవకముందే మహబూబ్ నగర్ జిల్లాలో నాన్ ఫార్మల్ ఎడ్యుకేషన్ ప్రాజెక్టుకు ఆఫీసరుగా ఎంపికయ్యారు. ఒకవైపు ఉద్యోగం చేస్తూ మరోవైపు పిహెచ్. డి పరిశోధనకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఆచార్య అమరేశం రాజేశ్వరశర్మగారి పర్యవేక్షణలో **"ప్రజాకవి వేమన"** అనే అంశంపై పిహెచ్. డి పరిశోధన ప్రారంభించారు. మొదట్లో గోపి గారు ఈ పరిశోధన పూర్తి చేయడం నాకు సాధ్యమవుతుందా అని కొంత నిస్సహాయతకు గురైనప్పటికీ దృఢసంకల్పంతో వెనుకడుగు వేయకుండా ముందుకుసాగి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చిరస్థాయిగా నిలిచిపోయేటటువంటి పరిశోధనా గ్రంథాన్ని వెలువరించి పిహెచ్. డి పట్టా పొందారు. ఎంతో గొప్ప కృషిచేసి పరిశోధన ముగించడం మూలంగానే **'ప్రజాకవి వేమన'** అనే పరిశోధన గ్రంథం ప్రామాణికత విలువలు పొంది కన్నడ భాషలోకి కూడా అనువదించబడింది.

తన పరిశోధనకోసం వేమన పద్యాలు సేకరించడానికి ప్రతి సంవత్సరం వేసవి సెలవులలో మద్రాసుకు వెళ్ళి మద్రాసు గ్రంథాలయంలోని రాతప్రతులను సేకరించి వాటిని ఉదయం నుండి సాయంత్రం వరకు రోజుకు నూటా ఇరవై (120) పద్యాల చొప్పున తన పుస్తకంలో

రాసుకునేవారు. ఆ కాలంలో జిరాక్స్ మిషన్ లు ఉండేవి కాదు. కాబట్టి మొత్తం తన కలంతో రాసుకునేవారు. అలా రాస్తుండగా వేమనది ఒక్కొక్క పద్యం చదువుతున్నప్పుడు గోపి గారిలో ఏదో తెలియని అనుభూతి కలిగేదని చెప్పుకున్నారు.

పరిశోధనకై యాభైవేలు అప్పుచేసి మరీ పరిశోధనను పూర్తి చేశారు. వేమన మీద మొట్టమొదటిసారిగా ఇంత విస్తృతంగా పరిశోధన చేసిన వారిలో మొదటి పరిశోధకుడు గోపిగారని చెప్పడం అతిశయోక్తి కాదు. అందుకు నిదర్శనం ఈ పరిశోధన గ్రంథం ఆరు ముద్రణలు పొందడమే. ఈ పరిశోధన మూలంగా గోపి కాస్త వేమన గోపి అని పిలిచేంతగా గుర్తింపు పొందారు. గోపి గురువు సినారె గారి "ఆధునికాంధ్ర కవిత్వం-సంప్రదాయాలు: ప్రయోగాలు" అనే సిద్ధాంత గ్రంథం కంటే గోపి గారి "ప్రజాకవి వేమన" పరిశోధన గ్రంథం ఎక్కువ ముద్రణలు పొందిందని ఎంతో పరవశించిపోయారు. ఈ విషయాన్ని గోపి గారు చాలా గౌరవంగా భావిస్తారు.

## 1.3. వైవాహిక జీవితం

గోపి గారికి పిహెచ్. డి చేస్తున్న సమయంలో తనతోపాటు పరిశోధన చేస్తున్న పరిశోధకురాలు అరుణగారితో పరిచయమేర్పడింది. అలా పరిచయమైన వీరిరువురు, ఒకరినొకరు ఇష్టపడి వివాహం చేసుకున్నారు. అరుణగారు కూడా మంచి పేరుపొందిన రచయిత్రి. వీరు మౌనం మాట్లాడుతుంది, పాటల చెట్టు, అమ్మ ఒక మనిషి, ఇత్తడి బిందెలు, హృదయమే వదనం, సూది నా జీవన సూత్రం, నిరీక్షణనే ఒక యాగం, కొన్ని తీగలు కొన్ని రాగాలు అనే కవితా సంపుటాలు, 'గుప్పెడు గింజలు' అనే నానీల సంపుటిని వెలువరించారు. వీరికి ఇద్దరు సంతానం అమ్మాయి రచన అబ్బాయి చైతన్య.

## 1.4. ఉద్యోగ జీవితం

ఎం. ఏ చదువుతున్న సమయంలో మహబూబ్ నగర్ జిల్లాలో యూనిసెఫ్ లో నాన్ ఫార్మల్ ఎడ్యుకేషన్ ప్రాజెక్టులో ఉద్యోగం వచ్చింది. అలా ఉద్యోగం చేస్తున్న కాలంలోనే హైదరాబాదులోని నానక్రామ్ భగవాన్దాస్ కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా ఉద్యోగం

వచ్చింది. తెలుగు మీద వారికున్న అభిమానంతో గోపిగారు పెద్ద ఉద్యోగం వదులుకొని అధ్యాపకులుగా చేరి కళాశాలలో పాఠాలు చెప్పేవారు. అలా ఆరు సంవత్సరాలు పాఠాలు బోధించారు.

1981లో ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో అధ్యాపకులుగా చేరారు. అక్కడ రెండు సంవత్సరాలు రీడరుగా పనిచేసి తర్వాత ప్రొఫెసర్ గా ఎదిగారు. తరువాతకాలంలో పాఠ్య ప్రణాళికసంఘం అధ్యక్షుడిగా 1992-94 వరకు కొనసాగారు. అలాగే 1994-96 వరకు ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు శాఖాధిపతిగా బాధ్యతలు నిర్వహించారు. బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మనుగా కొంత కాలం పని చేశారు. ఇవికాక మరో రెండు ముఖ్యమైన పదవులు కూడా చేపట్టారు. మొదట హాస్టల్స్ కి వార్డెను గా  పనిచేసి తర్వాత 1989-90 అసిస్టెంట్ చీఫ్ వార్డెనుగా ఉంటూ, స్టూడెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ లాంటి పదవులు నిర్వహించారు. తెలుగు విశ్వవిద్యాలయానికి 1992-2002 వరకు వైస్ ఛాన్సెలర్ గా పనిచేశారు. అలాగే కుప్పంలోని ద్రావిడ విశ్వవిద్యాలయంలో, కాకతీయ విశ్వవిద్యాలయంలో ఇన్చార్జ్ గా మరియు వైస్ ఛాన్సెలర్ గా (2001) పని చేశారు.

ఈ పదవులు గోపి జీవితంలో పొందిన అత్యున్నత గౌరవాలుగా చెప్పవచ్చు.  అత్యంత చిన్న వయస్సులో విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ పదవిని పొందిన మొట్టమొదటి ఆచార్యులు గోపి. ఇవే కాకుండా మరి కొన్ని పదవులు కూడా పొందారు.

అవి: గోపి గారు రాష్ట్ర స్థాయిలో వివిధ కమిటీలలో సభ్యులుగా పని చేసారు.

1. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సభ్యులుగా  పని చేశారు.(1984)
2. అంతర్జాతీయ తెలుగు టీచర్స్ అసోసియేషన్ కు ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా పనిచేశారు.(1996)
3. ఫిచర్ ఫిల్మ్ నంది అవార్డు కమిటీకి జ్యూరీ సభ్యులుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున 1996 లో ఉన్నారు.
4. తెలుగు విశ్వవిద్యాలయనికి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులుగా పనిచేశారు.(1999)

5. కేంద్ర సాహిత్య అకాడమీ న్యూఢిల్లీ సలహా సంఘానికి 2002–2003 వరకు సభ్యులుగా కొనసాగారు.
6. నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా సభ్యులుగా పనిచేసారు.(2008)
7. గోపిగారు రెండు సంవత్సరాలు తెలుగు విభాగాల శాఖకు పీఠాధిపతిగా(డీన్) వ్యవహరించారు.

ఇన్ని ప్రతిష్ఠాత్మకమైన పదవులను పొందిన గోపి గారు 2008 లో పదవి విరమణ పొందారు. ఎన్ని పదవులు నిర్వహించిన గోపి ఏనాడూ గర్వంతో పొంగి పోలేదు. ఒక వైపు పదవీ బాధ్యతలు నిర్వహిస్తూనే, మరో వైపు సాహిత్యకృషి నేటికీ చేస్తున్నారు.

## 1.5. సాహిత్య ప్రస్థానం

గత ఐదు దశాబ్ధాలుగా తెలుగు సాహిత్యంలో అస్తిత్వ మూలాలను కవిత్వమయం చేస్తూ నిత్యచలనశీల కవిగా పేరుపొందిన గోపిగారు తన పాఠశాల స్థాయినుంచే కవిత్వాలు రాయడం మొదలు పెట్టారు. గ్రంథాలయాలకు వెళ్ళి ఎన్నో కథలు, నవలలు, పత్రికలు శ్రద్ధగా పఠించి సాహిత్య పరిజ్ఞానాన్ని సంముపార్జించుకున్నారు. ఆ సాహిత్య పఠిమనే వారి కవితాత్మకతకు, భావుకతకు తోడ్పడిందని చెప్పాలి. ఆ భావుకతనే తెలుగు సాహిత్యంలో గోపి గారిని అత్యున్నత వ్యక్తిత్వం కలవాడుగా నిలబెట్టింది. ఆయన సమాజంపై ప్రభావం చూపుతున్న అంశాలను, సంఘంలో జరిగే అన్యాయాలను కవితా వస్తువులుగా చేసుకొని కవిత్వం రాస్తున్నారు. గోపిగారు కవిత్వంతో పాటు విమర్శన గ్రంథాలు, అనువాద గ్రంథాలు, యాత్రాచరిత్రలు కూడా రాసారు.

### 1.5.1 కవిత్వ సంపుటాలు

1. **తంగెడుపూలు** గోపి గారి మొదటి కవితా సంపుటి. ఈ కవితా సంపుటిని 1976 లో వెలువరించారు. ఈ కవితా సంపుటిని సి. నారాయణ రెడ్డిగారికి అంకితం ఇచ్చారు. ఈ సంపుటికి ఆంధ్రమహిళాసభ వారి దేవులపల్లి కృష్ణశాస్త్రి అవార్డు వచ్చింది. ఈ సంపుటి గురించి సుంకిరెడ్డి నారాయణరెడ్డి వ్యాసం రాస్తూ “ఆధునిక తెలుగు కవిత్వంలో బహుశా మొదటిసారి తెలంగాణకు ఒకానొక ప్రతీక అయిన తంగెడుపూల ఔన్నత్యాన్ని రాసినాడు

గోపి"[3] అని వివరించిన వాక్యాలను చూస్తేనే అర్థమవుతుంది గోపిగారు తంగెడుపూలు కవితా సంపుటిలో తెలంగాణా మట్టివాసనను ఎంత అద్భుతంగా చిత్రించారన్న విషయం.

2. **మైలురాయి** అనే రెండవ కవితా సంపుటి 1981లో వెలువడింది. మైలురాయికి ఫ్రీవర్స్ ఫ్రంట్  అవార్డు లభించింది.
3. 1989లో **చిత్రదీపాలు** అనే మూడవ కవితా సంపుటి వెలువరించారు. చిత్రదీపాలు సంపుటికి తెలుగు విశ్వవిద్యాలయం వారి ఉత్తమ కవితా పురస్కారం లభించింది. అదే విధంగా కరీంనగర్ లోని సాహితీ గౌతమివారి సినారె కవితా పురస్కారాన్ని కూడా అందుకున్నారు.
4. 1993లో **వంతెన** అనే నాలుగవ కవితా సంపుటిని వెలువరించారు. ఈ కవితా సంపుటికి అమలాపురంలోని సమత రచయితల సంఘం అవార్డు లభించింది.
5. ఐదవ కవితా సంపుటి **కాలాన్ని నిద్రపోనివ్వను**(1998). ఈ కవితా సంపుటిని శిలా వీర్రాజుగారికి అంకితమిచ్చారు. ఈ కవితా సంపుటికి 2000 సంవత్సరంలో కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు లభించింది. 'కాలాన్ని నిద్రపోనివ్వను' అనే కవిత సంపుటి ఎంతో గుర్తింపుపొంది ఇరవై మూడు భాషాలలోకి అనువాదం అయ్యింది.
6. గోపిగారు సృష్టించిన నూతన సాహిత్య ప్రక్రియ '**నానీలు**'. ఈ నూతన ప్రక్రియను గోపిగారు 1997 ప్రారంభించారు. 1998లో 'నానీల' సంపుటి వెలువడింది. ఈ నానీల సంపుటి పన్నెండు భాషల్లోకి అనువాదం అయ్యింది.
7. చుట్టుకుదురు (2000)
8. ఎండపోత (2002)
9. గోపీ నానీలు (2002)
10. **జలగీతం.** (2002) 'జలగీతం' అనే దీర్ఘ కావ్యాన్ని రాయడానికి ప్రధాన కారణం తాను పుట్టిపెరిగిన ప్రాంతాలలో కలుషితమైపోయిన నీరు ఉండడం మూలంగా అక్కడి ప్రజలు

[3] నిరంతర. సప్తతి సందర్భంగా ప్రత్యేక గ్రంథం. సంపాదకులు. ఎస్. రఘు. అథర్వ్, అభవ్ ప్రచురణలు, హైదరాబాద్, 2022. పుట. 339.

ఎదుర్కొంటున్న సమస్యలకి చలించిపోయి 'జలగీతం' అనే దీర్ఘ కావ్యం రాయడానికి పూనుకున్నారు. దీనిని జలపురుషుడుగా ప్రఖ్యాతి గాంచిన రాజేంద్రసింగ్ కు అంకితం చేశారు. ఈ దీర్ఘ కావ్యం పదకొండు భాషల్లోకి అనువాదం పొంది గోపి గారికి అంతర్జాతీయ కవిగా గుర్తింపు తెచ్చింది.

11. మరో ఆకాశం (2004)
12. అక్షరాల్లో దగ్ధమై (2006)
13. దీపం ఒక ఏకాంతం (2007)
14. గోవాలో సముద్రం (2008)
15. వాన కడిగిన చీకటి (2009)
16. మా ఊరు మహాకావ్యం (2010)
17. రాతి కెరటాలు (2011)
18. హృదయ రశ్మి (2013)
19. మళ్ళీ విత్తనంలోకి (2014)
20. పురివిప్పిన ఊపిరి (2015)
21. ఆకాశంలో మట్టి (2016)
22. జీవనభాష (2017)
23. ఎవరి దుఃఖమో అది (2018)
24. చైనా పద్యాలు (2019)
25. వృద్ధోపనిషత్ (2019)
26. ప్రపంచీకరోనా (2020)
27. మనిషిని కలిసినట్టుండాలి (2021)

### 1.5.2. విమర్శకులుగా కృషి

గోపిగారు కవిగా, పరిశోధకులుగానే కాకుండా విమర్శకులుగా కూడా ఎంతో గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగు సాహిత్యంలోని సుప్రసిద్ధ కవులు, కావ్యాలు, విమర్శకులు, విమర్శన గ్రంథాలు, పరిశోధకులపైన తనదైన ధోరణిలో విమర్శ కొనసాగించారు. వారు రాసినటువంటి విమర్శనా వ్యాసాలు అన్నీ కూడా విమర్శకులుగా గోపి గారి దృష్టి ఏ విధంగా ఉందనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. విమర్శలో ఏదో ఒక సిద్ధాంత ప్రతిపాదన అనేది ఖచ్చితంగా ఉండి విశ్లేషణాత్మక పద్ధతిలో సాగుతుంది. పరిశోధన, విమర్శ వేరు వేరు ప్రక్రియలు కావు రెండూ పరస్పరాధారితాలు, అంతర్భాగాలని నిరూపించేటటువంటి ప్రామాణికమైన సిద్ధాంత గ్రంథాన్ని వెలువరించారు.

1. వేమన వాదం (1979)
2. వేమన (1980)
3. వ్యాస నవమి (1986)
4. గవాక్షం (1992)
5. నిలువెత్తు తెలుగు సంతకం – సినారె వ్యక్తిత్వం (1992)
6. సాలోచన (పీఠికలు 1998)
7. వేమన్న వెలుగులు (2010)
8. జ్ఞాన దేవుడు
9. వ్యాస కలశం (2012)
10. వ్యాస జిజ్ఞాస (2016)

### 1.5.3. పరిశోధన

గోపిగారు పరిశోధనలో విమర్శలో నిశితమైన పరిశీలనా జ్ఞానం కలవారు. వారు వేమన మీద చేసిన పరిశోధన వేమన పద్యాల్లోని కవితా సౌందర్యాన్ని నిర్మాణ వ్యూహాలను సోపత్తికంగా వివరించే విధంగా ఉన్నది. గోపి కంటే ముందు వేమన గారిపైన పరిశోధన చేసిన పరిశోధకులు

అందరూ వేమన ఒక తాత్త్వికుడు, భౌతికవాదిగా, యోగి అని ప్రతిపాదించినారు. గోపి మాత్రం ఇవన్నీ కాదు వేమన 'ప్రజాకవి' అని సూత్రబద్ధంగా పరిశోధన ద్వారా నిరూపించారు.

1. ప్రజాకవి వేమన (1980)
2. వేమన పద్యాలు-పారిస్ ప్రతి (1990)
3. తొలి పరిశోధకులు (2008)

### 1.5.4. అనువాదాలు

గోపిగారు తెలుగు భాషలో కావ్యం రాయడమే కాకుండా అన్యభాషలలో పేరు పొందిన కావ్యాలను తెలుగు భాషలోకి అనువాదం చేసి ఎంతో గుర్తింపు పొందారు.

1. జ్ఞానదేవ (1982) పేరుతో మరాఠీ భాషలోని గ్రంథాన్ని తెలుగులోకి అనువాదం చేశారు.
2. తన్మయ ధూళి (2012)
3. మా ఊరి నది (2016)
4. పాగీ (2016)
5. విద్యాపతి ప్రణయగీతాలు (2016
6. జీది మజీయ (2019)(చైనీస్ కవితలు)

అన్యభాషలలోని గ్రంథాలను గోపిగారు అనువదించినట్లుగానే ఆయన రాసిన కావ్యాలు కూడా అనేక ఇతర భాషల్లోకి అనువాదమయ్యాయి. గోపి తెలుగు సాహిత్యంతో పాటుగా భారతీయ సాహిత్యంలో కూడా ఎంతో పేరుప్రఖ్యాతలు సంపాదించుకున్నారు. వీరి రచనలను ఎన్నింటినో అనువాదకులు వివిధ భాషలలోకి అనువాదం చేయడం జరిగింది. ఈ అనువాద కావ్యాల కారణంగా ఎన్. గోపి అంటే తెలియని ఆధునిక సాహిత్య పాఠకుడు లేరంటే అతిశయోక్తి కాదు.

1. జలగీతం
2. నానీలు
3. కాలాన్ని నిద్రపోనివ్వను

4. వృద్ధోపనిషత్

అనే కావ్యాలు దేశంలోని అనేక ఇతర భాషలలోకి అనువాదం అయ్యాయి.

### 1.5.5. యాత్రా చరిత్రకారుడు

యాత్ర మనిషి ఆలోచనలకు రంగులు దిద్ది మనసుకు రెక్కలు తొడిగించి ఆకాశ గగనంలో విహరించి, ప్రకృతి ఒడిలో పరవసించేలా చేస్తుంది. మనసుదేహంలోంచి ఓ నూతన భావనా భీజాన్ని మొలిపించి మరో ప్రకృతి కవిత్వానికి అంకురార్పణ గావిస్తుంటుంది. గోపిగారు కూడా దేశ విదేశాలను సందర్శించినప్పుడు అక్కడి ప్రకృతి సౌందర్యాలను, జనజీవన విధానాన్ని, ఆచారవ్యవహారాలకు ఆయన పొందిన అనుభూతిని, అక్కడి చారిత్రక, సామాజిక విశేషాలను తనలోనే దాచుకోకుండా తన కవితా పరిమతో పాఠకులతో పంచుకోవడం ఎంతో ఆనందంగా భావించే కవి. అలా ఆయన చేసిన యాత్రలన్నింటిని యాత్రాచరిత్ర గ్రంథాలుగా వెలువరించారు.

1. నేను చూసిన మారిషస్ (1996)
2. నా సైప్రస్ యాత్ర (2001)
3. అమెరికాలో తెలుగు యాత్ర (2002)
4. ఇంగ్లాండులో ఇరవైయైదు రోజులు (2004)
5. జర్మనీలో నా కవితా యాత్ర (2015)
6. చైనాలో కవితా యాత్ర (2019)

### 1.5.6. నానీల సృష్టికర్త

ఆధునిక తెలుగు సాహిత్యంలో ఆధునిక పరిణామాలకు చిహ్నంగా పుట్టుకొచ్చిన నూతన కవితా ప్రక్రియ నానీలు. నానీల సృష్టికర్త, నానీల రూపశిల్పిగా గోపి తనకంటూ ప్రత్యేకతను సంపాదించుకొని నానీలను రాయని కవే ఆధునిక తెలుగు సాహిత్యంలో లేరనేంతగా నానీల ప్రదాతగా గుర్తింపు పొందారు. నానీల గోపిగా ప్రాచుర్యం చెందారు.

నానీలు వచన కవితా ప్రక్రియలో వచ్చిన మినీ కవిత వంటివే కానీ మినీ కవిత్వం కాదు. హైకూల తరువాత వెలువడిన అత్యాధునిక కవితా రూపం నానీలు. నానీ కవిత మొదటగా

తెలుగులోనే, గోపిగారి కలం ద్వారానే ఉద్భవించింది. ఇది మరో భాష నుండి రాలేదు. హైకూలను పరిశీలించి వాటికన్నా మెరుగైనవి, సమయోచితమైనవి రచించాలన్న తపనతోనే గోపి గారు 'నానీలను' సృష్టించారు.

**నానీలు – నిర్వచనాలు**

1. "సూక్ష్మంలో మోక్షంలా నాలుగు పాదాల్లో అనంత భావాన్ని వ్యక్తపరిచేవే నానీలు".
2. నానీలంటే "నావి నీవి వెరసి మనవి" ఎన్. గోపి.
3. 'నానీ పువ్వు కాదు పుప్పొడి కాదు మేధోమధనంలో కళ్ళు తెరచే విత్తనం' – ఎస్. ఆర్. బల్లం
4. "నానీ మనసుల మధ్య మూగభావాల అక్షరాకృతి నానీ. మదిలో నానీ నానీ కవితా చిగుళ్ళు తొడగిన నగ్నభావాలు నానీలు" – తలతోటి పృథ్వీరాజ్

**నానీలు – లక్షణాలు :**

1. నాలుగు పాదాలుంటాయి.
2. మొదటి రెండు పాదాలు ఒక భావాంశాన్ని ప్రతిపాదిస్తాయి.
3. తరువాత రెండు పాదాలు మొదటి రెండు పాదాలకు సమర్థకంగానో, దృష్టాంతంగానో పూరకంగానో వుండాలి.
4. నానీ నాలుగు పాదాల్లో మొత్తం 20 అక్షరాలకు తగ్గకుండా 25 అక్షరాలకు మించకుండా వుండాలి.
5. ఒక్కో పాదంలో ఇన్నే అక్షరాలుండాలనే నియమం లేదు.
6. నానీ కవిత్వ నిర్మాణంలో ఐదు రకాలయిన పద్ధతులు కన్పిస్తాయి.

నానీ అంటే గోపి, గోపి అంటే నానీలుగా తెలుగుదేశంలో ప్రచారంలో వుంది. పూర్వం గోపి గారిని వేమన గోపిగా పిలిచేవారు. ప్రస్తుతం నానీల గోపిగా పిలుస్తున్నారు.

గోపి గారు 1998 లో 365 నానీలతో 'నానీలు' అనే గ్రంథాన్ని ప్రకటించారు. ఈ గ్రంథాన్ని ఎ.బి.కె ప్రసాద్ గారికి అంకితమిచ్చారు. మరలా 2002 లో 366 నానీలతో 'గోపి నానీలు' అనే మరో గ్రంథాన్ని వెలువరించారు.

**ఉదాహరణ:**

'కుండ ముక్కలైందా
కుమిలిపోకు
మట్టి మరో రూపంకోసం
సిద్ధమవుతుంది.' అంటూ ఆశావాదాన్ని ప్రకటిస్తూ...

'ఎన్ని జాతుల
సమాహారం మనదేశం
ఏ పూటా సుఖంగా లేదు..'

అంటూ నిర్వేదాన్ని ప్రకటిస్తూనే మనసు లోలోతులలో దాగిఉన్న మానవతా విలువలను తట్టిలేపుతున్నారు.

ఈ విధంగా గోపిగారు సృష్టించిన నానీలు ఆధునిక వచన సాహిత్య ప్రక్రియలలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకొని ద్వా.నా.శాస్త్రి, కోట్ల వెంకటేశ్వరరెడ్డి, ఎస్. రఘు వంటి ఎందరో సాహితీవేత్తలను, యువ కవులను ప్రభావితం చేస్తూ, నానీల ప్రక్రియలో కవిత్వం రాసేలా ప్రేరేపితం చేస్తున్నాయి.

## 1.5.7. పత్రిక సంపాదకుడు

**'తెలుగు పరిశోధన'** (1987) అనే త్రైమాసిక పత్రిక వ్యవస్థాపక సంపాదకులుగా కొనసాగారు.

### 1.5.8. ఇతరాలు

1. తెలుగు వాచకం (పాఠ్య పుస్తకం) (1982)
2. ప్రయోజన వాచకం – వయోజన విద్యావాచకం (1983)

3. అక్షరయానం (2005)

### 1.5.8.1. ఎన్. గోపి రచనలపై వచ్చిన వ్యాస సంపుటాలు

- గోపి కవితానుశీలన-వివిధ విమర్శకుల వ్యాసాలు (1998)
- గోపి సాహిత్య దర్శనం – దృక్కోణాలు సమీక్షణలూ (1998)
- గోపి కవితానుశీలన - ద్వా.నా.శాస్త్రి. (2001)
- జల దీపిక –గోపి జలగీతంపై వ్యాసాలు, ఎన్. అరుణ, సంకలనం. (2008)
- గోపి సాహిత్య వివేచన - డా.ఎస్. రఘు సంపాదకత్వం వహించిన వివిధ పండితుల వ్యాసాల సంకలనం. (2010)
- ఎన్. గోపి సాహిత్యస్ఫూర్తి, వ్యాసమాలిక. మోదుగుల రవికృష్ణ సంపాదకత్వం. (2017)
- ఎన్. గోపి కవితా తత్వవివేచన. పెన్నా శివరామకృష్ణ. (2020)
- నిరంతర, డా. ఎన్. గోపి సాహిత్యంపై విమర్శ, సమీక్షా వ్యాసాలు. ఎస్. రఘు సంపాదకత్వం. (2022)

### 1.5.8.2. గోపి సాహిత్యంపై వచ్చిన పరిశోధనలు

| వ. సం. పరిశోధకులు | విషయం | డిగ్రీ | విశ్వవిద్యాలయం | సంవత్సరం |
|---|---|---|---|---|
| 1. బి. జగన్నాథ్ | తంగెడుపూలు-ఒక పరిశీలన | ఎం. ఫిల్ | తెలుగు విశ్వవిద్యాలయం | 1992 |
| 2. బి. మల్లయచారి | మైలురాయి-ఒక పరిశీలన | ఎం. ఫిల్ | తెలుగు విశ్వవిద్యాలయం | 1997 |
| 3. ఎం. పద్మజ | డా. ఎన్. గోపి రచనలు- ఒక పరిశీలన | పిహెచ్. డి | ఆంధ్ర విశ్వవిద్యాలయం | 1998 |
| 4. గొట్టె శ్రీనివాసరావు | చిత్రదీపాలు-అధ్యయనం | ఎం. ఫిల్ | హైదరాబాద్ విశ్వవిద్యాలయం | 1999 |
| 5. పి. ముకుందరావు | ఎన్. గోపి జలగీతం – మానవీయ మహాకావ్యం | ఎం. ఫిల్ | హైదరాబాద్ విశ్వవిద్యాలయం | 2008 |

| | | | | |
|---|---|---|---|---|
| 5. గట్ల రవికుమార్ | గోపి కవిత–మానవత | పిహెచ్. డి | ఉస్మానియా విశ్వవిద్యాలయం | 2011 |
| 6. శ్రీలత | గోపి సాహిత్యం– వస్తురూప వివేచన | పిహెచ్. డి | హైదరాబాద్ విశ్వవిద్యాలయం | 2016 |

## 1.6. ఆచార్య గోపి పొందిన పురస్కారాలు

గోపిగారు వారి జీవన ప్రయాణంలో ఎన్నో మైలురాళ్ళు దాటుకుంటూ ఎన్నో అత్యున్నత పురస్కారాలు, బహుమతులు పొందడమైనది. "కాలాన్ని నిద్రపోనివ్వను" గ్రంథానికిగాను భారత ప్రభుత్వం ప్రకటించేటటువంటి అత్యున్నత సాహిత్య పురస్కారం అయిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును పొందారు.

- 'తంగెడుపూలు' గ్రంథానికి ఆంధ్ర మహిళాసభ వారి కృష్ణశాస్త్రి అవార్డు. 1978
- 'మైలురాయి' గ్రంథానికి ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డు. 1982
- మైలురాయికి తెలుగు విశ్వవిద్యాలయం ధర్మనిధి పురస్కారం.
- తెలుగు విశ్వవిద్యాలయం నుండి శ్రీమతి లక్ష్మీరమణ ఎండోమెంట్ అవార్డు. 1989
- 'చిత్రదీపాలు' కు సినారె కవితా పురస్కారం. 1989
- తెలుగు విశ్వవిద్యాలయం వారు 'చిత్రదీపాలు'కు ఉత్తమ కవితా సంపుటికి అవార్డును అందించారు. 1991
- 'వంతెన' సంపుటికి అమలాపురం నుండి విరసం అవార్డు. 1994
- ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు. 1995
- ఉత్తమ వ్యాస సంపుటిగా 'గవాక్షం' ఎంపికైంది. దీనికి విజయనగరం నుండి విజయ భావన అవార్డు లభించింది. 1995
- కురుగంటి సీతారామయ్య అవార్డు. 1999
- జ్యోత్స్న కళాపీఠం వారి సుగుణమణి సాహిత్య అవార్డు. 1999
- ఢిల్లీ తెలుగు అకాడమీ అవార్డు. 1999

- సాహితీరత్న నీలా జంగయ్య సాహిత్య అవార్డు. 1999
- అరుంధతీ కాలసమితి వారి దాశరథి అవార్డు. 2000
- కాలాన్ని నిద్రపోనివ్వను కు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు. 2000
- తణుకు నుండి బాలగంగాధర తిలక్ అవార్డు. 2001
- (SAPNA) – Sri Annamaacharya Project of North America, Chicago. 2001
- సినారె కళాపీఠం పాలకొల్లు వారు అందజేసిన సినారె సాహితీ పురస్కారం. 2002
- రాజమండ్రి నుండి ప్రతిభా వైజయంతిక పురస్కారం. 2002
- ఇండియన్ హైకూ క్లబ్, అనకాపల్లి వారు 'కవితా ప్రపూర్ణ' బిరుదు ఇచ్చారు. 2004
- విజయనగరం, విజయ భావన నుండి 'అభినవ వేమన' అవార్డు. 2005
- జాతీయ సాహిత్య పరిషత్ మెట్ పల్లి వారు 'నానీల త్రివిక్రముడు' బిరుదు ఇవ్వడం జరిగింది. 2005
- ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ వారి నుండి ఉగాది విశిష్ట పురస్కారం.2006
- ఆంధ్ర సారస్వత సమితి, మచిలీపట్నం వారు 'నానీల నాన్న' బిరుదును. 2006
- సనాతన ధర్మ చారిటబుల్ ట్రస్ట్, భీముని పట్నం ఆంధ్రప్రదేశ్ వారు అందజేసిన శివానంద ఎమినెంట్ సిటిజన్ అవార్డు. 2006
- 'జలగీతం' కు మాతృశ్రీ రాజహంస కృష్ణశాస్త్రి అవార్డు. 2007
- తేజ ఆర్ట్ క్రియేషన్స్ ఆలేరు, నల్లగొండ జిల్లా, ఆంధ్రప్రదేశ్ వారు లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ అవార్డు. 2009
- శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం, హైదరాబాద్ వారు అవార్డు ప్రధానం చేశారు. 2009
- దాశరథి కృష్ణమాచార్య సాహితీ పురస్కారం. 2009
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'కళారత్న' అవార్డు.

- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున 'బోయి భీమన్న' పురస్కారం లభించింది. 2011

## 1.7. ఆచార్య గోపి పై ప్రముఖుల అభిప్రాయాలు

తెలుగు సాహిత్యానికి ఎనలేని కృషి చేస్తూ, తెలుగు భాషకి ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చిపెట్టినటువంటి గోపి గారిని ఎంతో మంది సాహితీవేత్తలు అభినందించారు. పలువురు సాహితీ ప్రముఖుల అభిప్రాయాలు తెలుపుతూ...

- 'గోపి గారు చిన్న చిన్న వస్తువులను తీసుకొని కవిత్వం రాస్తారు'[4].
  ఉదా:- గోపి గారు బస్సులోంచి మగత కన్నులతో పిట లేగరేసే మేఘాల ప్రకృతి దృశ్యాలను గుడిని హోటళ్ళలో ప్రవహించే పడుచుదనపు జీవిత దృశ్యాలను దర్శించి చిత్రించాడు.
- 'గోపి కవిత్వంలో అలంకారాలు లేవు. అర్థం కాని మాటల్లేవు. అన్వయ కాఠిన్యం లేదు. సాధారణంగా ప్రతి కవి వాడే కవితా సామాగ్రిని పరిహరించి, జీవిత సన్నివేశాన్ని సహజ భాషలో ప్రదర్శించాడు'[5] అని గోపి సాహిత్య రచనా శైలిని గురించి చేకూరి రామారావు వివరించారు.
- 'శ్రీ గోపి గారిలో కొట్టవచ్చినట్లుగా కనిపించే వైశిష్ట్యం మూడ్ ని చిత్రీకరించటం. 'కాలాన్ని నిద్రపోనివ్వను' అన్న కవితా సంపుటిలో జీవితాన్ని అనుభవిస్తున్నప్పుడు కలిగే మూడ్స్ చిత్రీకరణ శ్రీ గోపి గుండెతో చేశారని'[6] ముదిగొండ వీరభద్రయ్య పేర్కొన్నారు.
- 'ఈ కవి ఎవరో కానీ ప్రకృతిలోంచి ఒక తాత్విక చింతనలోంచి మానవ జీవితాల్ని దర్శిస్తున్నాడని నాకనిపించిందని'[7] ఎండ్లూరి సుధాకర్ గోపి సాహిత్యంలోని మానవ సంబంధాలను గురించి వివరించారు.

---

[4] చేరాతలు, చేకూరి రామారావు. పుట. 109

[5] చేరాతలు, చేకూరి రామారావు. పుట. 109

[6] గోపి సాహిత్య దర్శనం. పుట. 92

[7] గోపి సాహిత్య దర్శనం. పుట. 103

- ‘గోపి గారు ఎన్ని రచనలు చేసిన, ఏ పదవులు నిర్వహించిన ఎన్నో హోదాలను అనుభవించిన వారు. ఆయన ‘కవి’ అనే మాటను ఎక్కువగా ఇష్టపడతారు. కవితాలోకపు మంత్రశక్తిని మహత్తరంగా ఆరాధిస్తారు’[8] అని ఎస్. రఘు గారు అభిప్రాయపడ్డారు.
- ‘ఆచార్య ఎన్. గోపి గారు ఒక కవిగా, విమర్శకుడిగా, పరిశోధకుడిగా, కాలమిస్టుగా, యాత్రా చరిత్రకారుడిగా, నానీల సృష్టికర్తగా సాహిత్య పుటలలో చెదిరిపోని సంతకం చేశారు. ఆదర్శనీయ గురువుగా విద్యార్థుల గుండేల్లో స్థానం సంపాదించుకుంటే సమర్థులైన పాలనాధికారిగా విశ్వవిద్యాలయ రికార్డులో నిలిచిపోయారు. మానవ సంబంధాల పట్ల తీరని ఆర్తి గల సహృదయమూర్తి, ఆత్మీయ ప్రపంచం వారి మూర్తిమత్వాన్ని ఆవిష్కరించుకుంది’[9] అంటూ ఎస్. రఘు గారు వివరించారు.
- ‘కవిత్వం, పరిశోధన, సాహిత్య విమర్శకారుడిగా సుదీర్ఘ ప్రయాణం వీరిది. కవిత్వం ఏ ప్రక్రియతోనూ, ప్రవృత్తితోనూ పొసగదని అంటారు. కాని ఏకాగ్రత దృష్టితో సునిశిత తాత్వికతతో కవిత్వంతో పాటు పరిశోధన, సాహిత్య విమర్శలోనూ పరిణతి పొంది ప్రయాణాన్ని సాగిస్తున్న కవి గోపి’[10] అని పరిశోధకురాలు అభిప్రాయపడ్డారు.
- ‘ప్రకృతితో గోపి ఏకీభావన చాలా గాఢమైన అంశం. ఆయన ప్రకృతి వర్ణనలు సౌందర్యంలో పర్యవసించవు. తనలోని దుఃఖం, భయం, బాధ, తిరుగుబాటు అన్నీ ప్రకృతిలో ప్రతిఫలిస్తాయి’[11] అని అద్దేపల్లి రామమోహనరావు అన్నారు.
- గోపి ఏది రాసిన జనం కోసమే రాసారు. అందుకే వేమన బాటలో ప్రజాకవి కాగలిగారు. సాధారణంగా ఎవరైనా విదేశాలకు వెళ్ళితే విలువైన వస్తువులు తెచ్చుకుంటారు. కానీ గోపి గారు అమూల్యమైన స్మృతులను మోసుకొచ్చి మనసార అందరికి పంచారు.అని కాటూరి రవీంద్ర త్రివిక్రమ్ గోపి గారి గురించి పేర్కొన్నారు.[12]

---

[8] గోపి సాహిత్య వివేచన, ఎస్. రఘు.

[9] గోపి సాహిత్య వివేచన, ఎస్. రఘు.

[10] గోపి సాహిత్యం–వస్తురూప వివేచన, శ్రీలత. పిహెచ్. డి పరిశోధన గ్రంథం.

[11] గోపి సాహిత్య దర్శనం, అద్దేపల్లి రామమోహనరావు. పుట. 9

[12] ఎన్. గోపి సాహిత్య స్ఫూర్తి,కాటూరి రవీంద్ర త్రివిక్రమ్.పుట.99

# రెండవ అధ్యాయం

# వృద్ధోపనిషత్ కావ్యం సామాజిక అంశాల పరిశీలన

## 2.0. పరిచయం

కవి అంటే ప్రపంచం గురించి ఆలోచించేవాడు, మానవత్వానికి అక్షర రూపం ఇచ్చేవాడు. బాధాతప్తుల పక్కన నిల్చేవాడని ప్రగాఢంగా విశ్వసించే గొప్ప మానవతావాది ఎన్. గోపి గారు. ఆధునిక భావాలతో సామాజిక రుగ్మతలను పసిగట్టి వాటిని ఎత్తిచూపడానికి ప్రయత్నిస్తూ సరైన శిల్పంతో రచనలు చేస్తున్న నిబద్ధ కవి ఎన్. గోపి. వృద్ధోపనిషత్ కావ్యంలో సమాజంలో వృద్ధుల పట్ల చిత్రితమవుతున్న అనేక అంశాలను గురించి వివరించడం జరిగింది.

మనిషి ఊహాలోకంలో విహరిస్తూ, వాస్తవిక ప్రపంచంలో బతకడం చాలా కష్టమని 'వృద్ధోపనిషత్' కావ్యంలో కవి నిరూపించారు. సమాజంలో సాహిత్యం వేరు, నిజ జీవితం వేరని అనుకుంటే పొరపాటు. మన జీవితాన్ని మన కళ్ళ ముందే ఒక కావ్యంగా చిత్రిస్తే ఆశ్చర్యపోతాం. అలాంటిది అనుభవాలను, అనుభూతులను వాస్తవ సంఘటనలుగా మలిచి పాఠకుల కళ్ళముందు ఉంచే ప్రముఖ కవి గోపి. ఈయన 'వృద్ధోపనిషత్' కావ్యంలో వృద్ధుల అభ్యున్నతిని, సమస్యలను వివరిస్తూనే, నేటి ఆధునిక సమాజంలో మనిషి ఎలా జీవించాలనే విషయాలను తెలిపి, తన కవిత్వ సంపద ద్వారా పాఠకులలో ఒకవిధమైన చలనాన్ని తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

వృద్ధోపనిషత్ అంటే 'ఉప+ని+షత్' 'ఉప' అంటే సమీపంగా, 'ని' అంటే కింద, 'షత్' అంటే కూర్చునుట. అంటే గురువు ముందు శిష్యుడు కూర్చొని జ్ఞానాన్ని సముపార్జించడం. ఉపనిషత్తులు అనేవి జ్ఞానం ప్రధానంగా గలవి. ఉపనిషత్తులలో ప్రధానంగా విశ్వాంతరాళంలో మనిషికి ఉండే స్థానం గురించి చర్చ జరిగింది. ఉపనిషత్తులు తాత్త్విక గ్రంథాల వంటివి. ప్రకృతి రహస్యాలు మొదలైన వాటి గురించి ఇందులో చర్చించబడ్డాయి. వేదకాలం నాటి ఆలోచన

ధోరణికి ఉపనిషత్తులు పరిపూర్ణతను కలిగించాయి. సరైన జ్ఞానానికి, సన్మార్గానికి ఇవి ఎక్కువ ప్రాముఖ్యతను ఇచ్చాయి. ఉపనిషత్తులు 108 వరకు ఉన్నా అందులో 10 మాత్రమే అతి ముఖ్యమైనవి. వేద సాహిత్యం అంతిమ దశలో ఆవిర్భవించాయి కాబట్టి వీటినే 'వేదాంతాలు' అని కూడా అంటారు. ఋగ్వేదయుగాన్ని తొలివేదయుగమని పిలుస్తారు. మిగిలిన సాహిత్యం– వేదాలు, బ్రహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు వెలువడిన యుగాన్ని మలివేద యుగమని అంటారు. తొలి వేదాయుగానికి, మలివేదయుగానికి మధ్య ఎన్నో మార్పులు సంభవించాయి.

కవి 'వృద్ధోపనిషత్' అని ఈ కావ్యానికి శీర్షిక పెట్టడానికి ప్రధాన కారణం ఉపనిషత్ అంటే అర్థం గురువుల దగ్గర కూర్చొని జ్ఞానాన్ని సముపార్జించడం. అలాగే వృద్ధోపనిషత్ అంటే వృద్ధుల లేదా వయోధికుల పాదాల దగ్గర కూర్చొని జ్ఞానాన్ని సంపాదించడమనే అర్థం వచ్చేలా కవి ఈ శీర్షిక పెట్టడం జరిగింది. ఇందులో 41 కవితా ఖండికలు ఉన్నాయి. ఇంతటి గొప్ప కావ్యాన్ని గోపి గారు వంగల హర్షవర్ధన్‌గారికి అంకితం ఇచ్చారు.

జీవన పరిణతి, ప్రేమతత్వం, ఆదరణ, సంతృప్తికి వృద్ధులు దూరమైపోతున్నారని, వృద్ధాప్యాన్ని జయించే దివ్యౌషధం ఈ 'వృద్ధోపనిషత్' కావ్యమవుతుందని చెప్పవచ్చు. 'వృద్ధోపనిషత్ నేటికాలపు యువతకు హృద్యోపనిషత్ గా నిలుస్తుందనడంలో సందేహం లేదు'.

## 2.1. వృద్ధాప్య చిహ్నాలు

తెలుగు వచన కవితా ప్రపంచంలో గోపి గారిది అలుపెరుగని కవితా ప్రస్థానం. సాహిత్యంలో చరిత్రను, సమకాలీనతను, సంస్కృతిని, జీవన వైవిధ్యాన్ని ప్రస్ఫుటిస్తున్న సుప్రసిద్ధ రచయిత గోపి. గోపి గారి కలం నుండి జాలువారిన మరో మహాకావ్యం 'వృద్ధోపనిషత్'. ఈ కావ్యంలో వృద్ధులలో ఉత్తేజాన్ని నింపుతూనే, వృద్ధాప్య ప్రవేశం ఎలా ఉంటుందన్న విషయాన్ని కూడా వివరించడం జరిగింది.

వయసు పెరిగే కొద్ది శరీరంలో పటుత్వం తగ్గుపోతూ, రోగనిరోధక శక్తి సన్నగిల్లుతుంది. మృత్యువు పైన భయందోలనలు పెరుగుతాయి. శరీరం సడలడం, చూపు సన్నగిల్లడం, తల

నెరవడం, ముఖంలో ముడతలు రావడం, ఇలాంటి శారీరక పరిణామాలు క్రమేపీ పెరుగుతూ ఉంటాయి. ఈ పరిణామాలు అందరిలోనూ ఒక్కలాగే ఉండవు. ఒక్కొక్క వ్యక్తిలో ఒక్కొక్క మోతాదులో, వివిధ దశలలో పరిణామం చెందుతూ ఉంటాయి. వీటినే వృద్ధాప్య చిహ్నాలుగా చెప్పవచ్చు. వీటినే వాల్మీకి మహర్షి రామాయణంలో రాముని ద్వారా బోధింపజేస్తూ రాజ్యమయిన, మనుషులయినా ఏవీ భూమి మీద శాశ్వతం కావు అనే సందర్భంలో ఈ పద్యం వివరించడం జరిగింది.

**'ఒడలు జరాభారము పై**
**బడన్ ముడుతలువడు, దెల్లవడు గేశములున్**
**ఉడుగున్ జవసత్వము లే**
**వడువున దీనింగడతురో ప్రజలు తెలుపుమా'**[13]

శరీరం ముడతలు పడుతుంది. వెంట్రుకలు తెల్లబడతాయి. ముసలితనం వల్ల మనిషి శిథిలం అయిపోతాడు. ఏమిచేసినా కూడా కోలుకోలేడు. కొత్తగా వచ్చిన ప్రతి ఋతువును చూసి జనులానందిస్తారు; కాని ఋతువులు గడిచిన కొద్దీ వృద్ధునిలో మృత్యువు సమీపిస్తోందని యెరగరు. ఈ వాక్యాలలో వృద్ధాప్య సందర్భం దగ్గరవుతున్న కొద్దీ మనిషి మేల్కొని కాలానికి తగ్గట్టుగా తన ప్రయాణాన్ని సాగించాలంటున్నారు.

అలాగే భాగవతంలో వృద్ధాప్య ఛాయలు ఎలా వస్తున్నాయో పోతన అజామిళోపాఖ్యానంలో ఇలా వివరించాడు.

**"నిర్మలం బనఁ జాలనెఱయు చిత్తం బన నల్లని వెండ్రుకల్ తెల్లనయ్యెఁ**
**దగు మోహపాశ బంధంబు జాఱిన మాడ్కిఁ బొదలిన యంగంబు వదల వ్రాలె**
**నింద్రియంబుల కోర్కులిఁక నొల్ల ననుభంగి నుడుగక తల చాల వడఁకఁ జొచ్చెన్"**

[13] శ్రీరామకథాకందము అయోధ్యకాండ (పద్యకావ్యము), యడవల్లి వీరరాఘవస్వామి, శుక్ల వైషకము. 1989, గాయత్రీ ఆర్ట్ ప్రింటర్సు బషీర్ బాగ్, హైదరాబాదు. పుట. 303.

మలినమైన మనస్సు ఎప్పటికైనా నిర్మల మవుతుందన్నట్లుగా అజామిళుని నల్లని వెంట్రుకలు తెల్లబడ్డాయంట. మోహబంధాలు ఎలా అయితే నశించాయో అదే మాదిరిగా బలం సన్నగిల్లి అవయవాలు పట్టుదప్పి వ్రేలాడసాగాయంట. ఇంద్రియ వాంఛలు ఇక నాకు అక్కరలేదు అన్నట్లు తల అడ్డంగా వణకసాగింది. కామోద్రేకం యౌవన వయసుతోపాటు తరిగిపోయినట్లు కంటిచూపు మందగించింది. మెల్లమెల్లగా పండ్లు ఊడిపోయాయి. దగ్గు, ఆయాసం ఎక్కువయ్యింది. తలనొప్పి మొదలయి, మనస్సు నిశ్చలంగా లేకుండా చెదరిపోటుందంటూ వృద్ధాప్య ప్రవేశం ఎలా పరిణమిస్తుందో ఈ వాక్యాలలో పోతన ఎంతో అద్భుతంగా చెప్పడం జరిగింది.[14]

వృద్ధాప్యం అన్నది ఏ ఒక్క వ్యక్తికో ప్రత్యేకించబడినది కాదు. ప్రతీ జీవికీ పుట్టుకా చావు ఖచ్చితంగా వస్తుంది. అది రాలేదు అంటే సృష్టి లేనట్టే. ఆ విషయాన్ని అందరూ గుర్తించినప్పుడు చిన్న పిల్లలను ఎలాగైతే ఆప్యాయతలతో, ఓదార్పుతో చూసుకుంటారో, వృద్ధులను కూడా అంతే ప్రేమగా, ఆప్యాయంగా చూడగలుగుతారు. నిజానికి పెరిగే వయసు కంటే కూడా తరిగే మానసిక స్థైర్యమే మానసిక సమతుల్యతను దెబ్బతీసి శారీరక సమస్యల తీవ్రతను పెంచుతుంది. వృద్ధులు మానసికంగా క్రుంగిపోకుండా వారికి చేయూతను అందజెయ్యాలని కవి ఆశిస్తున్నాడు.

గోపిగారు వృద్ధాప్య ప్రవేశం గురించి వివరిస్తూ మనిషి జీవితమంతా నటనలో గడిపేస్తున్నాడన్నారు. అంటే ఆధునిక కాలంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా ఎంతో మంది తమ శరీరంలో వచ్చిన మార్పులను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారు. కానీ నిజమైన వృద్ధాప్యం సంభవించినప్పుడు వయోధిక స్పృహ మన శరీరంలోని ప్రతి అవయవంలో జరిగే మార్పును చూపిస్తుంది. అప్పుడు యవ్వనంగా ఉన్నామని నటించడానికి అవకాశం కూడా ఉండదు. ఆ విషయాన్నే **'వయోధిక స్పృహ'** అన్న కవితలో వివరించారు.

'తెల్లని వెంట్రుకలు అబద్ధం కాదు
శరీరంపై ముడుతలు అబద్ధం కాదు

[14] పోతన భాగవతము,(సరళ గద్యానువాద సహితము). రెండవ సంపుటము. 2010, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి. పుట. 386.

తడబడే అడుగులు అబద్ధం కాదు

అకస్మాత్తుగా ప్రత్యక్షమయ్యే

కన్నీటితడి అబద్ధం కాదు

సంధ్యాకాలంలోని

రంగుల కలయికా

దాని క్షణక్షణక్రీడా అబద్ధం కాదు' (పుట : 81)

అంటూ సంధ్యాసమయంలో ఆకాశంలో సూర్యుడి తేజస్సు ప్రకాశిస్తూ మెల్లమెల్లగా ఏవిధంగా అయితే మాయమవుతుందో మనిషి జీవితం కూడా క్షణక్షణం గడిచే కొద్దీ మృత్యువుకు చేరువై కనుమరుగైపోతారంటూ ఆకాశంలోని సూర్యుని తేజస్సుతో మనుషుల జీవితాలను పోల్చి చెప్పడం జరిగింది. ఇందులో అడుగడుగునా వ్యతిరేక భావం కనిపించిన చెప్పే ప్రతీ వాక్యంలో సత్యం కనిపిస్తుంది. జీవితమంతా పరుగులు తీశాడు. ఇప్పుడు పక్కకు కూడా జరగలేని స్థితిలో పడివున్నాడు అనడంలో ఉరుకులు పరుగులుగా జీవితం గడిపి వృద్ధాప్యంలో సత్తువలేక జీవచ్ఛవంలా పడివున్నాడు అని ఆర్ధ్రతను నింపే ఈ వాక్యాలతో కవితని నడిపించాడు కవి. జీవిత ప్రయాణంలో ఎన్నో రకాల సంఘటనల ద్వారా ప్రతి వ్యక్తి కుంగిపోయి మరణం చేరువకు వెళ్లి తిరిగి వస్తాడు. కానీ ఇదే చివరి మరణం మళ్ళీ జన్మంటూ ఉండదని తెలిసిన క్షణాన మనస్సులో ఉత్పన్నమయ్యే భావనను అనుభవ పూర్వకంగా తెలియజేశారు.

మనిషి యొక్క మనస్సు, శరీరం రెండూ సన్నిహిత పరస్పర ఆధార స్వభావంతో పని చేస్తాయి. 'మతి చెడిన వారికి గతి కూడా చెడుతుంది' అన్న సామెత ఉంది. మానసికంగా ఆరోగ్యంగా లేకపోతే శారీరకంగా కూడా ఆరోగ్యం దెబ్బ తింటుంది. అప్పుడే అనేక రుగ్మతలకు, వ్యాధులకు గురై బాధపడే అవకాశం ఉంటుంది. మనస్సు ప్రశాంతంగా ఉంటేనే మనిషి ప్రశాంతంగా ఉంటాడు. వృద్ధులకు ఆ ప్రశాంతత దొరకడం లేదన్న విషయాలను వాస్తవిక దృష్టితో విశ్లేషించాడు.

వయసు పెరిగే కొద్దీ వృద్ధులకు స్నానం చేయడం కష్టం, గట్టి మూత తీయడం కష్టం, మెట్లు ఎక్కడం కష్టం, అసలు నడకే కష్టంగా మారి ఒక్కోసారి ఎవరి సహాయం లేకుండా పక్కకు కూడా జరగలేని పరిస్థితిలోకి వెళ్లిపోతారు మనుషులు. అంటే పుట్టినప్పుడు ఏ విధంగా అయితే ఉంటారో వృద్ధాప్యం పెరిగే కొద్దీ అదే స్థితికి చేరుకుంటుంటారు. శరీరంలో జరిగే క్రమపరిణామాలను వృద్ధాప్య చిహ్నాలను నేరుగా చెప్పకుండా కవి వాటికి ఒక ప్రశ్నార్థకాన్ని జోడించి వృద్ధాప్య ప్రవేశాన్ని తెలిపారు. **"వృద్ధాప్య ప్రవేశం"** కవితలో ఇలా అంటున్నాడు.

‘శరీరం ఒణుకుతుంది
చలి వల్ల కాదు
నడక తడబడుతుంది
నేల ఎగుడు దిగుడు వల్ల కాదు
చూపు మసకబారుతుంది
చీకటి వల్ల కాదు
అందం వంకరలు బోతుంది
వీక్షకుల లోపం కాదు’ ( పుట : 19)

అంటూ వృద్ధాప్య చిహ్నాలను మొదటి పాదంలో వివరించి తరువాతి పాదంలో దానికి కారణాలు ఇవి కావు అన్న వాక్యాలతో బింబ ప్రతిబింబ భావాన్ని ప్రదర్శించాడు. అంటే యవ్వనంలో శరీరం ఒనుకుతుంది అంటే చలివేస్తుందేమోనని అనుకుంటారు. కానీ చలివేయకుండానే శరీరం వణుకుతుంది అంటే వృద్ధాప్యం ప్రవేశిస్తుంది అనే అర్థం వచ్చేలా ఈ కవితను వివరిస్తున్నారు. శరీరం వణుకుతున్నప్పుడు కాళ్ళు తడబడడం సహజం. కొన్నిసార్లు మార్గం మంచిగా లేక కాళ్ళు తడబడతాయి. మార్గం మంచిగానే ఉన్నా శరీరంలోని కంపనం మూలంగా కాళ్లు కూడా తడబడతాయి అని ఈ పంక్తులలో వివరించారు.

చూపు మందగించడం, ముఖం ముడతలు ముడతలుగా మారడం, గొంతు బొంగర పడి ఉచ్ఛారణ సరిగ్గా లేకపోవడం ఇవన్నీ కూడా వృద్ధాప్య ప్రవేశానికి చిహ్నాలుగా చెప్పుకోవచ్చు.

మనిషి వయసు వృద్ధి పొంది, వయసు మళ్ళి వృద్ధాప్యం దొంగలా ప్రవేశిస్తుందని చెప్పడానికి ఉపకరించే చిహ్నాలన్నింటిని కలిపి కొత్త పద్ధతిలో వివరించే ప్రయత్నం చేశారు. ఈ కవిత ప్రారంభంలో శిథిలానికి గురి కావస్తున్న మనిషి శరీర వ్యవస్థను గురించి వివరించాడు. వృద్ధుడు అని గమనించిన ప్రతి మనిషి కూడా ఆ ముదుసలి వ్యక్తుల పట్ల అసహనం వ్యక్తం చేస్తారు. ఏదైనా సందర్భంలో వారు అడిగే ప్రశ్నలకు ఇతరుల నుండి సరైన సమాధానం కూడా రాదు. ఏదైనా అంటే నీకేం తెలుసు నీకు వయసు అయిపోయింది కాలం మారిపోయింది అన్న వాక్యాలు దర్శనమిస్తాయి అందుకే కవి అంటున్నాడు.

'వయసు మళ్లిన శరీరాలకు
ప్రాధాన్యాలు మారుతుంటాయి'. (పుట : 21)

అని నేటి యువతలో వృద్ధులకు పని చేసి పెట్టడంలో నిర్లక్ష్యత అనేది చోటుచేసుకుంటుందని వివరించారు. ఆ పరిస్థితులను ఎదుర్కొన్న పెద్దలకు అర్థమయ్యేది ఒక్కటే శరీరంలో శక్తి తగ్గిపోయిందని, ఎదుటివారిని ఎదిరించి మాట్లాడే శక్తిని కోల్పోయారని. అదే విషయాన్ని కవి పురోగమన ప్రతీకలతో పోల్చి చెప్పారు.

'ఒకప్పుడు మార్పు అంటే
పురోగమనానికి ప్రతీక
ఇవాళ మార్పు అంటేనే
భయమేస్తుంది'. (పుట : 22)

ఇక్కడ మార్పంటే మనిషి స్వభావంలోని మార్పుతోపాటు మనిషి దేహంలో కూడా మార్పు వస్తుంది. మనిషి స్వభావంలో, మనస్తత్వంలో, వైఖరిలో, అభ్యున్నతిలో మార్పు వస్తుందంటే అందరూ ఆహ్వానిస్తారు. ఎందుకంటే అది మనిషి వ్యక్తిత్వాన్ని మంచివైపు పయనించేలా తీర్చిదిద్దుతుంది. అదే శరీరంలో వయసు పరంగా వచ్చే మార్పును అయితే ఎవ్వరూ ఆహ్వానించడానికి సిద్ధంగా ఉండరు. అదేవిషయాన్ని తిరోగమనభావం వ్యక్తమయ్యే విధంగా

గోపిగారు వివరించారు. వయసు ముంచుకొస్తున్న కొద్ది శరీర అవయవాలు మాటవినడం మానేసి నిరాహారదీక్ష చేస్తాయి. ఆకాశంలో వర్షానికిముందు మబ్బులు ఏవిధంగా అయితే ముసురుకుంటాయో జీవితంలో కూడా చీకటికోణం దర్శనం ఇస్తుంది. అది మెల్లమెల్లగా మృత్యువుకు దారితీస్తుంది. అదే విధంగా ఇంకో సందర్భంలో **"నేను సైతం"** అనే కవితలో ఇలా అంటాడు కవి

'వాహనం ముందుకు వెళ్తుంటే
రోడ్డు వెనక్కి వెళ్తున్నట్టు
జీవితంలోంచి
యౌవనం జారిపోయింది'. (పుట : 29)

అంటూ వయసు పెరిగేకొద్ది శరీరంలోని సత్తువ మెల్లమెల్లగా క్షీణిస్తుంది అంటున్నాడు. **"కాలరథ ప్రచారంమొక ఖండిక మేషము నాగబోదు"**[15] అన్నారు రైతుకవి దువ్వూరి రామిరెడ్డిగారు. అంటే కాలమనేది దోసిట్లో పట్టుకున్న నీరులా వేళ్ల మధ్య నుంచి జారిపోతుంది. రెప్పలు మూయటం తెరవటంలోనే మనిషి జీవితం పరుగులు తీస్తుందన్నారు. ఈ వాక్యాలు గోపి చెప్పిన వాక్యాలు రెండూ కూడా జీవితాన్ని గురించి కాలాన్ని గురించి వివరిస్తున్నాయి. గడిచిన కాలం తిరిగి రాదు, చెదిరిన స్వప్నం గుర్తుకురాదన్న భావాన్ని ఇద్దరు మహాకవులు ఒకే విధంగా వ్యక్తీకరించారు.

## 2.2. వృద్ధుల సమస్యలు

తల్లిదండ్రులు పిల్లల చిటికెనవేలు పట్టుకుని నడకనేర్పి వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటారు. కష్టాలకోర్చి చదివించి పిల్లల భవిష్యత్‌ను అందంగా తీర్చిదిద్దేందుకు శక్తినంతా ధారపోస్తారు. అలాంటి వారిని బాధ్యతగా చూసుకోవాల్సిన అవసరం పిల్లలపై ఎంతైనా ఉందని చెప్పాలి.

[15] నిరంతర. రఘు. ఎస్. సంపాదకత్వం. 2022, డా. ఎన్. గోపి సాహిత్యంపై విమర్శ–సమీక్షా వ్యాసాలు. హైదరాబాదు. పుట. 243.

ఈ 'వృద్ధోపనిషత్' కావ్యంలో కవి మనిషి జీవితంలోని వివిధ పార్శ్వాలను, కోణాలను ఆవిష్కరించారు. అందులో భాగంగానే వృద్ధాప్యంలో ఎదురయ్యే సమస్యలను కూడా ప్రత్యేకంగా చిత్రించడం జరిగింది. మనిషి బాల్యం నుండి వృద్ధాప్యం వరకు క్రమక్రమానుగతంగా పరిణామం చెందుతూ వస్తాడు. ఇదే అతని జీవన ప్రయాణం. ఈ జీవన ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులను, సమస్యలను ఎదుర్కోవలసి వస్తుంది. వారి సమస్యలకు ఇదే ప్రధానమైన కారణమని చెప్పడానికి అవకాశం లేదు. కానీ ప్రతి సంఘటన వ్యక్తి జీవితంలో ఒక వీడని సమస్యగా మిగిలిపోతుంది.

వృద్ధాప్యంలో పేదరికం ఒక సమస్య అయితే, ఉన్నట్టుండి జీవితం చేజారిపోయినట్టవడం, కాలం ఎలా గడపాలో తెలియకపోవడం మరో రకమైన సమస్య. చేతిలోంచి అధికారం జారిపోవడం, డబ్బులువచ్చే మార్గం ఆగిపోవడం, రోజూ అలవాటుపడిన ఆఫీసు, పనిస్థలం ఒక్కసారిగా పరాయిది కావడం పెద్దవారికి మింగుడుపడని అంశాలు. ఈ సమస్యల గురించి గోపిగారు మనిషిలోని దశలనుబట్టి వృద్ధాప్య దశలో ఎదురయ్యేటువంటి సమస్యలను స్థూలంగా నాలుగు భాగాలుగా విభజించి విశ్లేషించారు. అందులో

1. **సామాజిక సమస్యలు**
2. **ఆర్థికపరమైన సమస్యలు**
3. **శారీరక సమస్యలు**
4. **మానసిక సమస్యలు**

## 2.2.1. సామాజిక సమస్యలు

ఒక వ్యక్తి కుటుంబం నుండి ఎన్నిరకాల సమస్యలనయితే ఎదుర్కొంటాడో అంతే సమానంగా సమాజం నుండి కూడా ఎదుర్కొంటాడు. సమాజం మనిషిని మనిషిగా చూడని రోజున ప్రతి మనిషికీ ఆ క్షణం నరకంగానే తోస్తుంది. మనిషి సాటిమనిషిని గౌరవించకపోవడం మూలంగానే ఇటువంటి సమస్యలు తలెత్తుతున్నాయి. మనుషులు స్థాయినిబట్టి, వయసునుబట్టి గౌరవ మర్యాదలు ఇచ్చిపుచ్చుకున్నపుడు అందరూ ఆనందంగానే జీవిస్తారు. కాని నేటి సమాజం

దీనికి విరుద్ధంగా ప్రయాణిస్తుంది. కుటుంబంలో మొదలయ్యే ఈ భావన సమాజంపై కూడా ప్రభావం చూపుతుంది. వృద్ధులు ఓదార్పులేని ఒంటరులుగా మారిపోతున్నారు. వృద్ధాప్యాన్ని సామాజిక విషయంగా చూడని ఆధునిక సమాజపు అమానవీయత గురించి ఎంత మాట్లాడుకున్నా అసంతృప్తే మిగులుతుందని చెప్పాలి.

ఈ ఆచరణలు, అనుభవాల పునాదిగామారి ఇప్పటికైనా మానవీయ సమాజ నిర్మాణం దిశగా ఆలోచించాలి. హైటెక్ అభివృద్ధి మార్గంలో దూసుకుపోతున్న భారతీయ సమాజంలో నెలకొన్న అమానవీయతను రూపుమాపేందుకు ఓ సామాజికోద్యమమే అవసరం ఉన్నది. అభివృద్ధి సంగతేమో కానీ మన సమాజం తీవ్రమైన సంక్షోభంలో ఉన్నదని ఈ మధ్య జరుగుతున్న సంఘటనలు చెబుతున్నాయి. అందరూ ఉండి కూడా ఎవరూ లేనట్టు నిస్సహాయ స్థితిలో ఎంతోమంది వృద్ధులు రోడ్లమీద కాలం గడుపుతున్నారు. ఈ సంఘటనలే వృద్ధాప్యం మనిషికి శాపంగా మారే పరిస్థితి మన సమాజ గమనంలోని డొల్లతనాన్నే కాదు, నేటి సామాజిక సంక్షోభాన్ని చెప్పకనే చెబుతున్నాయి. మానవ సంబంధాలు ప్రశ్నార్థకం కావడానికి నేటి సమాజ పోకడలే ప్రధాన కారణం. వాటి గురించి ఆలోచించాల్సిన బాధ్యత అందరిపై ఉందని కవి వివరిస్తున్నారు.

తల్లిదండ్రులు పిల్లలను క్రమశిక్షణతో పెంచి తమ పిల్లలకు పెద్దల పట్ల ఏ విధంగా మెలగాలి, ఎలా వారిని గౌరవించాలి అనే విషయాలను నేర్పకపోవడం మూలంగా సమాజంలో దినదినం మానవతా విలువలు పతనమైపోతున్నాయి. పిల్లలు చిన్నగా ఉన్నప్పుడు వారికేమైనా అయితే తల్లిదండ్రలు పిల్లలను భుజాన వేసుకొని వైద్యుల చుట్టూ, గుళ్ళు, గోపురాల చుట్టూ తిరిగి వాళ్ళను బ్రతికించుకుంటారు. పిల్లల ప్రాణం పోతుందేమో అన్న బాధతో, భయంతో పిల్లల ప్రాణరక్షణకై మృత్యువుతో పోరాటం చేస్తారు. అలాంటి తల్లి దండ్రులను పిల్లలు వృద్ధాప్యం వచ్చేసరికి జీవిత కాలంలో ఏనాడూ అనుభవించలేనట్టి శోఖాన్ని వారికి అంటగట్టి తృణప్రాయంగా వదిలేస్తున్నారు. కన్నబిడ్డలు రెక్కలొచ్చి ఎగిరిపోయిన తర్వాత.. గూడు చెదిరిన పక్షుల్లా అలమటించే వృద్ధతరానికి కావాల్సింది సమాజం నుంచి కాసింత ప్రేమాదరణ, రక్షణ

మాత్రమేనని నేటి సమాజం కొంతైనా గుర్తించాలి. అదే విషయాన్ని గోపిగారు తన 'వృద్ధోపనిషత్' కావ్యం ద్వారా సమాజంలో మార్పును తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు.

కవికి ఉండాల్సిన ప్రధాన గుణం స్పందన. కవి అనేవాడు ప్రతి సూక్ష్మాంశానికి కూడా స్పందించి కవిత్వావేశానికి లోనవుతుంటాడు. తనదైనా కాకపోయినా, తనవారైనా కాకపోయినా తనకు సంబంధమున్నా లేకపోయినా ప్రపంచంలోని నలుమూలలా ఏమిజరిగినా వెంటనే స్పందిస్తాడు. కవిని ప్రభావితం చేసే ప్రతి సన్నివేశం, సంఘటన, దృశ్యం, మాట, స్పర్శ వెంటనే కవిత్వమై కూర్చుంటాయి. భావావేశం బలంగా ఉన్నవారు తమ కవిత్వం ద్వారా పాఠకుల హృదయాలలో ఆవేదనను నింపి సమాజంలో చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నం చేస్తారు. గోపిగారు కూడా మానవ సంబంధాలను కేంద్రీకృతం చేసుకుని ఈ 'వృద్ధోపనిషత్' కావ్యాన్ని వెలువరించారు. ఈ కావ్యం మనిషి జీవితానికి కావలసిన సంబంధ బాంధవ్యాలను చిత్రించడంలో శిఖరాగ్ర స్థానంలో నిలిచిందని చెప్పవచ్చు.

## 2.2.2. ఆర్థికపరమైన సమస్యలు

ఈ కావ్యంలో మధ్యతరగతి మనుషుల జీవితం ఎంత స్పష్టంగా చిత్రించబడిందో వారి ఆర్థిక సమస్యలు కూడా అంతే స్పష్టతతో చిత్రించబడ్డాయి. కొన్నిచోట్ల కవి వృద్ధాప్యం అనేది ధనికులకు ఒకలాగా, పేదవారికి ఒకలాగా ఉండదు, అందరికీ ఒకేవిధంగా ఉంటుందని చెప్పే ప్రయత్నం చేశారు. అయినా అది అవాస్తవమనే చెప్పాలి. ధనికుల ఇళ్ళల్లో అయితే ఎంత డబ్బున్నా కొడుకులు, కూతుళ్ళు, కోడళ్ళు, వారసులు డబ్బు వ్యామోహంలోపడి వృద్ధులను పట్టించుకోరు. అక్కడ తినడానికి తిండి నిండుగానే ఉన్న పెట్టే ఆహారంలోనే ప్రేమ, ఆప్యాయతలకు స్థానం ఉండదు. అలాగే పేద, మధ్య తరగతి కుటుంబాలలో అయితే డబ్బే మనిషిని పాతాళానికి తోసేస్తుంది. సరైన ఆహారం లేక ఇప్పటికి దేశంలో ఎంతో మంది చావుబ్రతుకుల మధ్య పోరాటం చేస్తున్నారు. అదే వృద్ధుల దీన పరిస్థితి అయితే వర్ణనాతీతం. ఆర్థికపరమైన సమస్యల మూలంగా ఆరోగ్యం పాడయితే దవాఖానాకు కూడా చూపించుకునే స్థోమత లేక రోగంతోనే జీవనం

సాగిస్తారు. ఎన్ని విధాలుగా ఆలోచించినా వృద్ధుల సమస్యలకు ఆర్థిక పరమైన ఇబ్బంది కూడా ప్రధాన పాత్రను నిర్వహిస్తుందని చెప్పవచ్చు.

గోపిగారు కూడా చాలా కవితలలో వృద్ధుల ఆర్థిక సమస్యలను గురించి వివరించారు. ఆర్థిక సమస్యలు మధ్యతరగతి కుటుంబాన్నే కాకుండా ఉద్యోగాలు చేసి పదవీ విరమణ పొందిన వారిని కూడా చాలావరకు ఇబ్బందులకు గురిచేస్తాయి. ఇటువంటి సన్నివేశాలనే కొంత మంది సినిమా రూపంగా చిత్రించి సమాజంలో మార్పు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. ఉద్యోగం చేసినన్నినాళ్లు ఎవరైనా ముందస్తు ఆలోచనతో కొంత డబ్బును పోగు చేసుకుంటారు. పదవి విరమణ తరవాత వారు ఆ డబ్బును తీసుకోవడానికి పడే అవస్థను ఈ కింది **"సీనియర్ సిటజన్స్"** కవితలో గోపి గారు ఎంతో అద్భుతంగా వివరించారు. వృద్ధులు లేనిదెక్కడ బ్యాంకు కౌంటర్ల దగ్గర, పాసుబుకుల్లో ఎంట్రీల కోసం, క్యూలో నిల్చున్న వయోధికులువారు. వొనికే చేతుల్తో నాలుగు నోట్ల కోసం బ్యాంకుల్లో పోస్టాఫీసులలో, ఎఫ్. డీల కోసం పడిగాపుల గాసే సన్నివేశాలను దయనీయ పరిస్థితులను చిత్రించారు.

'పోస్టాఫీసు దగ్గరా అదే దృశ్యం!
ఎఫ్. డీ. ల కోసం
కిటికీకి చూపులు బిగించి
పడిపోకుండా నిల్చుంటారు' (పుట : 16)

అన్న పంక్తులలో ఒక దృశాన్ని వేదనాభరితంగా కళ్ళముందు కదలాడే చిత్రంగా మలిచారు. ఇది నిజంగా సమాజంలో అందరూ చూస్తున్న సంఘటననే. కానీ కవి ఈ సంఘటనను శిలాఫలకం మీద చెక్కిన చిత్రంలా ప్రాణ ప్రతిష్ట చేసి వృద్ధుల వ్యథను ఆవిష్కరించాడు.

ప్రభుత్వ ఉద్యోగులుగా పదవీ విరమణ పొందిన వారికి ప్రభుత్వాలు కొన్ని పెన్షన్లు ఇస్తున్నాయి. కాని సామాన్య వృద్ధులకు ఎలాంటి పెన్షన్లు లేవు. వారు అనేక ఆర్థిక ఇబ్బందులు

ఎదుర్కొంటున్నారు. జీవితకాలం ఎదో ఒక పని చేసి ఎన్నో అవస్థలు పడి ఎంతో అలసిపోయి విశ్రాంతి తీసుకునే సమయం వృద్ధాప్యం. ఆ సమయంలో కూడా డబ్బులు వచ్చే మార్గం లేక ఎంతో మంది పడరాని పాట్లు పడుతున్నారు. కాని గత కొన్ని సంవత్సరాలుగా కొన్ని ప్రభుత్వాలు అరవయ్యేళ్ళు పైబడిన వృద్ధులకు భరోసాను ఇవ్వడానికై వారి ఆర్థిక సమస్యలను తగ్గించడానికి పెన్షన్ రూపంలో డబ్బులు ఇస్తుంది. అవి వీరి జీవితాలలో కొంతైనా వేలుగును తీసుకొస్తుందని చెప్పుకోవచ్చు. అదే విషయాన్ని గోపి గారు గ్రామీణ ప్రాంత వాతావరణంలో వృద్ధుల పెన్షన్, ఆ డబ్బును దాచుకోవడం కోసం కొడుకుల నుండి ఎదుర్కొంటున్న సమస్యలను **"ఓల్డేజ్ పెన్షన్"** కవితలో ఎంతో అద్భుతంగా వివరించారు.

'అప్పుడప్పుడు సర్కారు కూడా
మంచి పనులు చేస్తుంది
వృద్ధాప్య పెన్షన్ల కోసం
ముసలమ్మలు క్యూలో నిలబడ్డారు.' (పుట : 42)

అని పెన్షన్ల కోసం పడిగాపులు గాసే వృద్ధుల పరిస్థితులను వివరించారు. ఆ వచ్చిన పెన్షన్ డబ్బు కోసం సుపుత్రులు చేసే ఘనకార్యాన్ని వివరించి గుండెల్లో తెలియని భారాన్ని నింపుతూ ఈ **"ఓల్డేజ్ పెన్షన్"** కవితా పంక్తుల రూపంలో వివరిస్తున్నారు.

'మొట్టమొదటిసారి కొడుకులు
గద్దల్లా కనిపిస్తున్నారు.
వద్దురా!
నా మందులగ్గావాలా
ఆకు వక్కలు కొనుక్కుంట బిడ్డా!
అని శోకాలు పెట్టింది ముసల్ది.
ఎవడు వింటడు!
యముడు ప్రాణాలు లాక్కపోతున్నట్టు

పైసలు వదలదీసిండు.

గుడ్లు తేలేసింది కన్నతల్లి

ఇప్పుడవే పైసల్తో

అంత్యక్రియలు జేస్తడు గావచ్చు.' (పుట : 42)

అన్న పంక్తులు పాఠక లోకాన్ని ఆలోచనలో ముంచెత్తి ఆత్మ స్మరణలోకి లాగేస్తుంది. ఇక్కడ కవి చెప్పిన సంఘటన అనేది కళ్ళ ముందు మెదలాడుతుంది. డబ్బులే అన్నింటికి కారణమని అందరికి తెలుసు అయినా ప్రాణం కన్నా పైసలే ముఖ్యమని భావించే సన్నివేశాన్ని కవి ఈ కవిత ద్వారా తెలియజేసాడు. అందుకే చాలామంది విమర్శకులు ఈ కవితా సంపుటిని కేవలం కవితా సంపుటి కాదిది గోపి కలం నుండి వెలువడిన ఆలోచనామృతమైన మహాకావ్యమన్నారు.

ఈ విధంగా శారీరక, మానసిక, సామాజిక, ఆర్థిక సమస్యలు వృద్ధాప్య జీవితంలో సంతోషమనేది లేకుండా చేస్తున్నాయని వాటిని జయించి వృద్ధాప్యాన్ని ఆవేదనతో కాకుండా ఆహ్లాదంతో గడపమని కవి సందేశం ఇస్తున్నాడు. నిజంగా ఈ సమస్యలను అధిగమిస్తే మనిషి వృద్ధాప్యాన్ని జయించవచ్చు అనిపిస్తుంది. జీవితంలోని చివరి దశ వృద్ధాప్యం కావడంతో శారీరక మార్పులను ఆపడం ఎవరితరం కాదు. మనిషికే కాదు ప్రతి జీవికి ఈ మజిలీ తప్పదు. ముదిమి వయసులో శారీరక సమస్యలు, మానసిక ఇబ్బందులు ఇలా ఈ రెండింటికీ ఆర్థిక సమస్య కలిస్తే ఆ జీవితం నరకమే. అందుకే వాటిని జయించి వృద్ధాప్యాన్ని ఆనందంగా గడపాలని కవి సందేశం ఇస్తున్నారు. దానికి కుటుంబం కూడా ప్రధాన బాధ్యత తీసుకోవాలంటున్నాడు.

## 2.2.3. శారీరక సమస్యలు

మనిషి జీవితంలో వృద్ధాప్యం అనేది చివరి దశ. ఈ దశకు చేరుకునే సరికి శరీరంలోని అన్నీ అవయవాలలో కూడా మార్పు చోటుచేసుకుంటుంది. ఆ మార్పు వారి జీవితంపై ఎంతో ప్రభావాన్ని చూపుతుంది. వృద్ధాప్యం శరీరానికే కానీ మనస్సుకు కాదని ఎంతో మంది ఎన్నో రకాలుగా భోధిస్తుంటారు. కానీ వృద్ధాప్యం శరీరంపైన చుపే ప్రభావం ఎంతైతే ఉంటుందో, కుటుంబం, సమాజం మూలంగా వారు మానసికంగా ఎదుర్కొనే సమస్యలు వృద్ధులను మరింత

ఎక్కువగా నిరాశకు గురిచేస్తున్నాయని చెప్పవచ్చు. శారీరక, మానసిక ఆరోగ్యాలు ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంటాయి. దీర్ఘకాలిక శారీరక సమస్యలు కొన్నిసార్లు మెదడుపై ప్రభావం చూపుతాయి. అలాగే మానసిక అనారోగ్యం శారీరక ఆరోగ్యాన్ని కూడా తీవ్రంగా దెబ్బతీస్తుంది. కనుక అటు శారీరకంగానూ, ఇటు మానసికంగానూ దృఢంగా ఉన్న వృద్ధులు నేటి కాలంలో చాలా అరుదు.

వయసు పెరుగుతుందంటే చాలు. చర్మంపై ముడతలు ఏర్పడుతాయి. కొంత మందికి అయితే అరవై సంవత్సరాలు దాటితే చాలు వినికిడి శక్తి తగ్గి, కంటి చూపు మందగిస్తుంది. కొత్త విషయాన్ని నేర్చుకోవాలన్నా, దేనిమీదైనా దృష్టి పెట్టాలన్నా, ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలన్న జ్ఞాపక శక్తి చాలా ముఖ్యం. వయసు పెరిగే కొద్ది మతిమరుపు పెరగడం సహజం. ఈ మతిమరుపు మూలంగా జ్ఞాపక శక్తికి తోడ్పడే జీవ క్రియలన్నీ ఆగిపోతాయి. ఇక పూర్తి వృద్ధాప్యం సంభవిస్తే జరిగే పరిణామాలు ఎలా ఉంటాయో **"వృద్ధాప్య ప్రవేశం"** కవితా పంక్తులులో వివరించాడు.

'ఉచ్చారణ ఖంగున మోగదు
భాషా మెత్తబడి కాదు
చదవడం తగ్గుతుంది
గ్రంథాలు లేక కాదు' (పుట : 19)

శరీరం ఒణకడం, నడక తడబడడం, చూపు మందగించడం మొదలైన మార్పులను గురించి వివరించారు. ఇక్కడ నేరుగా శరీరం కుంగిపోయింది, కాళ్ళు నడకకు సహకరిస్తలేవు, కంటిచూపు మందగించింది. శరీరం వదులుగా మారి పల్చపడిపోయింది. గొంతు మూగబోతుందని నేరుగా చెప్పకుండా కవి దైహికమైన శైథిల్యాన్ని క్రాంతదృష్టితో పరిశీలించి వార్ధక్య లక్షణాలకు చిహ్నాలను జోడించి చెప్తున్నాడు. పైన చెప్పిన అన్నీ కూడా వృద్ధాప్యానికి నిదర్శనాలే. శరీరంలోని మార్పుకు చిహ్నాలే. వయసు పెరుగుతున్నకొద్ది మెదడు పరిణామం తగ్గుతుంది. దీంతో జ్ఞాపక శక్తి తగ్గుతుంది. ప్రవర్తనలో మార్పులు వస్తాయి. దాంతో ఒత్తిడికి లేదా ఆందోళనకు గురవుతారు.

**“పాపం శరీరం”** కవితలో శరీరంలో జరిగే మార్పును గురించి వివరించి శక్తికోల్పోతున్న క్షణాలను స్పష్టంగా అర్థమయ్యేల వివరించాడు.

‘పాపం శరీరం
ఎంతో మారిపోయింది.
ఎన్ని కష్టాలు పడ్డ దేహమది
బాగా వడలిపోయింది. (పుట : 33)

అనడంలో దేహంపై ఉన్న వ్యామోహం అర్థమవుతుంది. దేహ పరిస్థితులు వృద్ధులకైనా, యువకులకైనా చేసే పనిని బట్టి మార్పు చెందుతాయి. అదే వృద్ధులకు అయితే జీవన ప్రయాణంలో పడిన కష్టాల మూలంగా కొంత ఎక్కువ బలహీనంగా తయారవుతుంది. ఇక చేతుల గురించి అయితే ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. మనిషి మనుగడ సజావుగా జరగాలంటే చేతులు చాలా ప్రధానం. ఏ జీవికి లేని విధంగా మానవుడికి దేవుడు చేతులను ప్రసాదించడం ఒక వరం. అవే చేతులు పుట్టినప్పుడు కాళ్ళలాగా ఉపయోగపడతాయి. పెద్దయ్యక కాయా కష్టం చేసి కడుపుకు ఆహారాన్ని సమకూరుస్తాయి. ఎన్నో పరిశ్రమల నిర్వహణకు, నగరాల నిర్మాణానికి ఉపయోగపడతాయి. ఈ చేతులే వృద్ధాప్య దశలో వచ్చే పక్షవాతానికి గురి అవుతాయి. కాళ్ళయితే ఎన్నో వేల మైళ్ళు నడిచి కాలాన్ని దూరాన్ని ఏకం చేసి గమ్యాన్ని చేరుకున్నాయంటాడు కవి. మరణం సంభవించే వరకు కూడా ప్రయాణం సాగుతూనే ఉంటుంది. ఇక్కడ గమ్యం పూర్తయింది అనడంలో ఇక చేరుకోవాల్సిన మైళ్ళు ఏమి లేవనే అర్థం వస్తుంది. అదేవిధంగా శరీరంలోని ప్రతి అవయం మెల్లమెల్లగా వాటి కర్తవ్యాన్ని నిర్వర్తించడం మరిచిపోతాయి.

“మజిలీ” అనే కవితలో శరీరాన్ని ఒక మహారణ్యంతో పోల్చి ఈ విధంగా అంటున్నారు.

‘వృద్ధాప్యం అకస్మాత్తగా
ఊడి పడింది కాదు.
శరీర మహారణ్యం లోంచి

ఇప్పుడు బయట పడిందంతే'          (పుట : 84)

అనడంలో శరీరావయవాలను ప్రకృతితో పోల్చి చెప్పినట్లు అనిపిస్తుంది. ఒక జంతువు ఒక అడవి నుంచి బయటికి వచ్చిందంటే మనుషుల మధ్య దాని మనుగడ సాగదు. అదే విధంగా మనిషి కూడా శరీరం అనే మహారణ్యం నుండి బయటపడటమంటే తన మజిలిని చేరుకున్నట్టేనంటున్నారు గోపి. ఈ సాఫల్యతతో తన చివరి మజిలీ పూర్తవుతుంది. అన్నిటికి మూలం దేహం. దేహం లేని చోట ప్రాణానికి తావుండదు. అంటువంటి దేహం వృద్ధాప్య సమయంలో విశ్రాంతి కొరకు ఆరాటపడుతుంది. ఆ కొంచం విశ్రాంతిని కూడా వృద్ధులకు దూరం చేస్తుంది నేటి తరం అని వృద్ధుల అభ్యున్నతిని కాంక్షిస్తున్నారు గోపిగారు.

శరీరంలో జరిగే మార్పుల వల్ల మనిషి ఆరోగ్యం క్షీణించి మంచాన పడతారు. ఆరోగ్యం కుదుటపడాలంటే మనిషి ముందుగా మానసికంగా బలంగా ఉండాలి అప్పుడే శారీరకంగా కూడా ధృడంగా ఉండడానికి అవకాశం ఉంది. చాలామంది వృద్ధుల్లో అనారోగ్య సమస్యలకు తోడు ఆర్థిక సమస్యలు తోడవడంతో వారు మానసిక, శారీరక అశాంతికి గురవుతారు. అయితే అనారోగ్య సమస్యలు ఎన్ని ఉన్నా, మనసుకు ఊరటనిచ్చే వారుంటే అవేవి గుర్తుండవు.

## 2.2.4. మానసిక సమస్యలు

వృద్ధాప్యంలో ఆరోగ్య సమస్యలే కాదు, ఆర్థిక, సామాజిక, మానసికపరమైన సమస్యలు కూడా వారిని సంక్షోభానికి గురి చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితులలో వారి కుటుంబం వృద్ధులకు అండగా నిలబడక పోవడం మూలంగానే వృద్ధాప్యం వారికి మరింత నరకంగా తయారవుతుంది. వృద్ధుల ఆలోచన విధానం కూడా వారిని మానసిక క్షోభకు  గురిచేస్తుంది. ప్రతి మనిషి తన జీవితకాలంలో ఏదో ఒకటి సాధించి తమకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని ప్రయత్నిస్తూ ఉంటారు. కానీ కుటుంబం, ఉద్యోగ భారాల మూలంగా ఏది సాధించలేకపోతారు. ఆ జీవన సాఫల్యం పొందకపోతే ఆ వెలితి వారిని దినదినం కలిచివేస్తుంది. ఆరోగ్యమే మహాభాగ్యం అనేది ఒకప్పటినానుడి. ఆరోగ్యం బాగుంటే అంతా బాగుంటుందని మన

పూర్వీకులు అనేవారు. కాని నేడు మానసిక ఆరోగ్యమే మహాభాగ్యం అంటున్నారు మానసిక వైద్యనిపుణులు. అప్పటి కాలాన్ని అన్వయించుకుని నాటి పెద్దలు ఆరోగ్యమే మహాభాగ్యం అని చెప్పారు. కానీ ఇప్పటి పరిస్థితులు వేరు. ఉద్యోగాల మూలంగా తొందరపాటు, అసంతృప్తి ఉరుకులపరుగల జీవితం. కనీసం కుటుంబ సభ్యులతో కూడా గపడలేని దయనీయస్థితి ఏర్పడింది.

ఈ నేపథ్యంలో మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యమని చాలామంది పరిశోధకులు వివరించారు. మన ఆలోచనలు.. ఆచరణలూ అన్నీ మెదడుపైనే ఆధారపడి పనిచేస్తుంటాయి. మెదడు లేకుంటే శరీరం ఇంజన్‌లేని రైలు, దారం లేని గాలి పటం అవుతుంది. వృద్ధులు తమ కర్తవ్యాలను నెరవేర్చుకుంటూ లక్ష్యాలను చేరి ఆనందంగా జీవించేందుకు ఇతర శారీరక అవయవాలతో పాటు మానసిక ఆరోగ్యం బాగుండేలా చూసుకోవాలంటున్నారు. ఇందుకోసం అవగాహన ఏర్పరచుకునేందుకు, అప్రమత్తంగా ఉండేందుకు అవసరమైన ప్రణాళికలు రచించుకునేందుకు, 'వృద్ధోపనిషత్' కావ్యాన్ని గోపిగారు రచించారు.

ఇటీవల కాలంలో మానసిక వ్యాధులతో ఆసుపత్రులకు వెళ్తున్నవారిలో వృద్ధులు ఎక్కువగా ఉంటున్నారనేది పరిశోధనల ద్వారా తేల్చిన నిజం. వీరిలో అత్యధికులు మనోవేదనకు గురికావడం, నిద్రలేమి, ఆందోళన, చిత్తవైకల్యం వంటి ఆరోగ్య సమస్యలతో వెళ్ళేవారే ఎక్కువ. వృద్ధాప్యంలో మానసిన రుగ్మతలు దరిచేరకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు మానసిక వైద్యులు. వృద్ధుల పట్ల కుటుంబంలోని సభ్యులు ప్రేమతో వ్యవహరించకపోవడమే వారిని మానసికంగా ఆందోళనకు గురిచేస్తుందని చెప్పవచ్చు.

మనిషికి అరవయ్యేళ్ళురాగానే వృద్ధులైపోయారని అంటారు. కానీ నిజమైన జీవితం మొదలయ్యేది స్వీట్ సిక్స్టీస్ లోనే అన్న విషయాన్ని మారిచిపోతున్నారు. అరవయ్యేండ్లు పైబడిన అనుభవజ్ఞుల శక్తిని, అనుభవ సారాన్ని ఉపయోగించుకుంటే తప్పకుండా ఏ దేశమైనా పురోగమిస్తుందన్న విషయాన్ని నేటి సమాజం గుర్తించలేకపోతోంది. ఈ పురోగమన భావాన్ని

ఎలా సాధించాలో కవి ఈ కావ్యం ద్వారా తెలియజేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో వృద్ధులకు ఇవ్వవలసిన స్థాయిని గురించి వివరిస్తూనే వారు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలను గురించి కూడా విశ్లేషించారు.

వృద్ధుల మానసిక సమస్యలను గురించి ఆలోచిస్తే చాలామంది ఏమంటారంటే ఆయనకు అరవయ్యేళ్ళు దాటాయి కొంత మతిస్థిమితం బాగాలేదు పిచ్చి పిచ్చిగా చేస్తాడు అంటూ వృద్ధుల మనో భావాలు దెబ్బతీసేలా మాట్లాడతారు. నిజానికి ఇలాంటి మాటల మూలంగానే వృద్ధులు ఎంతో మానసిక క్షోభకు గురై అరవయ్యేళ్ళ ప్రాయంలోనే మంచాన పడుతున్నారు. గోపి గారు వారికున్న రచనా నైపుణ్యంతో వృద్ధుల మానసిక స్థితి ఎలా వుంటుంది. వారి మనస్సును ఎలా అర్థం చేసుకోవాలనే విషయాలను గురించి హృదయం చలించేటువంటి వాక్యాలతో ఈ 'వృద్ధోపనిషత్' కావ్యాన్ని కవిత్వీకరించారు. లుప్తమైపోతున్న మానవత్వ విలువలపైననే కవి తన మొత్తం దృష్టిని కేంద్రీకరించి విశ్లేషించారు.

**"ఒంటరితనం"** అనే కవితలో వృద్ధుల మానసిక సమస్యల గురించి ఎంతో స్పష్టంగా విశ్లేషించే ప్రయత్నం చేశారు.

'ఒంటరితనమంటే
చుట్టూ ఎవరు లేకపోవటం కాదు
ఉన్నా లేనట్టు అనిపించడం
ఒంటరితనమంటే
జ్ఞాపకాలు
మరపు మడతల్లో చిక్కుకొని
విలవిలలాడటం.' (పుట : 23)

ఇక్కడ ఒంటరితనం మూలంగా మనసులో కలిగే అలజడిని గురించి వివరించారు. మనిషికి మనిషి తోడు ఉంటే ఎవ్వరైనా ధైర్యంగా ఉంటారు. అదే మనిషి పక్కన ఉన్నప్పటికి తనకు

ఎవరితో సంబంధం లేనట్టు తనపని తాను చూసుకుని ఇతరులను పట్టించుకోనప్పుడు అవతలి వ్యక్తిలో కలిగే బాధను మాటల్లో చెప్పలేం. అదే విషయాన్ని భావస్ఫోరకంగా కవి ఈ **'ఒంటరితనం'** కవితలో చెప్పారు. నేటి సమాజం ఎలా తయారయ్యిందంటే ఇద్దరు వ్యక్తులు పక్క పక్కనే కూర్చున్నప్పటికీ వారిరువూ మాట్లాడుకోకుండా స్మార్ట్ ఫోనుల ద్వారా వేరెక్కడో ఉన్న వేరే, ఇద్దరు వ్యక్తులతో చాటింగ్ పేరుతో సంభాషిస్తున్నారు. ఆ ఇద్దరి మధ్యలో స్మార్ట్ ఫోను లేని వ్యక్తి ఉంటే ఇక ఆ వ్యక్తి ఈ ఇద్దరి మధ్యలో కూర్చున్నప్పటికి ఒంటరిగానే మిగిలిపోతాడు. అదే కుటుంబంలో కూడా ఉమ్మడిగా ఎంతమంది కలిసి ఉన్నప్పటికి అందరి మధ్య ప్రేమ, అనుబంధాలు లేకుంటే ఎంతమంది ఉన్న అందరూ విడివిడిగా ఒంటరిగానే మిగులుతారు. ఇక వృద్ధులకు అయితే పలకరించే నాథుడు లేడంటే వారు అనుభవించే మానసిక క్షోభ పరిధులు దాటి గ్రహాంతరాలకు చేరుకుంటుంది.

**"ఒంటరితనం"** అనే కవితలో ఒంటరితన భావనను మాత్రమే కలిగింపజేసిన కవి **"నీళ్ళు"** కవిత ద్వారా కుటుంబంలో నిజమైన ఒంటరితనమంటే ఎలాంటిదన్న విషయాన్ని కళ్ళకు కట్టే విధంగా హృదయంలో ఆర్ధ్రత భావం నిండేలా చెప్పారు.

ఒక కుటుంబంలో మంచాన పడ్డ వృద్ధాప్య సమయంలో దాహం వేసి పైకి లేవలేని స్థితిలో ఉంటారు. అప్పుడు కొడుకును చెంబులో నీళ్ళు అయిపోయినై కొంచెం నింపరా అంటే కొడుకు షాపింగ్ కు వెళ్ళే తొందరలో వినిపించుకోడు. ఇక కోడలిని అడిగితే కోడలు విన్నా విననట్టే వెళ్ళిపోతుంది. మనవడన్నా ఇస్తాడేమో అంటే టీవీలో పీకల్లోతుకు మునిగిపోయాడు. చివరకు పనివాడికి కేకేస్తే పనివాడు కూరగాయలు కొనుక్కురావడం కోసం వృద్ధాప్య మాటలు లెక్కజేయకుండా సంతకు పరుగెత్తుతాడు. ఆ సందర్భంలో...

'కాస్సేపు
నిశ్శబ్దం రాజ్యమేలింది.
ఎవరు నింపారో తెలియదు గాని

అతని కళ్ళ నిండా నీళ్ళు'                (పుట : 25)

అన్న వాక్యాలతో కవిత మొత్తాన్ని కన్నీటితో నింపేసారు గోపి. అంటే ఇటువంటి సంఘటనల మూలంగానే వృద్ధులు మానసికంగా కృంగి పోతున్నారన్న విషయాన్ని ఒక్కో అనుభవపు పొరలు తొలచుకుని మనస్సు అంతరంగంలో చొచ్చుకుపోయేలా చెప్పారు. ఈ కవితలో ఊహకందని ముగింపుతో వృద్ధుల మానసిక స్థితిని దర్శించేలా చేశాడు.

వృద్ధులు వృద్ధాప్యం వచ్చిందంటే ఆరాం కూర్చీకే పరిమితమవుతారు. **"ఆరాం కుర్చీ"** అనే కవిత ద్వారా తాతా మనవడి మధ్య ఉండే అనుబంధాన్ని వివరించి కుర్చీ మూలంగా వృద్ధుడు పొందిన ఆవేదనను వివరించాడు. ఒకరోజు ఆరాం కుర్చీ స్క్రూ ఊడి కింద పడిపోయినప్పుడు ఏర్పడ్డ పరిణామాన్ని చెప్తూ...

'ఒకరోజు దాని స్క్రూ ఊడిపోయి
కింద పడి పోయాడు.
చేతిమీద ఆనిన దేహంతో
ఎముక పర్రె వాసింది.
గాయం కన్న
అతని మనస్సే ఎక్కువ గాయపడింది'.        (పుట : 36)

కింద పడ్డప్పుడు ఎవ్వరైనా దెబ్బతాకిందనే బాధ పడతారు కాని మనసు నిబ్బరంగానే ఉంచుకుంటారు. కానీ ఇందులో చేతికి తగిలిన గాయం కన్నా మనస్సుకు తగిలిన గాయమే ఎక్కువ అంటూ పాఠకులకు ఎందుకు అనే ప్రశ్నను సంధిస్తున్నాడు.

**"హాస్పిటల్స్ లో కవిత్వముండదు"** కవితలో గోపిగారు వృద్ధుల మానసిక క్షోభకు కారణమైన సంఘటనలను ఎంతో అద్భుతంగా వివరించారు. వృద్ధుల పట్ల హాస్పిటల్లోని డాక్టర్లు, నర్సులు, వచ్చేపోయే వైద్యులు ఏ విధంగా ప్రవర్తిస్తారో తెలిపి వృద్ధుల అంతరంగంలో కలిగే

అలజడిని వ్యక్తికరించాడు. హాస్పిటలుకు వెళ్ళే ప్రతివ్యక్తి జీవన కాంక్షను, బ్రతుకుపట్ల ఉన్న ప్రీతిని ఎంతో కవితాత్మకంగా చిత్రించారు.

**"పూర్ణ కుంభం"** కవితలో వృద్ధులు పైకి వృద్ధాప్యాన్ని అంగీకరించి పెదాలతో బోసి నవ్వు నవ్వినా ఆ భావన వారి మనసు లోలోపల స్వీకరించదంటున్నారు. వృద్ధ జీవితంలో ఎదురయ్యే సంఘటనల మూలంగా వారు గతాన్ని గురించి మాత్రమే ఆలోచిస్తూ భవిష్యత్తును మరచిపోతున్నారు. కొంచెం మనస్సు బరువెక్కినా జ్ఞాపకాల గతంలోకి ప్రయాణిస్తున్నారని వారి మానసిక స్థితిని వివరించాడు.

ఈ విధంగా వృద్ధులు మానసిక సంక్షోభానికి గురికావడం మూలంగానే, సంతోషంగా జీవించాల్సిన సమయంలో కూడా మానసిక సమస్యలు ఎదుర్కోవలసి వస్తుంది. ఈ సమస్యలన్నింటినీ అధిగమించి వసంతకాలంలో చిగురించే వృక్షాల మాదిరిగా నూతన తేజస్సుతో భావితరాలకు మార్గదర్శకంగా నిలవాలని గోపి కాంక్షిస్తున్నారు.

## 2.3. కుటుంబ వ్యవస్థలో వృద్ధులు

ప్రతీ వ్యక్తి చిరుద్యోగిగా జీవితం ప్రారంభమైనప్పటి నుండి భవిష్యత్తులో, ప్రశాంతమైన జీవితం కోసం కృషి చేస్తూ పదవీ విరమణ అయ్యేనాటికి స్వంత ఇల్లు ఏర్పాటుచేసుకుని పిల్లలు, వారి పిల్లలతో శేష జీవితం సంతోషంగా గడపాలని ప్రతివారూ ఆశపడతారు. తదనుగుణంగా కష్టపడతారు. ఈ క్రమంలో చాలామంది సహజమైన ఆనందానికి నేటి వృద్ధులు దూరమవుతున్నారు. 'వృద్ధుల బుద్ధులు సంచలింపవే'[16] అని భారతంలోని సభాపర్వంలో శిశుపాలుడు భీష్మున్ని కించపరుస్తూ పలికిన మాటను తమకు అన్వయించుకోవడం వారిలో మొదలైంది.

[16] కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము, (సరళ వ్యాఖ్యాన సహితం) సంపుటము 2, సభాపర్వము. కృతికర్త నన్నయభట్టారకుడు, వ్యాఖ్యాత. డాక్టర్ అప్పజోడు వేంకటసుబ్బయ్య. 2006. తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి. పుట. 131.

లోకంలో వెలుగుచూస్తున్న కొందరు సంతానం తీరుతెన్నులు, అమానుష వైఖరిని బట్టి 'మాతృదేవో భవ, పితృదేవో భవ' శ్లోకం స్తుతికే పరిమితమవుతున్నట్లనిపిస్తోంది. 'అపుత్రస్య గతిర్నాస్తి' సూక్తికి కాలదోషం పడుతోంది. కుటుంబ వ్యవస్థలో వయసు మళ్లిన వృద్ధుని పరిస్థితి కొన్ని సందర్భాల్లో దుర్భరంగా ఉంటుంది. వృద్ధులు వయసు పెరిగేకొద్ది తమ పని తాము చేసుకోలేని పరిస్థితికి వస్తారు.

కొందరికి వయసు పెరిగే కొద్ది శరీరంలో శక్తి నశించి అనేక ఆరోగ్య సమస్యలు వస్తుంటాయి. దానితో వారు మంచాన పడతారు. వారికి ఏదైనా అవసరం వచ్చినప్పుడు మంచం మీద నుండి లేవలేని పరిస్థితి, ఒకవేళ లేద్దామని ప్రయత్నించిన శరీరం సహకరించదు. కాళ్లు కదిలిన వెన్నెముక మంచం మీద నుండి లేవనంటాంది. ఆ సమయంలో వాళ్లను పట్టించుకునే నాథులు కరువైపోతారు. ప్రతిసారి తన మాటకు తన కన్నీరే సమాధానం ఇస్తుంది. ఎంత కన్నీరు కార్చిన ఎవరికీ కనికరం రాదు. అటువంటి వృద్ధుల దీనస్థితి గురించిన వృద్ధ భవిష్యత్తును కవి మన కళ్ళకు కట్టినట్టు చిత్రించాడు. కుటుంబంలో ఉన్న అందరు వ్యక్తులలో ఎవరో ఒకరు వృద్ధులకు ఎల్లప్పుడూ సహాయం అందించాల్సి ఉంటుంది. వారికి ఎలాంటి సహాయం అందక కొందరు వృద్ధులు పడే బాధ ఏ విధంగా ఉంటుంది అనేది ఈ క్రింది కవితలలో కవి ఇలా వివరించాడు.

కుటుంబ అభివృద్ధికి మూలపురుషులుగా నిలిచిన పెద్దలను గురించి, వారి గొప్పతనాన్ని గురించి **"వయోధిక స్పృహ"** అన్న కవితలో మరోసారి గుర్తు చేశారు.

'గతంలో ఎన్నోసార్లు చనిపోయాడు
ఇవాళ చివరి మరణం గురించి
భయపడటం అబద్ధం కాదు,
తన ప్రశ్నలకు ఎవరూ
సమాధానం చెప్పని పరిస్థితిలో
చుట్టూ ఒక

తీరని ఒంటరితనం

వ్యాపించడం అబద్ధం కాదు'                    (పుట : 81)

చుట్టూ ఎందరున్న పలకరించేవారు లేనప్పుడు మనకు మిగిలేది ఒంటరితనమే అన్న భావనను వృద్ధులు ప్రతిరోజూ అనుభవిస్తూనే ఉంటారు. వారిని ఎన్నో సందర్భాలలో చులకనగా చూస్తారు. సమాజం ఎన్ని ఎత్తిపొడుపులు చేసిన కుటుంబం వారిని ఆదుకుంటుందిలే అనే భావన వారిలో ఉంటుంది. కానీ కుటుంబమే వారిని పట్టించుకోనప్పుడు ప్రతిరోజు ప్రాణం పోయినంత బాధ వేస్తుంది. అందుకే కవి చివరలో అంటున్నారు 'గతంలో ఎన్నోసార్లు చనిపోయాడు ఇవాళ చివరి మరణం గురించి భయం లేదు' అని.

"పరుగులు తీసే జీవితంలో

ముసుగులు తొడిగిన పరిణామాలెన్నో"

ప్రతి మనిషి బాధకు బంధానికి మధ్య ముసుగులు తొడిగి జీవిస్తున్నాడు. యవ్వనంలో ఎంతటి బాధ కలిగిన దాన్ని అందరితో పంచుకోకుండా తనలో తానే మదనపడి పైకి మాత్రం సంతోషంగా ఉన్నట్లు నటిస్తారు. అవే బాధలు వృద్ధాప్యంలో వస్తే మాత్రం వాటిని మనసులో దాచుకునే శక్తి వారిలో ఉండదు. ఇప్పటికైనా వారి భావాన్ని నలుగురితో పంచుకోవడానికైనా అవకాశం ఇస్తారా అంటే నిన్నటి వార్తా పత్రికలా వారిని భావించి మూగపోయేల చేస్తారు.

వృద్ధులకు చివరి దశలో ఏ పనిచేయాలని తోచదు వారు ఇంట్లో ఉన్న మనుమళ్ళు, మనుమరాళ్ళతో ఆడుకోవాలని, వారితో శేషజీవితం గడపాలని భావిస్తారు. పూర్వకాలంలో అయితే ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. అందరూ కలిసి ఒకే ఇంట్లో ఉండేవారు. పెద్దలు అంటే ఇంట్లో అందరికీ గౌరవం మర్యాద ఉండేది. వారు చెప్పింది ప్రతి ఒక్కరు శ్రద్ధగా వినేవారు. రాను రాను సమాజంలో సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందదం వల్ల అలాగే కొత్త కొత్త టెక్నాలజీల వల్ల అందరూ సాంకేతిక అభివృద్ధికి అలవాటుపడ్డారు. అలా ఉద్యోగానికి, సంపాదనకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం మూలాన ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయి.

కుటుంబంలోని పరిస్థితులే మనిషిలో మనోధైర్యాన్ని నింపగలవు. అవే పరిస్థితులు మనిషిని అధోజగత్తులోకి నెట్టగలవు. అటువంటి పరిస్థితులనే వృద్ధులు ఎలా ఎదుర్కొంటున్నారన్నా అంశాలను కవి అద్భుతంగా విశ్లేషించారు. వార్ధక్య జీవితం ఎలా ఉండాలనే విషయాన్ని ఒక కవి ఇలా వివరించాడు "వార్ధక్యం అనే జీవితపు ఒడ్డును వ్యక్తి సంఘర్షణలన్నింటినీ దాటి, తుపానులను తట్టుకుని వ్యక్తి వార్ధక్యమనే జీవితపు ఒడ్డును చేరుతాడు. ఆ ఒడ్డున వ్యక్తి మరింత ప్రశాంతంగా, మరింత సుఖంగా, సమాజానికి మరింత ప్రయోజనకరంగా తయారుకాగలుగుతాడు".[17]

ఆనంద నిలయమయిన కుటుంబంలో జీవించే వృద్ధులు కొంత ఎక్కువకాలం బ్రతికేందుకు అవకాశం ఉంటుందని ఈ వాక్యాలు చదువుతుంటే అర్థమవుతుంది. ఎందుకంటే వారికి వారి కుటుంబ సభ్యుల నుండి కావలసినంత ప్రేమ, ఆప్యాయతలు లభిస్తే ఆ ఆనందం వారికి ఇంకొంత ఎక్కువకాలం బ్రతికేందుకు తోడ్పడతుంది. కానీ కుటుంబంలోని వ్యక్తులే శత్రువులుగా మారినప్పుడు, కుటుంబ సభ్యుల నుండి కావలసినంత ప్రేమ, ఆప్యాయత అనేది దొరక్కపోతే వృద్ధాప్యంలో వారికి ప్రతి రోజూ ఎదురయ్యేది తీవ్ర ఆవేదనే తప్ప వేరేది కాదు. అవే డెబ్బై, ఎనభై సంవత్సరాలు బతకాల్సిన మనిషిని అరవై ఏళ్లకే కాటికి పయనించేల చేస్తున్నాయి.

ఈ విధంగా ఆయుష్షు తీరకముందే మృత్యువును ఆహ్వానించే వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. బతికినంత కాలం పిల్లలు, కుటుంబమంటూ ఎన్నో త్యాగాలు చేసి పిల్లల భవిష్యత్తుని తీర్చిదిద్దాక కడకు వృద్ధాప్యంలో తమకు ఏమీ ఒరిగింది అన్న భావనతో, విరక్తి చెంది ఆత్మన్యూనత భావానికి గురయ్యి మానసిక ప్రశాంతత కోల్పోయి రక్తపోటు పెరిగి అనేక మంది పక్షవాతానికి గురవుతున్నారు. మంచాన పడిన వృద్ధులను చూసి పెద్ద రోగిగా, భారంగా భావించిన కొడుకు కానీ, కూతుళ్ళు కానీ, కోడళ్ళు కానీ ఎవ్వరూ తగిన సపర్యలు చేసిన పాపాన

[17] వృద్ధాప్యం జీవిత నవనీతం– ప్రకాశకులు గాయత్రి చేతన మరియు ధ్యాన కేంద్రం, హైదరాబాదు. పుట. 2.

పోరు. ఇలాంటి పరిస్థితులలో ఆదరణ, ఆప్యాయత, అనురాగం, అభిమానం, ఆత్మీయత కరువై వార్ధక్యాన్ని ఒక శాపంగా భావిస్తూ మనోవేదనకు గురై మరణం కొరకై నిరీక్షిస్తున్నారు.

వృద్ధాప్యంలో అనురాగాలు, ఆత్మీయతలు, ప్రేమానుబంధాలు లేకపోగా, చివరికి ఆత్మ సంతృప్తి కూడా కరువై, జన్మ నిష్ఠూరంగా శేష జీవితం గడపవలసి వస్తుంది. రోజు రోజుకి వారి గోడు వినే నాథులే లేకుండా పోయారు. కుటుంబంలోని వ్యక్తుల ప్రేమాభిమానాలు వృద్ధాప్య దశలో వారికి కొండంత బలాన్ని ఇస్తాయి. హృదయంలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయి, మనశ్శాంతిని ప్రసాదిస్తాయి. ఆహ్లాదకరమైన కుటుంబ వాతావరణం మనిషికి మరికొంతకాలం జీవించేందుకు తోడ్పడుతుంది. వృద్ధాప్య జీవితంలో ఆత్మక్షోభకు, అభద్రతా భావానికి గురికాకుండా ఉండడానికి కుటుంబమే ప్రధాన పాత్రను పోషిస్తుంది. అప్పుడే వృద్ధుల జీవితం ప్రశాంతంగా ముగిసేందుకు వీలవుతుంది.

నిరాశా భావంతో కృష్ణశాస్త్రి ఇలా అన్నారు 'నా మరణ శెయ్య పరుచుకున్నాను నేనే, నాకు నేనే వీడ్కోలు వినిపించుకున్నాను'. అంటే ఇక్కడ కవిని చెరదీసే మనిషి తోడుగా లేకపోవడంతో స్వయంగా తనకు తానే మృత్యువును ఆహ్వానిస్తున్నాడు. ఈ నిరాశ భావమే వయసు పెరిగే కొద్దీ ప్రతీ వృద్ధుడిలో కలుగుతుంది. ఎందుకంటే చాలామంది వృద్ధాప్య జీవితం వరకు ఎన్నో రకాల పనులను చేస్తూ జీవనం కొనసాగించి పదవీ విరమణ పొందిన తర్వాత కూడా ఉరుకులు, పరుగులు లేకుండా కుటుంబంతో ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని అనుకుంటారు. కానీ ఇంట్లో వాళ్ళ ప్రవర్తనల మూలంగా వయసు మళ్ళిన దశలో కూడా అనవసరమైన శ్రమకూ, ఒత్తిడికీ గురయ్యి నిరుత్సాహం పడుతున్నారు.

పెద్దవారు ఉన్న ఇంట్లో ఉద్యోగం చేసే కొడుకు లేదా కోడలు లేదా కూతురు ఉంటే వాళ్ళ పిల్లలను ఇంట్లో ఉన్న పెద్దవాల్లకు అప్పజెప్పి వాళ్ళు చక్కగా ఉద్యోగానికి వెళ్తారు. ఆ పెద్దవాళ్ళు మనుమలను  మనుమరాళ్ళను చిన్నప్పట్టి నుండి పెంచి పెద్దచేసి వాళ్ళు పాఠశాలకు వెళ్ళే వరకు వారి ఆలనపాలనా చూడడానికి వృద్ధులను ఉపయోగించుకుంటారు. ఆ వృద్ధుల అవసరం తీరాక

వాళ్ళను ఇంట్లోనుండి గెంటేస్తారు. ఇలాంటి పరిస్థితులలో వృద్ధులు ఆ బాధతో ఎన్ని ఔషధాలు మింగినా ఆరోగ్యం కుదురుగా ఉండదు. అందరూ చుట్టూనే ఉన్న ఆత్మీయ అనురాగాలు అసలే ఉండవు. అన్నీ ఉండి కూడా ఆనందం కరువైపోతుంది. అదే విషయాన్ని కవి ఇలా అన్నాడు

'సమయానికి అటూ ఇటుగా
అన్నం గిన్నె వస్తుందిగాని
దానిలో కోడలి చిరునవ్వులుండవు'. (పుట : 43)

ఈ వాక్యాలలో కుటుంబంలో వృద్ధులు కోల్పోతున్న ఆత్మీయత అనుబంధాలు అర్థమవుతాయి.

'పుట్టించినవాడు పూరి మేపకపోతాడా' అన్న నమ్మకంతోనూ, పిల్లలున్నారులే అన్న విశ్వాసంతో, అధిక సంతానాన్ని కని, తమకున్న పరిమితమైన వనరులను తాహతుకు మించి బిడ్డల చదువులకు, పెళ్లిళ్ళకు ఖర్చు చేసి, ఆ మీదట వృద్ధాప్య స్థితిలో అవస్థలకు గురవుతున్నవారు సమాజంలో చాలా మంది ఉన్నారు. చివరి దశలో కన్నపిల్లలే మీ చావు మీరు చావండి మమ్మల్ని ప్రశాంతంగా ఉండనివ్వండని ఇంట్లో నుండి గెంటేసే సంఘటనలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి.

శక్తి సామర్థ్యాలు, ఆత్మస్థైర్యం పుష్కలంగా ఉన్న వయసులో కష్టనష్టాలు వస్తే ఎదుర్కొనే సత్తువ, సమస్యలను అధిగమించే శక్తి వార్ధక్యం సంభవించేనాటికి ఉండదు. వృద్ధాప్యం వచ్చిందంటేనే తన కుటుంబంలో తనకే దినదినము గండంగా తయారవుతుంది. స్వార్థం, వ్యాపార దృక్పథం విపరీతంగా పెరుగుతున్న ఈనాటి సమాజంలో నైతిక విలువలకు, మానవ సంబంధాలకు అర్థాలు, నిర్వచనాలు ఊహించని రీతిలో మారిపోతున్నాయి.

ప్రస్తుత సమాజంలో బిడ్డలు, బంధువులు, ఇరుగు పొరుగువారు ఒక్కరని కాదు అందరూ వృద్ధులను చులకనగా చూస్తూ సాయం చేసేవారే కనుమరుగైపోతున్నారు. ఆరోగ్య పరిస్థితులు విషమించి మంచాన పడ్డ వృద్ధులకు కుటుంబ సభ్యుల నుండి కావలసినంత సానుభూతి,

సహకారాలు ఏ మాత్రం లభించకనే చాలామంది వృద్ధులు బ్రతికుండగానే మృత్యువును ఆహ్వానిస్తూ, మృత్యుఘోషను అనుభవిస్తున్నారు. ఈ విధంగా ఎంతోమంది ఆపత్సమయంలో ఏకాకిగా మిగిలి అయిన వాళ్లు దూరమై ఆత్మీయతను కోల్పోయిన వృద్ధుల జీవితం అత్యంత దుర్భరంగా తయారవుతుంది. పిల్లలు పెరిగి పెద్దవాళ్లై, ఉద్యోగాల నిమిత్తం ఎక్కడెక్కడో స్థిరపడవలసి వస్తుంది.

ఈ పరిస్థితులలో, వృద్ధాప్య దశలో దీర్ఘకాల రుగ్మతలకు గురై మంచాన పడ్డ తల్లిదండ్రుల బాగోగులను గమనించే వాళ్లే కరువైపోతున్నారు. **"అమ్మ ఒక మనిషి"** అన్న కవితలో గోపిగారు ఇలా అంటున్నారు.

'ఏ జీవక్షణాల్లో
నిన్ను కడుపులో వేసుకుందో
ఇప్పుడనుభవిస్తున్నది.
కాని
రేపటి అపరాధభావం
నిన్ను మెలి పెడుతుంటే మాత్రం
ఓదార్చటానికి ఆమె ఉండదు.' (పుట : 27)

అంటూ వృద్ధతల్లి దీనావస్థను ఈ కవితలో వివరించారు. ఈ కవితలో కవి హృదయంలో దాగివున్న తపన కనిపిస్తుంది. ఒక నిస్సహాయ మనిషి మరొకరి తోడు కోరడాన్ని కవి ఈ కవితలో హృదయవిదారకంగా అక్షరీకరించారు. అందుకే ఏ క్షణంలో నిన్ను కడుపులో వేసుకుందో ఈ వృద్ధాప్యంలో అనుభవిస్తున్నదన్నారు. ఆ తల్లి మరణించిన తరువాత మా అమ్మ నా వల్లే మరణించింది అన్న భావన రేపు నీవనుభవించిన రోజున నీకనిపించినా..! నిన్ను ఓదార్చడానికి ఆమె మాత్రం ఉండదని విషాద ఘట్టాన్ని కవి కళ్ళముందుంచాడు.

బతికుండగానే ఏదయినా చేసి తల్లిదండ్రుల ఋణం తీర్చుకో, వారు మరణించిన తరువాత నువ్వు ఎంత పశ్చాత్తాప పడ్డ నిన్ను ఓదార్చి చేరదీయడానికి వాళ్ళు మాత్రం నీతో ఉండరని నేటి సమాజానికి హితోక్తి బోధిస్తున్నారు.

## 2.3.1. ఇంట్లో వృద్ధుల పరిస్థితులు

మనం బతకబోయే బతుకువాళ్లు. మనం నడవబోయే దారి వాళ్లు. ఇప్పటి సమాజాన్ని మనకంటే ముందు స్వప్నించినదివాళ్లు. దీని నిర్మాణానికి మనకంటే ముందు రాళ్లెత్తిన వాళ్లు. చరిత్రకు ప్రత్యక్ష సాక్షులు వాళ్లు. వాళ్లే మనవాళ్లు. మన పెద్దలు. వయోధికులు. ప్రతి అంశంలోనూ వాళ్లకు ఒక అనుభవం ఉంటుంది; ఆలోచన ఉంటుంది; తమదైన దృష్టికోణం ఉంటుంది. గతాన్ని భవిష్యత్తుతో ముడివేస్తూ వర్తమానంతో జరిపే సంభాషణ వాళ్ల జీవితసారం. అయినప్పటికీ చరిత్రలో వయోధికులకు అందాల్సినంత ఆదరణ అందిందా? వర్తమానం సంగతేమిటి? వీటన్నిటికీ సమాజం ఎంత కారణమో అంతకంటే ఎక్కువ కుటుంబమే అని చెప్పాలి.

వృద్ధాప్యంలో పేదరికం ఒక సమస్య అయితే, ఉన్నట్టుండి జీవితం చేజారిపోయినట్టవడం, కాలం ఎలా గడపాలో తెలియకపోవడం మరో రకమైన సమస్య. చేతిలోంచి అధికారం జారిపోతుంది, డబ్బులు వచ్చే మార్గం ఆగిపోతుంది, రోజూ అలవాటుపడిన ఆఫీసు, పనిస్థలం ఒక్కసారిగా పరాయిదయిపోతుంది. ఇలాంటి సందర్భంలోనే ఇంట్లోవాళ్లు మరింత ఎక్కువ శ్రద్ధ కనబర్చిస్తే వృద్ధాప్యం సంతోషదాయకమవుతుంది.

### 2.3.1.1. కుటుంబం – వృద్ధుడు

తండ్రి వేదన తెలియాలంటే నువ్వు ఓ తండ్రివైతే తెలుస్తుందంటారు పెద్దలు. మంచాన పడిన తండ్రి దాహానికి ఆగలేక గుక్కెడు నీళ్ళ కోసం వయోధిక తండ్రి పడిన బాధలు ఎలా ఉంటాయో **'నీళ్లు'** కవితలో వివరిస్తూ చదివే పాఠకుడి కళ్లలో నీళ్ళు నిండేలా కవి ఎంతో గొప్పగా చెప్పాడు.

'అరె బాబు!

చెంబులో నీళ్ళు అయిపోయినై

కొంచెం నింపి పోరా!'                    (పుట : 25)

అంటూ మనోవేదిక తెరను దింపుతారు గోపిగారు. గుండె ప్రాంగణమంతా భయంకరమైన స్థబ్దతతో బరువెక్కపోతుంది. షాపింగ్ కి వెళ్ళే హడావిడిలో వృద్ధాప్య మాటలు కొడుకు పట్టించుకోకుండా వెళ్ళిపోతాడు. అలాగే కోడలుతో కూడా అమ్మాయి కొన్ని నీళ్ళు తెచ్చిపెట్టమ్మా అన్నా కోడలికి వినపడినా వినపడని విధంగా పట్టించుకోకుండా తన పని తాను చేసుకుంటోంది. ఏ కోళ్ళయిన తమ తల్లిదండ్రులకు ఇచ్చే గౌరవ, మర్యాదలు అత్తమామలకు ఇవ్వడం లేదని ఈ వాక్యాల ద్వారా గ్రహించవచ్చు.

ఒకప్పుడు ఉమ్మడి కుటుంబంలోని వారు అందరూ ఇంట్లోని పెద్ద వారి మాటకు గౌరవం ఇచ్చేవారు. కానీ నేటి కుటుంబాలు విచ్ఛిన్నమైపోవడం మూలంగా సమాజంలో మానవతా విలువలు నశించి పెద్ద, చిన్న అనే భావన లేకండా పోతుంది. దీనికి ప్రధాన కారణం ప్రపంచీకరణ, ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై చిన్న చిన్న కుటుంబాలుగా ఏర్పడడమే అని చెప్పాలి. పూర్వ కాలంలో మామ గారిని కోడళ్ళు తండ్రిలాగా భావించి వారి బాగోగులు చూసుకునేవారు. కానీ ప్రస్తుతం ఒక మనిషిని ఒక మనిషిగా కూడా చూడలేకపోతున్నారు. ఆధునికత ముసుగులో ప్రేమ ఆప్యాయతలు కనుమరుగైపోతున్నాయన్న భావాన్ని కవి ఈ కవితలో తెలియజేశారు.

తల్లిదండ్రుల ప్రవర్తనల మూలంగా ఇంట్లో ఉన్న చిన్నపిల్లలలో కూడా వృద్ధులు అంటే చులకన భావం ఏర్పడుతుంది. ఎందుకంటే పిల్లల అమ్మానాన్నలు వృద్ధులను సక్రమంగా చుసుకోకపోవడం వలన పిల్లలు కూడా పెద్దవారికి గౌరవం ఇవ్వాలన్న సంస్కారాన్ని నేర్చుకోలేకపోతున్నారు. పెద్దవారు ఏదైన పని చెబితే వినాలి, వారికి తగిన సేవలు చేయాలి, వారితో కాసంత సమయం గడపాలని తల్లిదండ్రులు పిల్లలకు చెప్పకపోవడం వలన పిల్లలలో తాతయ్య, నానమ్మ, అమ్మమ్మ అనే ఆప్యాయతలకు స్థానం లేకుండాపోతుంది. అదే విషయాన్ని ఈ సందర్భంలో ఎంతో అద్భుతంగా వివరించారు గోపి. ఆ వృద్ధాప్యం మనవడిని ఎంతో

ఆప్యాయంగా బంగారు నాన్న కొన్ని నీళ్ళు తీసుకురారా అని అడగగా మనుమడు టీవీ చూస్తూ అందులో నిమగ్నమై వినిపించుకునే స్థితిలో లేకుండాపోవడం మానవత్వం కోల్పోయినట్లుగానే అనిపిస్తుంది.

నేటి సమాజంలో సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడం వల్ల, అందరి ఇళ్లలో టీవీలు, కంప్యూటర్లు ఎక్కువవడం వల్ల రోజంతా పిల్లలు వాటితోనే గడుపుతున్నారు. వాటిని చూస్తున్నంత సేపు ఈ ప్రపంచాన్నే మరిచిపోతున్నారు. ఈ కారణంగా ఎవరి మాటా వినరు. చివరికి ఇంట్లో ఉన్న పనివారయిన పట్టించుకుంటారా అంటే పని పూర్తి చేయాలనే ఆతృతలో వృద్ధుల మాటలను లెక్క చేయట్లేదు. నేటి సమాజంలోని నాగరికత వృద్ధులపై ఏ విధంగా ప్రభావం చూపుతుంది అనేది గోపి గారు ఎంతో హృదయ ఆవేదనను ఈ **'నీళ్ళు'** కవితలో నింపారు.

'కాస్సేపు
నిశ్శబ్దం రాజ్యమేలింది.
ఎవరు నింపారో తెలియదు గాని
అతని కళ్ళ నిండా నీళ్ళు!' (పుట : 25)

అన్న పంక్తులు పాఠకుల కళ్ళల్లో నీళ్ళు నింపుతాయి. **'నీళ్ళు'** కవితలో చిత్రించినంత అద్భుతంగా మరే కవితలో కుటుంబంలోని వృద్ధుల ప్రస్తుత జీవితాలను చిత్రించలేదనే చెప్పాలి. కుటుంబలో వృద్ధుని దీన స్థితిని చూస్తే చదివిన పాఠకుడికి తన కుటుంబం కళ్ళముందు మెదులుతుంది. ఈ కవితలో వృద్ధులను కొడుకు, ఎలా చూస్తున్నాడు, కోడలు ఎలా చూస్తుంది, మనవడి దృష్టిలో వృద్ధుల స్థానం ఎలా వుందనే విషయాలు ఎంతో స్పష్టంగా అర్థమవుతాయి. ఈ కవితను చదివిన ప్రతి పాఠకుడు కవితకు కన్నీటి నీరాజనం సమర్పిస్తాడు. ఇంట్లో దాహం కోసం పరితపించిన వృద్ధులకు ఎంత సేపటికి నీళ్ళు రాకపోతే వారి కన్నీళ్లే వారి దాహాన్ని తీర్చాయనడంలో మనస్సులో కన్నీరు ఊటగా ప్రవహిస్తుంది.

జీవితమంతా పరుగులు తీశాడు. ఇప్పుడు జీవించడం కోసం నానా అవస్థలు పడుతున్నారు. కుటుంబంలోని వారు తీరిక లేక వృద్ధుల మాటలు పట్టించుకోనప్పుడు

మాటిమాటికి తన్నుకు వచ్చే కన్నీళ్ళను ఆపలేక పడ్డ వ్యధలను ఈ కవితలో వివరించాడు. చుట్టూ అందరూ ఉన్నా ఒంటరితనం అనే భావన నుంచి బయటపడలేకపోతున్న వృద్ధుని గురించి ఈ 'నీళ్లు' అన్న కవితలో వివరించాడు.

ఒకప్పటిల ఉమ్మడి కుటుంబాలు ఉంటే తాత మనవళ్ళు, మనవరాళ్ళ మధ్య సంభాషణ ఏ విధంగా ఉంటుందో **"మనుమసిద్ధి"** అనే కవితలో గోపి గారు ఇలా వివరించారు.

'తాతా!
నీ పనే బాగుంది.
హోంవర్క్ చేయ్యనక్కర్లేదు
రన్నింగ్ బస్సుల వెంట
పరుగెత్తనక్కర్లేదు
హాయిగా కుర్చీలో కూర్చుంటావు
హుకూంలు జారీ చేస్తుంటావు' (పుట : 49)

అంటూ చిన్నపిల్లలు పెద్ద వాళ్లతో ఏ విధంగా ఉంటారనే విషయాన్ని గోపి ఎంతో చక్కగా వివరించారు. తాతతో మనవడు ఇలా అంటున్నాడు. తాతా నీ పనే మంచిగా ఉంది మా లాగా నువ్వు హోం-వర్కు చేయవలసిన అవసరం లేదు పాఠశాలకు వెళ్లాల్సిన అవసరం లేదు ఇంట్లోనే కూర్చొని అందరికీ ఆదేశాలు ఇస్తూ అన్నీ నీకు అనుకున్న సమయానికి తీసుకురావాలని ఒకవేళ ఆలస్యమైతే ఇంట్లో అందరిపై కోప్పడతావు అంటూ చిన్న పిల్లలు తాతతో సరదాగా ఉంటారు కాని ఆ తాతయ్య తన కోడుకుని ప్రయోజకున్ని చేయడం కోసం పడ్డ యాతన ఆ పిల్లలకు తెలియదు. పిల్లలంతా తండ్రి కోణం నుండే ఆలోచిస్తారు తప్ప తాతయ్య మా నాన్న కోసం ఎంత శ్రమ చేశారన్న విషయాన్నీ వారు గ్రహించరు. కనీసం తల్లిదండ్రులయినా ఆ విషయాన్ని గుర్తిస్తారా అంటే అదీ జరగదు. వాటన్నింటిని కవి లోలోపల దాచి మనవడి మాటలకు మురిసిపోతున్న సన్నివేశాలను ఈ కవితలో వివరించారు.

వృద్ధులకు వయసు పెరిగే కొద్ది కొంచెం ఛాదస్తం ఎక్కువవుతుంది. వారి వస్తువులు ఎవరినీ ముట్టనివ్వరు ఎవరైనా ముడితే ఊరుకోరు ఇలా వారి స్వభావంలో వచ్చే మార్పును గురించి వివరిస్తూ గోపి ఇలా అన్నారు. కళ్ళు కనిపించవు అంటూనే గడ్డంలో ఉన్న తెల్ల వెంట్రుకలు ఒక్కటి కూడా ఉండనీయవంటూ పిల్లలు తాతతో ఎలా సంభాషిస్తారో తెలియజేశారు. ఈ కవిత పంక్తులు అన్నీ కూడా ఎక్కడా కొంత ఊపిరి పీల్చుకోనీయకుండా రాశారు గోపి. ఈ కవితలో కుటుంబంలో ఉన్నటువంటి కుటుంబ పెద్దలకు ఇంట్లోని సభ్యులు మర్యాద ఇచ్చి గౌరవ భావంతో చుస్తే మనవడితో, మనమరాళ్లతో తాతయ్య ఎలా ఆనందంగా గడుపుతారో వివరించారు.

ఈ **"మనుమసిద్ధి"** కవిత చదివిన అందరికీ బాల్యాన్ని తప్పకుండా గుర్తు చేస్తుంది. ప్రతి పాఠకుడిలో చిన్ననాటి మధురస్మృతులు మనసులో మేదిలే విధంగా ఈ కవిత పంక్తులు రచించాడు కవి. చివరగా అంతా సంభాషించిన తర్వాత తాతయ్య లేకుంటే మనువడికి, నానమ్మకు ఏమి తోచదు అంటూ తాతమీద మనవడికి ఉన్న ప్రేమను వివరిస్తూ కవితను ముగించారు. ఈ కవితలో సంతోషంగా ఉన్నటువంటి వృద్ధుని జీవితాన్ని, కుటుంబ వ్యవ్థను గురించి వివరించారు.

### 2.3.1.2. కుటుంబం – వృద్ధురాలు

సృష్టిలో దేవతలకు కూడా దక్కని అపూర్వ బహుమతి మనుషులకు దక్కింది. ఆ బహుమతి అమ్మే.. అమ్మ అంటే గుర్తుకు వచ్చేవి.. అనుబంధం.. అనురాగం.. ఆత్మీయత.. అన్నింటికీ మించి.. అమ్మంటే మనకు ముందుగా స్ఫురించేది.. ప్రేమ.. సృష్టిలో అమ్మ పంచే ప్రేమ మిగిలిన ప్రేమలకన్నా ఎక్కువ. అది వర్ణించలేనిది, లెక్కించరానిది. అమ్మ ప్రేమ గురించి నిజంగా ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. ప్రపంచంలో మనం అపురూపంగా చూసుకోవాల్సిన వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే.. ఆ వ్యక్తి.. కేవలం అమ్మే.. అవుతుంది. కనిపించిన కనిపెంచిన ప్రత్యక్ష దైవం అమ్మ. అలాంటి అమ్మకు వృద్ధాప్యం సంభవించాక చాలామంది అమ్మను అమ్మ త్యాగాలను అమరిచిపోయి ప్రవర్తిస్తున్నారు. మన దేశంలోని ప్రతీ సాహిత్య గ్రంథం కూడ అమ్మ గురించి

గొప్పగానే చెప్పాయి కానీ ఎక్కడ తక్కువ చేసి చెప్పలేవు. అన్నీ ధర్మాలను ముందే నిర్ణయించి పెట్టిన మనుధర్మ శాస్త్రం కూడా అమ్మను గొప్పగానే చిత్రించినది.

**"ఉపాధ్యాయ దశాచార్య ఆచార్యాణాం శతం పితా**

**సహస్రంతు పితౄన్మాతా గౌరవే తిరిచ్యతే.." [145]**[18]

నూరువురు ఉపాధ్యాయులకంటే ఒక ఆచార్యుడు, నూరువురు ఆచార్యుల కంటే ఒక తండ్రియు, నూరువురు తండ్రులకంటే ఒక తల్లియు, గౌరమున ఎక్కువని చెప్పబడింది. అంటే సృష్టిలో అందరికంటే కూడా తల్లే గొప్పదని భావం.

ఇంట్లో వృద్ధుడి పరిస్థితి ఎలా ఉంటుందో వివరించిన తర్వాత వృద్ధ తల్లి స్థితి ఎలా ఉంటుందో చూపిస్తారు. తన బిడ్డకు జన్మనివ్వడానికి తల్లి ఎంత కష్టపడిందో, ఎంత ఆవేదన పడిందో, ఎంత మృత్యు ముఖంలో నుండి బయటికొస్తుందో తల్లికి మాత్రమే తెలుసు. అటువంటి తల్లికి వయసు పెరిగే సరికి పిల్లలు ఎటువంటి పరిస్థితి కల్పిస్తున్నారో జరుగుతున్న సంఘటనలు చుస్తే అర్థమవుతుంది. వృద్ధురాలికి ఇంట్లో ఎంతటి స్థానం ఇస్తారో **"నాయనమ్మ"** అనే కవితలో తెలియజేశారు. ఈ కవితలో ఒక తల్లి అనుభవించే హృదయఘోష అర్థమవుతుంది. తల్లే లేకపోతే జన్మేలేదని గ్రహించని నేటి సమాజాన్ని కవి నాయనమ్మ మనస్తత్వంతో మమేకమై చెప్తున్నారు. ఇక్కడ కవి వృద్ధుల విషయంలో ఏ ఒక్కరికో పరిమితం కాకుండా స్త్రీ పురుషుల ఇరువురి సమస్యల గురించి వారి బాధలను గురించి అలాగే ఇంట్లోని కుటుంబ సభ్యుల ప్రవర్తనలను గురించి కూలంకుషంగా వివరించారు.

ఒక గ్రామంలోని వృద్ధురాలి పరిస్థితిని గురించి వివరిస్తూ ఒక ఇంట్లో ఓ నాయనమ్మ ఆమె స్థానం ఇంట్లో వరండాలోని ఒక మూల. అక్కడే మూలుగుతూ, ముసురుతూ కాలం ఎల్లదీస్తది. ఆమెతో పాటు చీపురుకట్ట, చేతికర్ర మాత్రమే ఉంటాయి. చీపురు కట్టనేమో ఊడవడానికి, పిల్లలకు ఏమైనా అయితే దిష్టి తీయడానికి ఉపయోగపడుతుంది. గోడకానించిన చేతికర్రనేమో తన బాధలు

[18] మనుస్మృతి, మనుధర్మశాస్త్రం. శ్లోకం.145. ఇమ్మడిశెట్టి అక్కేశ్వర రావు చారిటబుల్ ట్రస్టు, విజయవాడ,2011. పుట: 73.

వినడానికి. ఎందుకంటే వృద్ధుల బాధలు వినడానికి ఇంట్లో ఎవరూ సిద్ధంగా లేరని కవి ముందుగానే తెలియజేస్తున్నాడు.

'సమయానికి అటూఇటుగా
అన్నం గిన్నె వస్తుందిగాని
దానిలో కోడలి చిరునవ్వులుండవు' (పుట : 43)

అన్న వాక్యాలు కుటుంబంలో ప్రేమలు, ఆప్యాయతలు లోపించాయనడానికి నిదర్శనంగా నిలుస్తాయి. కవితలో కనీస ప్రేమకు నోచుకోని దీన స్థితికి చేరుకున్న వృద్ధురాలు జీవితాన్ని చూడవచ్చు. అన్నం పెట్టే సమయంలో కుటుంబీకుల మనస్తత్వం ఎలా వుంటుందని, బుక్కెడు బువ్వ పెట్టడాన్ని కూడా భారంగా భావిస్తున్న నేటి సమాజం మన కళ్లముందు కదలాడుతుంది. ఇలాంటి పరిస్థితులను గమనించిన తరువాత వృద్ధురాలి ఆలోచనలు ఎలా ఉంటాయి అన్న విషయాన్ని ఈ కింది పంక్తులలో వివరించారు.

'ఇంటిముందు రెండు కాకులు
ఆమెనే చూస్తుంటాయి
అవి రేపు నా పిండాన్ని
ముడుతయో లేదో అనుకుంటుంది.
వాముమీద గడ్డి మోపులేస్తున్న
జీతగాడు
పాడె మొయ్యటానికి
ముందుకొస్తడో లేదో!..' (పుట : 43 )

అంటూ నిజంగా వృద్ధుల ఆలోచనలను, మనోభావాలను కవి ఎంతో స్పష్టంగా అర్థం చేసుకున్నారు. అచ్చమైన తెలుగు నుడికారాలతో ఈ కవితని రాశారు. పట్టణాల పరిస్థితి పక్కన పెడితే, పల్లెటూళ్ళలో వృద్ధురాళ్ళ ఆలోచనలు అయితే ఈ కవితలో అద్భుతంగా చిత్రించారు. అలాగే ప్రస్తుత సమాజంలో ఒక మనిషి ఇంకొక మనిషికి ఇచ్చేటటువంటి విలువలు ఏ విధంగా

నశిస్తున్నాయనే విషయాన్ని, వృద్ధుల మనోవేదన ఎలా ఉంటుంది అనే విషయాన్ని ఎంతో రమణీయంగా వర్ణించాడు కవి. మనుమరాలికి నాయనమ్మ అంటే ఇష్టమే కానీ ఆమె మాటలు మనుమరాలికి నానమ్మ చెప్పే పాత కథలు అంటేనే ఇష్టం ఉండదు. చెప్పిన కథలనే మళ్ళీ మళ్ళీ చెప్పి వినాలనే ఆసక్తిని పోగొడుతుందని మనుమరాలు నానమ్మ చెప్పే కథలు వినడమే మానేస్తుంది.

ఉద్యోగం పేరిట కొడుకులు, కూతుళ్ళు తమ కుటుంబాలను, తల్లిదండ్రులను వదిలి విదేశాలకు వెళ్లడం జరుగుతుంది. ఈ క్రమంలో ఇంట్లో తల్లి, తండ్రి మాత్రమే మిగులుతారు. వారు వృద్ధాప్యాన్ని ఎంతో ఆనందంగా గడపాలని అనుకుంటారు. కానీ వారికి అవకాశం లేకుండా పోతుంది.

ఈ కింది **'నాయనమ్మ'** కవితలో గ్రామీణ ప్రాంతంలోని కుటుంబంలో ఉన్న ఒక వృద్ధురాలి జీవితాన్ని చిత్రించిన క్రమం పరిశీలిద్దాం. ఈ కవితలో వృద్ధురాలి దీన పరిస్థితి ఇంట్లో ఎలా ఉంటుందో అర్థమవుతుంది. అదే నాయనమ్మ కవిత.

'ఏ పల్లెటూరయినా కావచ్చు
ఒక ఊళ్లో ఒక వరండా
ఓ మూలన ఓ నాయనమ్మ
ఆమెతోపాటు
ఓ పాత చీపురుకట్ట
ఊడ్వడానికీ,
పిల్లకేదైనా జబ్బు చేస్తే
దిష్టి తీయడానికి' (పుట : 43)

ఈ వాక్యాలలో కుటుంబంలో వృద్ధురాలు పరిస్థితి ఏ విధంగా ఉందనే విషయాన్ని గమనించవచ్చు. శీర్షికలోనే 'నాయనమ్మ' అని ఏంతో అర్థం వచ్చేలా పెట్టారు. కానీ కవిత

మొత్తంలో కన్నీటి వేదననే నింపారు. నాయనమ్మ అంటే నాన్నకు అమ్మ అలాంటి తల్లి స్థితి వృద్ధాప్యం వచ్చేసరికి ఎలా మారిపోతుందో కవితను చదువుతుంటే అర్థమవుతుంది.

ఈ కవితలో చిత్రించిన ఇతివృత్తం అంతాకూడా గ్రామీణ ప్రాంతంలోని కుటుంబ పరిస్థితులే. అదే పట్టణ ప్రాంతంలో అయితే వృద్ధుల వ్యధలకు అవధులే లేవు అని చెప్పవచ్చు. అందుకే కవి పై వాక్యాలలో వృద్ధురాలును మొదట ఇంటికి పెద్దదిగా పరిచయం చేసి, ముగింపు వాక్యాలకు వచ్చేసరికి నాయనమ్మ దీన స్థితిని చిత్రించాడు. కవితలలో కవి ప్రత్యక్షంగా వీక్షించి, పరీక్షించిన వాస్తవ చిత్రణ దర్శనం ఇస్తుంది. స్త్రీని మొదట మాతృ మూర్తిగా భావిస్తాం. పిల్లలు పుట్టినప్పటి నుండి పెద్దయ్యే వరకు పిల్లలపట్ల వారి ప్రేమ ఎంత మాత్రం తగ్గదు. తమకు పుట్టిన పిల్లలకు మాత్రమే కాకుండా వారి పిల్లలకు పుట్టిన మనవళ్ళు, మనుమరాండ్లను రక్షించుకునేందుకు కూడా వారు ముందుంటారు.

పూర్వ కాలంలో వైద్య సదుపాయాలు సరిగా లేని కాలంలో పిల్లలకు జబ్బు చేస్తే ఇంట్లోని నానమ్మతోని లేదా పెద్దవారితోని ఏదో ఒక విధమైన నాటువైద్యం చేయించేవారు. ఆ కాలంలో ఇప్పటి ఆధునిక సదుపాయాలు లేవని కవి ప్రత్యక్షంగానే వివరిస్తున్నాడు. ఆ విధంగా పెద్దమనుషుల చేత దిష్టి తీయించుకునేవారు. అదే విషయాన్నే కవి ఈ పంక్తులలో చిత్రించాడు.

'ఎంతసేపూ జ్ఞాపకాలే
వినడానికి శ్రోతలుండరు.
గోడకానించిన చేతికర్ర మాత్రం
ఎంతకని వింటుంది!.' (పుట : 43)

అని అనడంలో వృద్ధాప్యంలో పిల్లలకంటే చేతికర్రే ఎక్కువగా ఉపయోగపడుతుందంటారు పెద్దలు. అది ఏ ఉద్దేశ్యంతో అన్నా చేతికర్ర వృద్ధులకు నడిచే సమయంలో ఎంతో ఆసరాగా వుంటుంది. మనుషులెవ్వరు లేకపోతే వృద్ధులు తమలో తామే మాట్లాడుకుంటారు. పక్కనే ఉన్న చేతి కర్ర ఆమె బాధలు ఎంతని వింటుంది, విన్నా ఏమి చేస్తుంది అంటున్నాడు కవి. ఇక్కడ వృద్ధుల స్థానం గురించి వివరించిన తరువాత కుటుంబంలో వృద్ధుల స్థితిని గురించి కూడా

వివరించారు. వృద్ధాప్యం వస్తున్నకొద్ది స్థానం మారకపోవచ్చు. కాని ఇంట్లో వారి స్థితి మారుతుందని ఇంట్లో ఒక మూలను సంకేతంగా వివరించారు.

స్వీయ అనుభవాల పేటిక ఈ **'నాయనమ్మ'** కవిత. ఈ కవితలో గోపిగారు నాయనమ్మ ఇతివృత్తంతో కవితను ప్రారంభించి ఆ కథలో నాయనమ్మనే ఒక ప్రధాన వాస్తవ పాత్రగా ప్రవేశపెట్టి ఆమె ద్వారానే జీవిత సంఘటనలను వివరించేలా చేశాడు. ఈ సందర్భంలో శిల్ప ప్రయోగం అద్భుతంగా వుందని చెప్పాలి.

'మనుమరాలికి నాయనమ్మ
ఇష్టమే కాని– బోరు.
మంచి మంచి కథలు చెప్తుంది గాని
ఆ పిల్ల వాటిని
కామిక్సుతో పోల్చుకుంటుంది.
చెప్తూ చెప్తూ ఆ కథలు
హఠాత్తుగా
ఆమె కథగా మారిపోతాయి.' (పుట : 44)

ఈ పంక్తులు వ్యక్తి జీవితాన్ని కథగా మలిచిన సందర్భాలను గుర్తు చేస్తున్నాయి. పిల్లలకు ఉత్కంఠభరితమైన అద్భుత కథలు, హాస్య కథలు అంటే చాలా ఇష్టంగా వింటారు. కాని విషాదాంత కథలు అంటే మాత్రం ఇష్టం ఉండవు. ఆ విషయాన్నే కవి ఈ వాక్యాలలో వివరించాడు. నాయనమ్మ తన మనుమరాలికి ఎంతో మంచిగా తన జీవితానుభవాలను చెబుతూ ఉంటే మనుమరాలు ఆమె చెప్పే మాటలను ఉత్త మాటలుగా పోల్చుకుంటుంది అంటున్నారు. అంటే నేటి సమాజం ఎవరైనా పెద్దల మాటలను, వ్యధలను చులకనగానే చూస్తారేమో అనే భావన మనో ఫలకంలో మెదులుతుంది. మొదట ఎన్ని కథలు చెప్పిన చివరికి ఆమెనే కథగా మారిపోతుంది అనడంలో వృద్ధుల వ్యధలు ఒడవని కథలుగానే మిగిలిపోతున్నాయని అనిపిస్తుంది.

వృద్ధుడు మన ఇంట్లో ఒక వరం లాంటి వాడని ఆయనకు మనం కృతజ్ఞతను చూపాలని **'కృతజ్ఞత'** అనే కవితలో తెలియజేశారు.

'వృద్ధుడు మన ఇంటిలో
ఒక వరంలాంటివాడు
అనుభవాల దారంతో
త్రికాలాలకు వేసిన మూడి లాంటి వాడు' (పుట : 15)

అని అనడంలో కుటుంబంలో ఒక పెద్దమనిషి, అనుభవం పొందిన మనిషి ఉండడం వలన మూడు తరాల జీవితాలు ఒక సరైన మార్గంలో పయణించడానికి వీలవుతుందని, వృద్ధి పొందిన వ్యక్తి కుటుంబానికి ఎంత ముఖ్యమో అన్న విషయాన్ని తెలియజేస్తున్నాడు.

**"అమ్మ ఒక మనిషి"** కవితలోని పంక్తులు మనిషిలోని మానవతా విలువలను ఏ అంచున ఉన్నా తట్టి లేపుతాయి. కవితారంభం నుంచి ముగింపు వరకు దశలవారిగా కవితలోని సారాంశాన్ని తెలియజేసే ప్రయత్నం చేశాడు కవి.

'కొంచెం ఓపిక పట్టాలి
ముసల్ది
నాపాలబడ్డదని అనుకోవద్దు' (పుట : 26)

అంటూ కుటుంబంలో వృద్ధురాలు ఎక్కువకాలం ఉంటే వారి మనోభావాలు ఎలా ఉంటాయనే విషయాన్ని తెలిపారు. కొంచెం ఓపిక పట్టాలన్న మాటలోనే ఆమె ఎక్కువ రోజులు బ్రతకదు అన్న భావనను కలగజేసాడు కవి. అంటే వయసు మృత్యువుకు సమీపించిందని అర్థం. నేటి యాంత్రిక సమాజం ఇంతటి చిన్న విషయాన్ని కూడా గుర్తించలేక పోతుందంటున్నారు గోపి.

'నిన్ను కనడం
యాక్సిడెంటే కావచ్చు
తార్కికంగా
నీ ప్రమేయం అసలే లేకపోవచ్చు.

ఆమె నీకిచ్చిన జన్మనూ
మధురమైన బాల్యాన్ని గుర్తుచెయ్యను
తక్కెడలో దానికి తూగే
ఇవాళటి బాట్లు వెయ్యను.
మాతృదేవోభవా
అంటూ ప్రవచనాలు చెప్పను.' (పుట : 26-27)

అంటూ తల్లి ఆత్మఘోషను చిత్రీకరించాడు. ఇక్కడ గోపి గారే తల్లి స్థానాన్ని స్వీకరించి పుత్రుని హృదయంలో కొంతైనా తల్లి పట్ల ప్రేమను కల్పించడానికి ప్రయత్నిస్తున్నారు. నువ్వు నీ తల్లి అని మరిచిపో కాని ఒక మనిషి, తెలిసిన మనిషి ఒక నిస్సహాయ స్త్రీ ఓపిక నశించి నీ సాయం కోసం ఎదురుచూస్తుంది. అందుకైనా నువ్వు ఆమెను కొంచెం చేరదియ్యి అంటూ హృదయవిదారక సన్నివేశాలను కవి చిత్రించారు.

'ఏ జీవక్షణాలలో
నిన్ను కడుపులో వేసుకుందో
ఇప్పుడనుభవిస్తున్నది.' (పుట : 27)

అనడంలో తల్లి నుండి బిడ్డ దూరమైన దృశ్యం మనసులో మెదులుతుంది. నీతల్లి నీకు జన్మనిచ్చి, నిన్ను అల్లారు ముద్దుగా పెంచిన తల్లి. ఆమె రుణం ఆమె బ్రతికి ఉండగానే సేవలు చేసి తీర్చుకో అంటున్నాడు కవి. ఆమె మరణించాక నువ్వు ఎంత పశ్చాత్తాప పడ్డా నిన్ను ఓదార్చి చేరదీయడానికి ఆమె మాత్రం ఉండదనీ, తల్లి మరణ సందర్భ భావాన్ని స్పష్టంగా చిత్రించాడు.

## 2.4. ఆహ్లాదకరమైన కుటుంబ పరిస్థితులు

కవి వృద్ధుల వ్యథలను, బాధలను ఎన్ని విధాలుగా అయితే వివరించాడో కుటుంబంలోని అందరూ కలిసి ఉంటే వృద్ధులు ఎంత సంతోషంగా ఉంటారో అలాగే కుటుంబం, సమాజం ఎంత మార్పు చెందుతుందనే విషయాలను కూడా కవిత్వీకరించారు. ఈ కవితలలో కవి ఉమ్మడి కుటుంబం లేకపోయినా వృద్ధుల చెంత పిల్లలు ఉంటే వారి హావభావాలు ఎలా ఉంటాయి,

మనవళ్ళు, మనుమరాళ్ళతో వృద్ధ జీవితం ఎంత సరదాగా గడిసిపోతుందన్న విషయాన్ని తెలియజేసారు. ఈ కవితలు చదివినప్పుడు తాత, నాయినమ్మ, అమ్మమ్మలు మనవళ్ళు, మనమరాళ్ళ మధ్య సంభాషణ ఎంత ఆహ్లాదంగా ఉంటుందనే విషయాన్ని చదివే ప్రతి పాఠకుడు తన బాల్య సంఘటనలను స్మృతికి తెచ్చుకుంటాడు.

## 2.4.1. మనుమడు – వృద్ధులు

మొదటగా **"మనుమసిద్ధి"** కవితను చూసినట్లయితే ఇందులో తాత, మనవడి మధ్య జరిగే సంభాషణలు, వారి మధ్య ఉండే అన్యోన్యతను అద్భుతంగా చిత్రించారనిపిస్తుంది. శీర్షికలోనే కవి మనుమడు, సిద్ధి పొందిన వృద్ధుడు అనే అర్థం వచ్చేలా చేశారు. అందుకు మొదట వృద్ధుడు కవితలోని "సిద్ధ పురుషులు" స్థానంలో చేర్చిన తల్లి, తండ్రి, తాత, గురువు పాత్రను ఉదాహరణగా గమనించవచ్చు. ఈ కవితలు మనవడికి తాత పట్ల ఉన్న అపారమైన ప్రేమ కనిపిస్తుంది. ఈ కవితలో మనవడు తాతతో పరిహాసపూర్వకంగా మొదట మాట్లాడుతూ తాత నీపనే బాగుంది. హోంవర్క్ ఉండదు, రన్నింగ్ బస్సు వెంట పరిగెత్తాల్సిన అవసరం లేదు, కూర్చున్న చోటనే అందరికీ హుకూంలు జారీ చేసి నీ పనులు చేయించుకుంటావు అంటాడు. ఏదైనా కొంచెం ఆలస్యమైతే మాత్రం ఇంట్లో ప్రళయం సృష్టిస్తావు. కళ్ళు మసకంటూనే మీసాల్లో ఎక్కడో దాగిన తెల్లవెంట్రుకను వేతికి పీకేస్తావు అంటూ... ఎంతో పరిహాస్యంగా సాగుతుంది సంభాషణ. కానీ చివరి పంక్తులలో మనువడికి తాత పైన ఉన్న అపారమైన ప్రేమను ఒక్కసారిగా గుమ్మరించాడు కవి.

'అయితే ఒకటి
మొన్న నువ్వు ఢిల్లీ వెళ్లినప్పుడు
నానమ్మ నీ గురించి దిగులుపడింది
నువ్వు లేకపోతే
నాక్కూడా ఏమీ తోచలేదు' (పుట : 50)

అన్న వాక్యాలు గోపి గారి నిజ జీవిత వాస్తవ సంఘటనలుగానే తోస్తున్నాయి. పైన తెలిపిన అన్ని సంఘటనలు కూడా గోపి గారికి వర్తింపజేస్తే మనవడితో ఆయన గడిపిన మధురానుభూతులుగా తోస్తాయి. గోపి అరుణ గారిది కూడా ఎంతో అన్యోన్యదాంపత్యం కావడం దీనికి నిదర్శనం. ఎంతైనా ఇది వాస్తవ జీవిత చిత్రణగానే తోస్తుంది. స్వయంగా గోపిగారే ఈ కవితలో తెలుగు కవిగా ప్రత్యక్షం అవుతారు.

కవి స్వీయ అనుభూతులు జ్ఞాపకాలతో **"వారసత్వం"** అనే కవిత రాసినట్లు తోస్తుంది. ఇందులో గోపిగారు మనవడి పాత్రలో తన వారసత్వాన్ని నిలుపుకున్న క్షణాలను గుర్తు చేసుకున్నారు. వాస్తవ ఘటన అని చెప్పడానికి ఒకనాడు మనవడు యాదగిరి గుట్ట దగ్గరలోని నల్గొండ జిల్లా రాజంపేట ఊరికి కాలినడకన వెళతాడు. ఒకప్పటి మా ఇంటికి వెళ్తే అక్కడే ఓ పెద్ద మర్రి చెట్టు కొమ్మలు పరుచుకుని పచ్చగానే ఉందన్నారు. ఇక్కడ ఓ పెద్ద మర్రి చెట్టు అనడంలో వయోధికుడైన తాతకు ఉపమానంగా చెప్పవచ్చు. అందుకే ఇంకా ఆయన జ్ఞాపకాలు సజీవంగా ఉన్నాయని చెప్పడానికి, పచ్చగానే ఉంది అన్నాడు. ఆ చెట్టును చూడగానే తన తాతయ్య రెండు చేతులు చాచి గోపిని ఆలింగనం చేసుకోవడానికి పిలుస్తున్నట్టు అనిపించిందంట. ఆలింగనం చేసుకోవడానికి దగ్గరకు వెళ్ళి తూర్పు ముఖంగా మళ్ళీ ఉన్న పాదాల దగ్గర కూర్చున్నా అంటున్నారు. అక్కడ కూర్చోవడంతోనే పక్కనే ఉన్న బావి తనను ఆత్మీయంగా పలకరించినట్లు అనిపించి బావి గట్టుపై నిల్చుని తన తాత ప్రతిబింబం కనిపిస్తుందేమోననీ బావిలోకి తొంగి చూసిన క్షణాలు వాస్తవ జీవితాన్ని చిత్రించినట్లు గానే తోస్తున్నాయి. ఈ కవితలో స్వచ్ఛమైన వాతావరణంతో నిండినటువంటి గ్రామీణ వాతావరణాన్ని మదిలో నింపారు. ఆ వాతావరణాన్ని వివరిస్తూనే తన వారసత్వం వల్ల పొందిన ఆనందాన్ని వివరిస్తున్నారు.

'మా తాతా మా నాయనా
ఎన్ని వేల మైళ్లు నడిచారో
అందుకే కాబోలు
నడకంటే నా కిష్టం!' (పుట : 32)

అంటూ మనవడి స్థానంలో తన వారసత్వ సంపద అయిన ప్రయాణం గురించి కవి వివరించాడు. వాస్తవానికి గోపి గారు కూడా దేశ విదేశాలు ఎన్నో ప్రయాణాలు చేసి యాత్రా చరిత్ర గ్రంథాలు కూడా రాయడం జరిగింది. వీటన్నిటిని మూలంగా చేసుకొని ఇది ఖచ్చితంగా గోపి గారి జీవిత వృత్తాంతమే అని చెప్పవచ్చు.

## 2.4.2. మనుమరాలు – వృద్ధులు

**"ముని మనుమరాలితో ముత్తాతముచ్చట్లు"** ఈ కవితలో ఒక కుటుంబంలో వయోధికులు ఉండడం మూలంగా వారు పిల్లల్ని ఎలా చూసుకుంటారు, పిల్లలపై వారు చూపే అమితమైన ప్రేమ ఏ విధంగా ఉంటుంది అన్న విషయం అర్థమవుతుంది. ఇక్కడ ముత్తాత ముని మనుమరాలు మధ్య జరిగే సంభాషణ పాఠకులను ఆహ్లాదకరమైన కుటుంబ వాతావరణంలోనికి తీసుకుపోతుంది. వృద్ధుడికి తొంభై సంవత్సరాల ప్రాయంలో ఉన్నా మనుమరాలితో మాట్లాడుతుంటే తానే మరో జన్మెత్తి జీవిస్తున్నట్టు తోస్తుంది అనడంలో వృద్ధుని ఆనందం ఎలా ఉంది ఈ ఆనందానికి కారణమైన విషయాలేమిటన్న విషయం అర్థం అవుతుంది.

'నీ పసి ఊహలు చూస్తుంటే
నా బాల్యం గుర్తుకొస్తుంది.
మీ అమ్మ కూడా
నీలాగే మాట్లాడేది'. (పుట : 73)

అని పలికిన పలుకుల వారసత్వ నిధిని ప్రతిష్టిస్తుంది. అలాగే జ్ఞాపకాల సమూహంలో బాల్య జీవితం స్ఫురణకు వస్తుంది. ఇటువంటి కవితా నిర్మాణం గోపికే సాధ్యమనేంతగా వారి కవితాశైలి కనిపిస్తుంది.

'నిన్ను చూస్తుంటే
మరుజన్మ మొదలైనట్టుగా వుంది.
తొమ్మిది పదులకు చేరబోతున్నప్పుడు
మరణమంటే ఫికరు లేదు

కవిత్వం రాయడం మానొద్దు'. (పుట : 74)

అని తాతయ్యకు మనుమరాలు ఇచ్చే సందేశం అర్థమవుతుంది. అలాగే మరణం సమీపిస్తున్నా కానీ నీ సాహిత్యం భావితరాలకు మార్గదర్శకం కావాలి, నీ దేహానికి విశ్రాంతి ఇచ్చినా, కలానికి విశ్రాంతి ఇవ్వకు అన్న భావనను ఈ కవితలో చిత్రించారు. అంటే తొంభై సంవత్సరాల ప్రాయంలో కూడా సాహిత్యం ద్వారా మరో వంద సంవత్సరాలు జీవించవచ్చు అని కవి ఉద్దేశం. ఆ వయసులో నిరాశతో జీవనం సాగించేకంటే సాహిత్యం ద్వారానైనా సాఫల్యం పొందామని వృద్ధులకు భరోసా ఇస్తున్నారు.

## 2.5. సమాజంలో వృద్ధులు

వృద్ధులు వెల కట్టలేని వ్యక్తులు, వారిని సమాజానికి లభించిన జాతీయ సంపదగా గుర్తించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. ఈ రోజుల్లో వృద్ధులు తమ జీవితాలలో అనేక ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధుల సమస్య నేటి సామాజిక సమస్యగా పరిణామం చెందింది. వృద్ధులు ఏ వర్గం వారైనా, ఏ ప్రాంతంవారైనా వారి సమస్యలు దాదాపు ఒకలాగే ఉంటాయి. 'అసాంఘిక శక్తుల కుయుక్తులను, అమాయకుల ఈతిబాధలను కని, కవితలుగా కన్నీరు గార్చిన కవి కలం ఇప్పుడు 'వృద్ధోపనిషత్' గా వృద్ధుల పక్షాన గళమెత్తింది'[19] అని డా॥ కొండపల్లి నీహారిణి వివరించారు.

ఒకనాటి బాలుడే ఈనాటి వృద్ధులు. వృద్ధులు బాలులు ఒక్కరే. తనను పట్టించుకోకున్న నువ్వు పచ్చగా ఉండాలని తపించే ఉదాత్తుడు వృద్ధుడు. పలకరిస్తే చాలు పాల కడలిలా పొంగులు వారే పసివాడు వృద్ధుడు. వృద్ధులంటే పైపైన చుస్తే జుట్టు తెల్లబడిన ఫలిత కేశాలవాడు, అంతర్గతంగా తలపండిన మహా పండితుడు. వృద్ధాప్యం అనేది మానవ జన్మలో చివరిదశ. దీనిని నిర్వహించడానికి వయోపరిమితి లేనప్పటికి మనిషి శరీరంలోని రోగ నిరోధక శక్తిని క్రమ క్రమంగా కోల్పోయి చివరకు మరణించే స్థితికి చేరే దశను వృద్ధాప్యం అంటారు. కానీ కవి మాత్రం అన్ని విషయాలలో వృద్ధి పొందినవాడు వృద్ధుడు అంటున్నారు. మనిషి వృద్ధాప్య జీవితాన్ని చాలా

[19] Asianet NEWS. Feb 18, 2020.

ఆనందంగా గడపాలని కోరుకుంటారు. కాని వీరిని ఒంటరితనం భాదిస్తుంది. చాలామంది ముసలివారు ఈ వయసులో కుటుంబం, సమాజం మూలంగా మానసిక సమతుల్యతను కోల్పోతున్నారు. అందుకే వీరిని చిన్న పిల్లలుగా జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత నేటి సమాజంపై ఉంది.

వృద్ధాప్యం అనేది చాలా విలువైనది. అది జీవన సారాంశాన్ని వివరిస్తుంది. ఈ దశలో మనిషి యొక్క పరిణతి, ప్రజ్ఞ, బౌద్ధిక శక్తి కలిసి ఉంటాయి. వృద్ధాప్యం అంటే జీవితాన్ని నిందిచుకుంటూ ఉండేది కాదు. జ్ఞాన అభివృద్ధికి తోడ్పడుతూ తర్వాతి తరాల వారికి మార్గదర్శం చేసేవారు.

వృద్ధాప్యంలో దైహికమైన, మానసికపరమైన సమస్యలు ఎదురుకోవలసి ఉంటుంది. కొంత మందికి శరీరం శిథిలం కావడం తరాల అంతరం, నిరాదరణ, ఒంటరితనం, మతిమరుపు, చావు భయం వంటి పలు రకాలైన క్లిష్ట పరిస్థితితులను ఎదుర్కోవలసి వస్తుంది.

వృద్ధాప్య సమస్యలకు పేద, ధనిక భేదాలు లేవు. పేదరికం వల్ల కొంత మంది ఎక్కువ బాధ పడుతుంటారు, పేదవాళ్ళతో పాటు సంపన్నులు కూడా తమ కుటుంబం నుండి ఆత్మీయత, ఆదరణ పొందలేక విలపిస్తుంటారు. పటిష్టమైన కుటుంబ వ్యవస్థ లేని ప్రస్తుత సమాజంలో వృద్ధుల సమస్యలు రోజు రోజుకు పెరుగుతున్నాయి.

## 2.5.1. వృద్ధాప్య పెన్షన్లు

వృద్ధాప్యం ఒక అనివార్యదశ. అనుభవోజ్వలమైన యవ్వనంలో ఆ దశను గురించి స్పృహ ఉండదు. ముఖ్యంగా అరవై సంవత్సరాలు దాటిన తర్వాత వృద్ధాప్య సమస్యలు ప్రారంభమవుతాయి. అప్పుడు వృద్ధాప్యం అంటే ఏమిటో తెలుస్తోంది. వృద్ధాప్య దశలో వృద్ధులు చాలా ఆనందకరమైన జీవితం గడపాలని భావిస్తారు. కాని కొందరి వృద్ధులకు పేదరికం వల్ల వారి జీవితం నరకాప్రాయం అవుతుంది. అరవై సంవత్సరాలు పైబడిన వారికి అలాగే భర్త మరణించినటువంటి వితంతువులకు ప్రభుత్వాలు ఆసరా, భరోసా పేరుతో పెన్షన్లు ఇస్తున్నాయి.

వయో వృద్ధులకు వచ్చే పెన్షన్ ల విషయంలో తమ పిల్లలు ఏ విధంగా వ్యవహరిస్తారనే విషయాన్ని కవి 'ఓల్డేజ్ పెన్షన్' కవితలో వివరించాడు.

ఆ సందర్భంలో వృద్ధులు ఎన్ని శోకాలు పెట్టినా, కొడుకులకు ఎంత మొరపెట్టుకున్నా ఎవడు వింటాడు, ఎవ్వరూ వినిపించుకోరు అంటూ సమాజం పట్ల ఆసహ్య భావం వ్యక్తం చేస్తాడు గోపి. కోడిపిల్ల ప్రాణాలు లాక్కొనిపోయే గ్రద్దలాగా, మనిషి ప్రాణాలను లాక్కొని పోయే యముడు మాదిరిగా తన కొడుకులు తన చేతిలో ఉన్నటువంటి పైసలను లాక్కొని పోతే దేహంలో సత్తువలేని ఆ తల్లి కనుగుడ్లు తేలేసిన సంఘటనను హృదయ విషాదకరంగా గోపి కళ్ళకు కట్టినట్టు మన ముందు ఉంచాడు. చివరగా కనుగుడ్లు తేలేసింది, అనే వాక్యాలలో పుత్రునితో పోరాడి పోరాడి ప్రాణాలే కోల్పోయిందని ఇప్పుడు ఆ పైసలతోనే అత్యక్రియలు చేస్తాడు కావచ్చు అన్న వాక్యాలు నిజంగా సమాజం ఎంత దిగజారిపోయిందో తెలియజేస్తుంది. ఈ మాటలో వృద్ధ తల్లి పట్ల పిల్లల దౌర్జన్యం ఎలా ఉంటుందో ఈ 'ఓల్డేజ్ పెన్షన్' కవిత వివరిస్తుంది.

'ఓల్డేజ్ పెన్షన్' అనేది వృద్ధులకు ఇచ్చేటువంటి ఒక భరోసా అని వారు వృద్ధాప్య సమయంలో ఎలాంటి పని చేయలేక వొంట్లో సత్తువ సచ్చిపోయి ఆ పెన్షన్ పైసలతో కాలం సాగదీస్తున్నారు అని పిల్లలు భావించిన రోజున తల్లిదండ్రులు కొంత ఎక్కువకాలం బ్రతుకుతారు అని ఈ కవిత్వం ద్వారా పాఠకులకు గోపి సందేశం ఇచ్చాడు. ఇందులో వృద్ధులందరిని కూడా ఒక కోడి పిల్లల గుంపులా మార్చి కొడుకులను గ్రద్దలుగా మార్చి చిత్రించిన విధానాన్ని గోపి గారి కవితా దృక్పథానికి మంచి ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

## 2.5.2. బ్యాంకు కౌంటర్ల దగ్గర /వివిధ ప్రదేశాలలో

సమాజంలో ఎంతోమంది తమ యౌవనమంతా ధారపోసి ప్రభుత్వ ఉద్యోగం అని కొందరు, పిల్లల చదువులని కొందరు ఎంతో కష్టపడి, శ్రమోడ్చి సంపాదించినా డబ్బులను నిల్వల రూపంలో బ్యాంకులలో దాచుకుంటారు. అవి వయసు మళ్ళిన తరువాత కొంతైనా ఆధారంగా ఉంటాయని ప్రతీ మనిషి ఆశ. కాని బ్యాంకులు వృద్ధులంటే లెక్కచేయనట్లుగా ప్రవర్తిస్తున్నాయని చురకలు వేస్తున్నారు గోపి. బ్యాంకులో వృద్ధుల పరిస్థితులను వివరిస్తూ...

'వృద్ధులు లేనిదెక్కడ!

బ్యాంకు కౌంటర్ల దగ్గర

పాసుబుక్కుల్లో ఎంట్రీల కోసం

క్యూలో నిల్చున్న వయోధికులు' (పుట : 16)

అంటూ వృద్ధుల మనోభావాలను 'సీనియర్ సిటిజన్స్' కవితలో ఎంతో అద్భుతంగా వివరించడం జరిగింది.

అదే విధంగా వివిధ ప్రదేశాలలో అంటే హాస్పిటల్ లో, పోస్టాఫీస్ మొదలైన సందర్భాలలో వృద్ధుల దీన స్థితి ఎలా ఉంటుందో కూడా వివరించారు.

### 2.5.3. వృద్ధాశ్రమం

'వృద్ధులు' అంటే, పెరిగిన పిల్లల తల్లిదండ్రులు. అత్త మామలు, తాతలూ, అమ్మమ్మా-నాయనమ్మలు వారికి 60 ఏళ్లు దాటితే చాలు, కటుంబ సభ్యులు తమకు భారంగా భావించి వాళ్ల కోసం 'ఆశ్రమాల్ని' వెతకడం ప్రారంభిస్తున్నారు. కన్న పిల్లలు..! పిల్లల్నికని, కంటికి రెప్పలాగా, చూసుకుంటూ పెంచి పెద్దచేసి వాళ్లు ప్రయోజకులవ్వాలని రక్తమాంసాలు, ఆస్తిపాస్తులు కర్పూరంలా కరిగినా లెక్కచేయక, బిడ్డల కోసమే జీవితాలను ధారపోసిన తల్లిదండ్రులను వృద్ధాప్యపు ఛాయలు ఆవహించగానే ఎవరూ దిక్కులేని వారిలా వృద్ధాశ్రమాలలో చాలామంది చేర్పిస్తున్నారు.

కాలే కడుపుకు పిడికెడు అన్నం పెట్టలేక స్మశానంలో వదిలేస్తున్న కన్నకొడుకులున్న చోట, పెద్దల బాధ్యతను భారంగా భావిస్తున్న వారు నేటి సమాజంలో చాలా మందే ఉన్నారు. ఎంతోమంది తల్లిదండ్రులను వృద్ధాశ్రమాల్లో చేర్పించి తమ బాధ్యతను విస్మరిస్తున్నారు. తల్లిదండ్రులు నలుగురు సంతానాన్ని పెంచి పెద్దచేసి ప్రయోజకులను చేస్తే, పిల్లలు మాత్రం తమ తల్లిదండ్రులను పోషించడం లేదన్న మాట నిత్యనూతనం. కన్నవారిని ఆశ్రమాల పాలు చేయడమే కాదు, సజీవులుగానే వల్లకాటిలో వదిలేస్తున్న సంఘటనలు నేడు ఎన్నో కుటుంబాలలో జరుగుతూనే ఉన్నాయి. ఆస్తుల కోసం, కారుణ్య నియామకాల కోసం మట్టుపెడుతున్న

సంఘటనలు నేడు ఎన్నో జరుగుతున్నాయి. పిల్లల బాగోగుల కోసం ఎంతో ఆరాటపడి, పరుగులు తీసినా వయసు మీరిన తరువాత వారి నుంచి ప్రేమాభిమానాలు వృద్ధులకు అందడంలేదు. పిల్లలు విద్యాబుద్ధులు, ద్రవ్యార్జనతో వృద్ధిలోకి రావాలని, పేరు ప్రఖ్యాతలు సంపాదించుకోవాలని కన్నవారు ఆశించడం సహజం. పిల్లలంతా తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేరుస్తున్నారా? నెవరవేర్చగలుగుతున్నారా? అని ప్రశ్నించుకుంటే సంతృప్తికరమైన సమాధానం దొరకదనే చెప్పాలి.

మనిషి జీవితంలో మొత్తం మూడు దశలు ఉంటాయి. ఒకటి బాల్యం, రెండు యవ్వనం, మూడు వృద్ధాప్యం. మొదటి దశ తల్లి దండ్రుల మమకారపు బంధాలతో ఎంతో ఆనందదాయకంగా సాగుతుంది. ఇది ఎలాంటి కల్మషం లేని దశ అని చెప్పవచ్చు. అందుకే కవి బాల్యాన్ని బంగారు వన్నెతో, లేలేత ఉషస్సుతో పోల్చాడు. ఇక రెండవది యౌవన దశ. ఈ దశ మొత్తం కుటుంబ భారాన్ని మోస్తూ కష్టసుఖాల సమ్మేళనంతో, పరుగులు తీస్తుంది. నేటి సమాజంలో అయితే డబ్బు వ్యామోహంలో పడి మనిషి తన యౌవ్వన జీవిత కాలం మొత్తాన్ని సంపాదన కోసమే కేటాయిస్తున్నారు.

ఈ ఆధునిక కాలంలో నాగరికతలో చోటుచేసుకుంటున్న మార్పుల కారణంగా, అధిక ధనార్జన మొదలైన వాటి వల్ల మనిషి తన యవ్వనం మొత్తం సంపాదన మీదనే దృష్టి సాగించి ప్రశాంతతను కోల్పోతున్నారు. ఇక మూడవదశ ఇదే మనిషి జీవితంలోని చివరి దశ. ఈ దశలోనే మానవుడు వృద్ధాప్యంలోకి అడుగుపెడతాడు. మనిషి జీవితంలో ఎన్నో కష్టాలను అనుభవించి వయోభారం ముంచుకొస్తున్న తరుణం ఇది. వార్ధక్యం అనేది ప్రతి ఒక్కరి జీవితంలో చోటుచేసుకునే సహజ ప్రక్రియ. ఎలాంటి బాధలు, కష్టాలు లేకుండా వృద్ధాప్యాన్ని గడపాలని ఎంతోమంది కలలుకంటుంటారు. ఇది మనిషి ప్రశాంతమైన జీవితాన్ని సంతోషంగా గడపాల్సిన దశ. కాని నేటి ఆధునిక సమాజం ఈ శేషజీవిత దశలో కూడా ప్రశాంతత లేకుండా చేస్తుంది. దీనికి ప్రధాన కారణం పెరుగుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతోపాటు మానవుడు తన విలువలను విస్మరిస్తూ బాధ్యతారహితంగా మారుతున్నడనే చెప్పాలి.

అలాగే ప్రపంచీకరణ మానవ సంబంధాలను నశింపజేసింది. అదే విధంగా ఈ దశలో సంతోషం దూరం కావడానికి ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం కావడం ఒక కారణంగా చెప్పవచ్చు. ఎందుకంటే కుటుంబంలో అందరూ ఎవరి పనిలో వారు లీనమైపోతారు. కొందరు ఉద్యోగంలో, మరి కొందరు టీవి చూడడంలో ఇంకొందరు ఫోను చూడడంలో ఇలా ఎవరి పనిలో వారు ఉంటారే కానీ ఇంట్లో ఉన్న వృద్ధులను మాత్రం ఎవరు పట్టించుకోరు. కుటుంబం లేని వారి పరిస్థితి వేరే దానిని గురించి ప్రస్థావన అవసరం లేదు. ఎందుకంటే వారి యోగ క్షేమాలు చూడడానికి వారికంటూ ఎవరూ ఉండరు. ఎవరైనా ఉన్నా వారు వృద్ధుల దగ్గర ఉన్న ధనాన్ని ఆశించి వారికి సేవలు చేస్తున్నారు కానీ, అయ్యో! ఆ వృద్ధులకు ఎవరు లేరూ పాపం కొంచెం సాయం చేసి ప్రేమతో ఆదుకుందామని మాత్రం అనుకోవడం లేదు. అందుకే ఈ వృద్ధాప్య దశ అనేది చాలామంది వృద్ధులకు శాపంగా మారుతుంది.

ఎవ్వరైనా యవ్వనం కరిగిపోతున్న కొద్దీ వృద్ధాప్య జీవితాన్ని ఎలా గడపాలి అని ఆలోచనలు చేస్తూ ఉంటారు. ఎంతో మంది తల్లి దండ్రులు వృద్ధాప్యంలో తమ కొడుకులు, కూతుళ్ళు తమను కళ్ళల్లో పెట్టుకుని చూసుకుంటారని కళలు కంటూ ఉంటారు. శేషజీవితాన్ని వారి సంరక్షణలో ఆనందంగా గడిపేయొచ్చని ఊహించుకుంటుంటారు. కానీ వారి ఆశలు అడియాశలవుతున్నాయి. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులు వారిని ఈసడించుకోవడం వంటివి చేస్తున్నారు. ఇంట్లో వారి స్థానం పిల్లలను చూసుకునే ఒక ఆయగానో లేదా ఒక పని మనిషిగానో చూస్తారు. ఈ కష్టాలు, అవమానాలు భరించలేక నేటి ఆధునిక సమాజంలో చాలామంది వృద్ధులు తమ పిల్లలు చక్కగా చూసుకోలేకపోవడంతో వృద్ధాశ్రమాలలో చేరుతున్నారు. వృద్ధుల ఆలనా పాలనా కుటుంబీకులు సరిగ్గా చూడక పోవడంతో తామే స్వయంగా వృద్ధాశ్రమంలో చేరుతున్న వారు కొందరైతే, పిల్లలు చూసే పరిస్థితి ఉన్నా ఉద్యోగాల నిమిత్తం దూర ప్రాంతాల్లో ఉండడంతో వృద్ధాశ్రమంలో చేరుతున్న వారు ఇంకొందరు. ఇంకా కొందరు పిల్లల వల్ల బలవంతంగా ఇంట్లో నుండి గెంటివేయబడినవారు మరికొందరు. ఇలా ఎన్నో రకాలుగా చాలామంది వృద్ధులు నేడు వృద్ధాశ్రమాలలో చేరుతున్నారు.

ఆ ఆశ్రమ జీవితమైన ప్రశాంతంగా ఉంటుందా అంటే అక్కడ కూడా పిల్లలనే తలుచుకుంటూ మానసికంగా క్రుంగిపోతున్నారు. కొన్ని ఆశ్రమాలు వారికి యమలోకాలుగా ఉన్నా ఎక్కడికి వెళ్ళడానికి దారి లేక వృద్ధాప్య జీవితాన్ని ఆశ్రమాలలో గడుపుతున్నారు. ఎంతో కష్టపడి, రెక్కలు ముక్కలు చేసుకుని పైసాపైసా కూడబెట్టి తమలాగా తమ పిల్లలు కష్టపడకూడదని పై చదువులు చదివించి ప్రయోజకుల్ని చేస్తే వాళ్ళ చేతనే ఈ వృద్ధులు నిరాదరణకు గురవుతున్నారు. ఈ దుస్థితి గ్రామీణ ప్రాంతాలలో ఇప్పటికి అంతగా లేదని చెప్పాలి. ఎందుకంటే ఇప్పటికీ గ్రామీణ ప్రాంత ప్రజలు వ్యవసాయం చేస్తున్నారు కాబట్టి తల్లిదండ్రులు తమకు చేదోడువాదోడుగా ఉంటూ మార్గదర్శకాలుగా నిలుస్తున్నారు. పట్టణాలలో రైలు డబ్బాల్లాంటి అద్దె ఇళ్ళల్లో జీవనం సాగించలేక, విలాసా జీవితాలకు అలవాటుపడి తల్లిదండ్రులను పట్టించుకోక వృద్ధాశ్రమాలలో చేర్పిస్తున్నారు. వృద్ధాశ్రమాలు కూడా పట్టణాలలోనే ఎక్కువగా ఉండడం ఇందుకు కారణంగా చెప్పవచ్చు.

గోపిగారు వృద్ధాశ్రమాలలో వృద్ధుల జీవితం ఏ విధంగా వుంటుందన్న విషయాన్ని **"వృద్ధాశ్రమం"** అనే కవితలో తెలిపారు. ముసలివారి గోడును పట్టించుకునేదెవరు. వారి దీనస్థితి వృత్తాంతాన్ని వినే ఓపిక నేటి తరానికి లేదంటున్నాడు కవి.

వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్ని అవసరాలూ తీరుతాయి. కానీ అక్కడెక్కడా తాను కోరుకునే స్వేచ్ఛ దొరకదు. అక్కడ కాలం సాగుతూనే ఉంటుంది తప్ప జీవితంలో కోరుకున్న ఆనందం దొరకదు. అందుకే వృద్ధులు వృద్ధాప్యమే మాపాలిట శాపం అంటూ ఆత్మన్యూనతకు లోనవుతున్నారు.

> 'శత్రువులెప్పుడు లేరు.
> ఇప్పుడు ముసలితనమే ఓ దుష్మన్
> ఉంటే దేవునిపైన
> కానీ అతడేదీ వినడు.' (పుట : 51)

అంటూ వృద్ధాశ్రమంలో వృద్ధుల మనోవేదనను వివరించాడు కవి. తన జీవితకాలం మొత్తంలో శత్రువులు లేరు. కానీ ఇప్పుడు ఎవరైనా శత్రువులు ఉన్నారా అంటే ముసలి తనమే పెద్ద శత్రవంటున్నారు. ఫిర్యాదులు చేయడానికైనా తోడు ఎవరన్నా ఉన్నారా అంటే ఆ దేవుడు తప్ప మరెవరూ మిగలలేదు, ఉన్న ఆ ఒక్క దేవుడు తమను ఆదుకునే పరిస్థితిలో లేదని తీవ్ర ఆవేదనకు గురైన క్షణాలను కవి ఎంతో అద్భుతంగా వివరించాడు. అన్నింటికి ఆ దేవుడే దిక్కు అనుకున్నా ఆ దేవుడు ఏమీ పట్టించుకోడు. న్యాయం చేసే న్యాయ దేవతకేమో కళ్ళకు గంతలు కట్టేశారు. ఇప్పుడు మా బాధలు పట్టించుకునేవారు ఎవరున్నారని వృద్ధులు తల్లడిల్లిన క్షణాలను కవి పాఠకులకు కళ్ళు చెమ్మగిల్లేల చెప్పారు. ఇప్పుడు వీరి బాధను చూసేవారు, వినే వారెవరూ లేరంటాడు. అందుకే కవిత చివర్లో వృద్ధాశ్రమాలకు వచ్చే మనిషి జీవితకాలం కంటే అక్కడ ఉండే మంచాలే ఎక్కువ కాలం ఉంటాయంటున్నాడు.

'వృద్ధాశ్రమంలో
మంచాలు పాతవే
వచ్చి పొయ్యే వాళ్లే
మారుతుంటారు' (పుట : 52)

అని పలికిన వాక్యాలు వయోధికుల మనో వ్యధను ఎంతో ఆర్ద్రతా హృదయంతో వివరించినట్లు అనిపిస్తుంది.

అందుకే వృద్ధులు నేడు వృద్ధాశ్రమాలలో జీవించడం కంటే కలికాళునిలో లీనమైపోవడమే మేలని భావిస్తున్నారు. ఈ విధంగా కవి వృద్ధాశ్రమంలో జీవించే వృద్ధులు జీవితాలలో వెలుగు లేనటువంటి చీకటికోణాన్ని వివరించాడు.

వృద్ధాప్యం మరో పసితనం లాంటిది. ప్రేమగా చిన్న పలకరింపును కోరుకునే వయసు వారిది. ఆత్మీయుల కోసమై ఎంతగానో ఎదురుచూపులు చూసే మనసు వారిదని నేటి సమాజం మర్చిపోతుంది. అరవై డెబ్బై ఏళ్ల వయసులో ఏకాకుల్లా వృద్ధాశ్రమాల్లో చేరాల్సి వస్తుంది. ప్రేమ,

ఆత్మీయతల్లేని సంసారాల వల్ల, ఉద్యోగాల పేరిట దూరమైపోయిన కోడుకు, కోడళ్ల వల్ల గృహసంబంధమైన వివాదాల వల్ల సొంత కుటుంబాలకే దూరంగా ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కారణమేదైనా ఫలితం మాత్రం పండుటాకులైన తల్లిదండ్రుల మీద పడుతోంది. మలిసంధ్యకు చేరుకున్న వృద్ధుల కోసం ఏ దిక్కు లేని వారి కోసం ప్రైవేటు సంస్థలు ఓల్డేజ్ హోమ్‌లు, వృద్ధాశ్రమాలు నిర్వహిస్తున్నారు. అంతేకాదు నర్సింగ్ ఓల్డేజ్ హోమ్‌లు సైతం అందుబాటులో ఉంటున్నాయి. అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. అయినా ఏం లాభం అమ్మా! అన్న పిలుపుకోసం ! 'నాన్నా!' అన్న పలకరింపు కోసం గుండెల్ని అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నవారు ఎందరో. స్వేచ్ఛా స్వాతంత్ర్యాల గురించి, వ్యక్తిగత భద్రత గురించి గొప్పలు చెప్పే పెట్టుబడిదారీ సమాజం వృద్ధుల సమస్యను గాలికొదిలేసి మానవ వికాస చరిత్రకు ఎనలేని అన్యాయం చేసింది. వృద్ధులకు తీరని వ్యథను మిగిల్చింది.

పిల్లలందరూ పెద్దల్ని చూడటం లేదని అనడానికి వీలులేదు. ఎందుకంటే విదేశాల్లో వున్నా, ఇక్కడే దూరంగా ఉద్యోగాలు చేస్తున్నా తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకునే వారెందరో ఉన్నారు. వృద్ధాప్యంలో కావలసింది కాసింత ప్రేమ, ఆప్యాయత, ఒంటరితనం లేకుండా చేయడం. ఇవి వారికందితే ఎటువంటి ఆలోచనలు వారి దరికిరావు, బాధలుండవు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా తమ తల్లిదండ్రులను తామెలా చూసుకున్నామో అంతే పదిలంగా తమని తమ పిల్లలు చూసుకోవడం అన్నది తరతరాలుగా వారికి నేర్పిన, నేర్చుకున్న నడవడి. ఈ లక్షణాలు ఒకతరం నుండి మరో తరం, ఆ తరం నుండి పైతరం అలవరచుకుంటే ఎక్కడా వృద్ధాశ్రమాలన్న మాటే వినపడదు.

అదే విధంగా వృద్ధాశ్రమాలు లేకుండా చేయడానికి మరో మార్గం కూడా ఉంది. పిల్లలకు ఉపాధ్యాయులు పాఠశాల స్థాయి నుంచే పిల్లలలో నైతిక విలువలను పెంచడానికి కొద్దిపాటి శ్రద్ధ వహించి పెద్దల పట్ల ఎలా ప్రవర్తించాలో నేర్పించాలి. వారిలో నైతిక ప్రవర్తన పెంపుదలకు ప్రాధాన్యతను ఇవ్వాలి. అప్పుడే బాలలు మానసికంగా వికసించి, పెరిగి పెద్దవారైన తర్వాత

వారిలో తల్లిదండ్రులను గౌరవించే ఉన్నతమైన సంస్కారం అలవడుతుంది. అప్పుడే వృద్ధాశ్రమాలు లేని సమాజం నెలకొంటుంది.

## 2.6. వృద్ధుల మనోభావాలు

ప్రశాంతంగా సాగాల్సిన జీవిత చరమాంకం శోకమయం కావడం శోచనీయం. వార్ధక్యం ప్రశాంతమైన జీవన తీరమే. అయితే, వ్యక్తి ఈ తీరానికి ఎంతో వ్యగ్యంగా, చింతిస్తూ, నిరాశగా చేరుతున్నాడు. జీవనపు ఈ తీరాన్ని చేరకముందే ఏదో తప్పు చేసినట్లు, ఈ తీరాన్ని చేరడానికి ఇష్టపడనట్లు, బలవంతాన ఇక్కడకు చేర్చబడుతున్నట్లు అనిపిస్తుంది. వార్ధక్యం సంభవించే నాటికి వృద్ధుల మనోభావాలు ఎలా ఉంటాయో భాగవతంలోని ఆరవ స్కంధంలో పోతన ఈ విధంగా వివరించాడు. 'శిరసు నొవ్వదొడగె, చెదరె మనంబంత, కడిదియైన ముప్పుకాలమునకు...' దారుణమైన ముసలితనం ప్రాప్తించిందని అజామిళోపాఖ్యానంలో అజామిళుని దేహం మార్పు చెందుతున్నప్పుడు అతడు ఏ విధంగా భావించాడో అదే విధంగా ప్రతి వృద్ధుడు వార్ధక్యం సమీపించే సమయంలో వారి మనోభావాలు ఒకేలా ఉంటున్నాయని చెప్పవచ్చు.

యాంత్రిక ప్రపంచంలో ఏ కొందరు అమ్మానాన్నలో తప్ప పిల్లల ఆదరాభిమానాలకు నోచుకోలేని తల్లిదండ్రులు ఎంతమందో.. సమాజంలో రోజు రోజుకు దశరథ తనయుల లాంటి వారు తరిగిపోతుండగా ధృతరాష్ట్ర సంతతి వంటి వారి శాతం పెరుగుతోంది. చరిత్రలో తల్లిదండ్రులు, వృద్ధులకు ఇవ్వాల్సిన స్థానం, గౌరవం గురించి పురాణ ఇతిహాసాలూ, మత గ్రంథాలు ఎన్ని చెప్పినా వాస్తవంలో జరిగేది మాత్రం శూన్యమనే చెప్పాలి. రేణుకా ఎల్లమ్మను చెరబట్టిన పరశురాముని నుంచి.. రాజ్యాధికారం కోసం తండ్రులను వధించిన ఫ్యూడల్ రాజుల దాకా.. చరిత్ర పొడవునా వృద్ధతరానికి దక్కాల్సిన గౌరవం దక్కలేదనే చెప్పాలి.

వృద్ధాప్యంలో వారికి కావలసింది కాసింత సంతోషం, నాలుగు మాటలు మాట్లాడేవారు, ప్రేమ, ఆప్యాయత, ఒంటరితనం లేకుండా చేసి ఆనందాన్ని కల్పించేవారు. ఇవి వారికందితే ఎటువంటి ఆలోచనలు వారి దరికి రావు, బాధలుండవు. వారు వారి జీవిత చరమాంకంలో

కోరుకునేది ఇదే. వృద్ధులు కొన్నిసార్లు ప్రతి విషయంలోనూ చిన్నపిల్లల మనస్తత్వంతో పోటీ పడుతుంటారు. వారి మనసు కొన్ని సందర్భాలలో జ్ఞాపకాలతో నిండిపోయి గతకాలపు మధురస్మృతులను తట్టి లేపుతుంది. అదే విషయాన్ని గోపి గారు కూడా వృద్ధులలో గుర్తించారు. వృద్ధుల మనోవ్యధలను ఏ విధంగా కవిత్వీకరించారో వారి ఆనంద సందర్భాలను కూడా అంతే అద్భుతంగా వివరించి వారిలో కొత్త ఉత్తేజాన్ని నింపే ప్రయత్నం చేస్తున్నారు.

'ఇంతేనా జీవితం
అని అనిపించదు.
జ్ఞాపకాల నిధులతో
నేనిప్పుడు కోటీశ్వరుడిని.' (పుట : 37)

అని **"డెబ్బయి సంవత్సరాలు"** కవితలో పలికిన వాక్య ప్రవాహం ఇది. ఇక్కడ కవి చెప్పిన అంశం ఎంతో సమగ్రంగా ఉండి ప్రతి మనిషిలో కొత్త ఆలోచనలను కలిగిస్తుంది. ఇంతేనా జీవితం డెబ్బయి సంవత్సరాలలో అంటూ ప్రశ్నార్ధకంగా మొదటి పంక్తులు పలికిన చివరి పంక్తుల ద్వారా చక్కటి సుమధురమైన సందేశం ఇస్తున్నాడు. ప్రతి మనిషి జీవిత కాలం మొత్తం కూడా బంధాలు అనుబంధాలు డబ్బు అంటూ వాటివెంటే పరిగెత్తి పరిగెత్తి వృద్ధాప్యం వచ్చాక ఎలాంటి మధుర స్మృతులను దాచుకోకుండానే శేష జీవితాన్ని గడిపేస్తారు. అందుకే గోపి ఒక చక్కటి ఉపయుక్తిగా జ్ఞాపకాల నిధులతో కోటీశ్వరులను కమ్మంటున్నాడు. అంటే వృద్ధాప్యంలో డబ్బు కంటే కూడా జ్ఞాపకాలే ఎక్కువ ఆనందాన్ని కలిగిస్తాయి అంటున్నాడు. చిన్ననాటి జ్ఞాపకాలు ఎన్ని గుర్తు చేసుకున్న తనివి తీరదు. ఆనందాన్ని ఇచ్చే మధురమైన జ్ఞాపకాలను తలుచుకున్న కొద్ది మనసు పసిపాపల మారిపోయి ఆ జ్ఞాపకాల దొంతరల్లో పరుగులు పెడుతుంది. అటువంటి జ్ఞాపకాల నిధిని సంపాదించుకున్న వృద్ధుడు కోటీశ్వరుడు అంటున్నారు గోపి.

ఈ 'డెబ్బయి సంవత్సరాలు' అనే కవితలో కవి తన మనోభావాలను తెలిపి అంత వయసులో కూడా మనిషి తన జ్ఞాపకాలతో ఎలా ఆనందంగా గడపాలో తెలియజేసారు. ఈ కవిత ద్వారా వృద్ధులమన్న భావన వారిలో కలగకుండా దాన్ని జయించి నూతన తేజస్సు పొందే

మార్గాన్ని తెలియచేస్తున్నారు. యాదృచ్ఛికమైన విషయం ఏమిటంటే కవి తన సప్తతిలోకి ప్రవేశించేకంటే ముందే ఈ కవితను రాసి తన సప్త జయంతిని సాఫల్యం చేసుకున్నారు. అందుకే

'ఇవాళ నేనొక
వాగ్దానం చేస్తున్నాను.
కొంచెం అలసట కనపడ్డా
జీవితం నాకు ప్రసాదించిన
తేజస్సు తగ్గకుండా
రేపటి ప్రతి ఉషస్సునూ వెలిగిస్తాను.
కొత్త వంతెన నిర్మిస్తూ
మనుష్యుల్ని కలుపుతాను.' (పుట : 38–39)

అని అంటున్నారు. అంటే వృద్ధులలో ఉండే ఆత్మన్యూనతా భావాన్ని తొలగించి తన అనుభవాల ద్వారా రేపటి తరానికి మార్గ దర్శకంగా నిలవాలని ఈ కవిత ద్వారా కవి తన సందేశాన్నిస్తున్నాడు.

ఇక్కడ కవి అలసట లేని ఉషోదయంలాగా నూతన కాంతులతో భవిష్యత్తు కాలాలను మేల్కొల్పే ప్రయత్నం చేస్తున్నారు. వృద్ధునితో మమేకమైన కవి పురుషుని విషయంలో అయితే తల్లి గర్భం నుండి బయటికి వచ్చినప్పటి నుండి మరణించే వరకు అన్ని దశలలో కూడా తల్లిగా, అక్కగా, చెల్లిగా, భార్యగా స్త్రీ తోడుగా ఉంటుంది. తన సర్వస్వాన్ని పురుషునికై అంకితం చేస్తుంది. పుట్టినప్పుడు తల్లిగా, వివాహమయ్యాక భార్యగా, వృద్ధాప్యంలో తోడుగా నిలుస్తుంది. అంటువంటి స్త్రీ మూర్తికి జీవితమంతా పురుషుడు ఇచ్చే గౌరవం ఏమీ ఉండదు. అందుకే కనీసం వృద్ధాప్యంలోనయినా తనకు తోడుగా ఉండి తన పనులు తాను చేసుకోవాలని **'ఆమె కూడా'** అనే కవిత ద్వారా కవి పురుష సమాజానికి హితవు భోధిస్తున్నాడు.

'వృద్ధాప్యంలో ప్రవేశించినా

ప్రతీపనికీ

ఇప్పటికీ  ఆమే

సూర్యుడు ఉదయించడం ఆలస్యమైతే

మబ్బుల దుప్పటిని లాగి పారేస్తుంది'            (పుట : 40)

చీకటి లోకంలో వెలుగులు నింపుతుందంటూ స్త్రీ గొప్పతనాన్ని తెలిపారు. బాల్యం నుండి సేవలు చేస్తూనే ఉంది. వృద్ధాప్యం వచ్చినా ఇప్పటికి అన్ని పనులు ఆమెనే చేస్తుంది. తన కష్టానికి నిలువెత్తు నిదర్శనం నేనే అని వృద్ధాప్యంలో తనను తాను ఆత్మపరిశీలన చేసుకునేలా కవి **"ఆమె కూడా"** అనే కవితను రాసాడు. ఇప్పటికైనా ఆమెకు కూడా వయసైపోయింది. ఎంత కాలమని నీ కోరకే తన జీవనం సాగిస్తుంది. కొంతైనా వారి మనసును అర్థం చేసుకోండి అంటూ కవితలో తెలిపారు కవి.

'నేను ఈ మధ్యనే

కాస్త సిగ్గుపడటం నేర్చుకుంటున్నాను.

ఆమెకు సాయం చెయ్యాలని

సంకల్పించుకుంటున్నాను.

సాయమంటే మరేమో కాదు

నా పనులు నేను చేసుకుంటున్నాను'.            (పుట : 40)

అని పలికిన పంక్తులు అక్షర సత్యాలు. వృద్ధాప్య దశకు చేరుకున్నాక ప్రతి వృద్ధుడిలో కలిగే భావన ఇది. నేను ముసలి వాడిని అయ్యాను. నా భార్య శరీరంలో కూడా సత్తువ లేదు కొంచెమైన తనకు సహాయం చేద్దామని అందరూ అనుకుంటారని గోపిగారు చెప్పారు. ఈ దశలో పుత్రులు, కూతుళ్ళు, కొడుకులు, మనవళ్ళు, మనమరాళ్ళు వీరందరూ దూరమైన సందర్భంలో వృద్ధులు ఇద్దరే ఇంట్లో మిగిలిపోయిన క్షణాలను కవి చిత్రించాడు. అప్పుడు వారి మధ్య అన్యోన్యత అనేది దృఢంగా తయారవుతుంది. ఇప్పుడు వారు ఒకరికొకరు సహాయం చేసుకుంటూ జీవనం

సాగిస్తారని కవి చెప్తున్నారు. ఇక్కడ సహాయం అంటే మరేదో కాదు తన పనులు తాను చేసుకోవడమే అనడంలో వృద్ధుని మనో వేదనలో వచ్చిన మార్పుని అర్థం చేసుకోవచ్చు.

వృద్ధులు తమ కుటుంబంలో ఆనందంగా గడిచే క్షణాలు ఎలా ఉంటాయని తెలిపేవి "మనుమసిద్ధి, ముని మనుమరాలితో ముత్తాత ముచ్చట్లు" అనే కవితలు అద్దం పడతాయి. ఈ రెండు కవితలలో కూడా ఆనందంగా తమ వృద్ధాప్య జీవితాన్ని గడిపే వృద్ధుల మనోభావాలు దర్శనమిస్తాయి. ఈ రెండు కవితలలో కూడా గోపి గారి జీవితం ప్రస్ఫుటమైనట్టు తోస్తుంది. ఆయన జీవిత, ఆత్మ కథనే ఈ కవితలలో తెలిపారేమో అన్న భావన కలుగుతుంది.

**"మనుమసిద్ధి"** కవితలో మనువడితో తాత సంభాషించే క్షణాలున్నాయి. మరో కవితలో మనుమరాలితో గడిపే క్షణాలున్నాయి. వృద్ధుడు తన జీవితాన్ని తన మనుమరాలిలో చూసుకుంటున్న సందర్భం కనిపిస్తుంది. ఈ రెండు కవితలలో కూడా తాతపై మనువడు, మనుమరాలికి ఉండే ప్రేమ ఏ విధంగా ఉంటుందో గమనించవచ్చు.

## 2.3.1. వయసు మళ్లిన గాధ – తీరని వ్యధ

నాగరికమని చెప్పుకుంటున్న ఈ రోజుల్లో వృద్ధుల పట్ల రోజురోజుకూ అనాగరిక చర్యలు పెరుగుతూనే ఉన్నాయి. వయసు మళ్ళిన వృద్ధుల గాధలను గురించి గోపి కళ్ళు చెమ్మగిల్లే విధంగా కవిత్వం రాశారు. వార్ధక్యం సహజ వయోధర్మం. కానీ అది వృద్ధుల పాలిట శాపంగా మారుతుంది. వయసు మీరడం అంటే అనుభవం, జ్ఞానం పెరగడమనీ నేటి సమాజం మర్చిపోతుంది. సమాజం పెద్దలను జాతి సంపదగా పరిగణించినప్పుడు దేశం పురోగతి సాధిస్తుంది. 'పెద్దల మాట చద్ది మూట', 'బొమ్మ మాట బంగారు బాట' లాంటి నానుడులు అందుకే పుట్టి ఉంటాయి. కానీ నేటి యువత అత్యధిక శాతం పెద్దల ఆలోచనలను 'ఛాదస్తం'గా కొట్టి పారేస్తోంది. 'మీ(నీ)కేం తెలియదు లే' అంటూ ప్రతీ సందర్భంలో వారిని తక్కువ చేసి మాట్లాడడం ఎక్కువైపోతుంది. వయసు మళ్లినవారని వారిని 'పాత సామాను' కింద జమ చేస్తున్నారు. 'నేటి బాలలే రేపటి పౌరులులాగా' 'నేటి యువతే రేపటి వృద్ధులు' అనేది తోచనట్లు

వ్యవహరిస్తున్నారు. కుటుంబ ఇతివృత్తాలు మానవ సంబంధాలను చిత్రించడంలో **“అమ్మ ఒక మనిషి”** అన్న కవితలో ఈ విధంగా అంటున్నారు.

‘కొంచెం ఓపిక పట్టాలి
ముసల్ది
నా పాల బడ్డదని అనుకోవద్దు.’ (పుట : 26)

అన్న వాక్యాలు వృద్ధాప్యం రాగానే కుటుంబంలోని వ్యక్తుల ప్రవర్తన ఏ విధంగా ఉంటుందో ఈ పంక్తులలో వివరించారు. శైలినే ప్రధానంగా చేస్తూ ఇతివృత్తాన్ని తెలియజేస్తున్నాడు. ఒక మనిషికి వృద్ధాప్యం వచ్చిందంటే కొడుకులు, కోడళ్లు, కూతుళ్లు ఆవేశంతో వారిని ఈసడించుకోకుండా వారి గమ్యం పూర్తయ్యే వరకు వారి బాగోగులు చూసుకోవాలని గోపి సందేశం ఇస్తున్నారు. వయసు మళ్ళిన జీవితాలలో సొగసులకు తావుండదు. వారి జీవన ప్రయాణంలో వారు కోరుకునేది కుటుంబ సభ్యులతో స్నేహ పూర్వకంగా ఉండి ఆనందంగా మరణించాలని. వారు ఏ ఆర్భాటాలు కావాలని కోరుకోరు, వారికి అవసరం లేదు కూడా. వయసుడిగిన దశలో వృద్ధులు తమ వారసుల నుంచి కోరుకునేది ఒక్కటే అది ప్రేమ పూర్వకమైన పలకరింపు, ఆదరణ, అభిమానాలే తప్ప ఏ ఆడంబరాలు, విలాసాలు కాదు. ఇదే విషయాన్ని కవి ఈ వాక్యాలలో చిత్రించారు.

‘నడక మందగించింది
అది నీ పరుగులకు
కొంతైనా కళ్లెం కావచ్చు
కొంచెం ఆలోచించాలి.’ (పుట : 26)

అని అంటున్నారు గోపి. గోపి పలికిన ఈ వాక్యాలలో కొంత భావుకత కనిపిస్తుంది. వృద్ధులు ఇంట్లో ఉన్నారంటేనే వారికి సేవలు చేయడానికి ఇంట్లో సభ్యులు ఎవరో ఒకరు సమయం కేటాయించాల్సి వస్తుంది. ఆ విధంగా చేస్తేనే వారు కొంత ఎక్కువ కాలం సంతోషంగా జీవించగలరు. అలా కాకుండా వీరు నా మెడకు చుట్టుకున్నారు, వీరికి సేవలు ఎవరు చేయాలని

చీదరించుకోకుండా కొంచెం వారి స్థితిని గురించి ఆలోచించాలంటున్న విషయాన్ని తెలియజేశారు.

**"వయసు మళ్ళిన పాట"** అన్న కవితలలో వృద్ధుల మనో స్థితి ఎలా ఉంటుంది అనే విషయాన్ని తెలియజేశారు.

'ఎవరినో పిలుస్తాము
నిజానికి ఎవరిని పిలవాలో తెలియదు
వయస్సు ముంచుకొస్తున్నది
ఆకాశంలో మబ్బులు ముసురుకుంటున్నాయి
వయసు మళ్ళిన శరీరాలకు
ప్రాధాన్యతలు మారుతుంటాయి.' (పుట : 22)

అంటూ కవిగా గోపి వృద్ధుల ప్రాధాన్యతలు ఏ విధంగా మారిపోతాయన్న అంశాలను తెలియజేస్తున్నాడు. వృద్ధులకు పెద్ద సమస్య ఏమిటంటే వారికి ఏదైనా ఆలోచన వచ్చిన లేక పని గుర్తుకు వచ్చిన ఎవరితోనైనా పంచుకోవాలని అనిపిస్తుంది. కానీ ఎవరితో పంచుకున్నా మా మాటలు, బాధలు ఎవరు వింటారన్న సందేహం వారిలో చాలా సార్లు కలుగుతుంది. నిజానికి కొన్నిసార్లు ఎవరితో చెప్పినా ఎవరిని అడిగిన నా మాట విని నా కోసం పనిచేసి పెట్టేవారు ఎవరు ఉంటారని తమలో తామే లోలోపల కుమిలిపోతారు. అవే వాక్యాలను కింది వాక్యాలకు అనుసంధానం చేస్తూ ఈ విధంగా అన్నారు.

'వయసు ముంచుకొస్తున్నది ఆకాశంలో మబ్బులు ముసురుకుంటున్నాయి' అంటే ఇక్కడ మనిషి జీవితాన్ని ఆకాశంతో పోల్చి చెప్పారు. వయసు పెరుగుతున్న కొద్దీ మనిషి జీవితంలో చీకటి అలుముకుంటుందని చెప్తున్నారు. ఆకాశంలో మబ్బులు రాకముందు ప్రకాశవంతంగా ఉన్న భూమి ఒక్కసారి ఆకాశంలోని సూర్యుడు కనిపించనంతగా మబ్బులు కమ్ముకుంటే చీకటి కమ్మేస్తుంది. అదేవిధంగా వృద్ధాప్య జీవితాలు కూడా చీకటిలోకి నెట్టేసినట్లవుతున్నాయన్నారు

గోపి. ఇక్కడ చీకటిని నిరాశ, నిస్పృహలకు చిహ్నాలుగా చెప్పుకోవచ్చు. వయసు మళ్ళిన గాధ ఒక తీరని వ్యధ ఒడువని జీవిత గాధ. ఎంతసేపు చూసిన, ఎటువైపు చూసిన, ఏ కవితను చదివిన వృద్ధాప్య మూలాలు వారి బాధలు అడుగడుగున దర్శనం ఇస్తున్నాయి. మనసులో తెలియని భారాన్ని పెంచుతున్నాయి. **'అరాం కుర్చీ'** అనే కవితలో పగిలిన వృద్ధుని హృదయాన్ని దర్శింపజేస్తాడు.

'ఒకరోజు ఆరాం కుర్చీ స్క్రూ ఊడిపోయి
కిందపడి పోయాడు
చేతి మీద ఆనిన దేహంతో
ఎముక పర్రె వాసింది
గాయం కన్నా
అతని మనస్సే ఎక్కువ గాయపడింది.' (పుట : 36)

కేవలం కుర్చీకే పరిమితమైన జీవితం తనది. పై వాక్యాలలో విరిగిన ఎముక నొప్పి కంటే కూడా కిందపడిన ఆ నిస్సహాయ స్థితిలో నుండి పైకి లేచే శక్తి లేక తనకు తాను ఓటమిని అంగీకరించిన సంఘటనను ఈ వాక్యాలలో గోపి చిత్రించారు. ఎవరైనా హఠాత్తుగా కింద పడినప్పుడు ఎవరో ఒకరు చూసినవారు హడావిడిగా పరిగెత్తుకుంటూ వెళ్ళి చేయి అందించి సాయం చేస్తారు. సాయం చేయడానికి అందించే చెయ్యి ఎక్కడ నుండి రానప్పుడు దేహానికి తగిలే గాయం కన్నా మనస్సుకు తగిలే గాయం ఎక్కువ బాధను కలిగిస్తుంది. ఆ భావనను వృద్ధుడు ఎలా అనుభవించాడన్న విషయాన్ని గోపిగారు ఆరాం కుర్చీ అనే కవితలో చెప్పాడు. వయసు పెరిగే కొద్దీ మనసు చిన్నదైపోతుంది. ఇదే **'ఆరాం కుర్చీ'** కవితలోని మరికొన్ని పంక్తులు కుటుంబంలోని వ్యక్తులు వృద్ధులకు ఇచ్చే స్థానం గురించి స్పష్టంగా చెప్తున్నారు.

'మనుమడు
ప్రతిరోజు కుర్చీని తూడుస్తాడు
దాని చేతులకు నిన్న లేని తడి

ఇవాళ ఎందుకొచ్చిందో

వాడికి అర్థం కాలేదు.'          (పుట : 36)

అని తాతా మనోభావాన్ని కవి పై వాక్యాలలో తెలియజేశారు. ఇక్కడ కుర్చీని తుడుస్తున్న మనవడిని చూసి తాతా పడిన వేదనను వివరించాడు. అంటే ఏదైనా మనం ఆలోచించే విధానంలోనే ఎదుటి వారి దృష్టిని గుర్తించే శక్తి ఉంటుంది. మన ఆలోచనలే సరిగ్గా లేనప్పుడు మనకు ఇతరుల మనస్తత్వాలను అర్థం చేసుకునే తత్వం ఎక్కడినుండి వస్తుంది. రావడానికి ఆస్కారమే లేదు, అదే విషయాన్ని కవి ఈ పంక్తులలో చెప్పారు.

మనమడంటే పుత్రుని కుమారుడు లేదా పుత్రిక కుమారుడు. ప్రతిరోజు తన తాతయ్య లేదా నానమ్మ కుర్చీని శుభ్రం చేస్తాడు. అంటే ఆ కుమారుడికి చేసే పనిపై ఇష్టం లేనప్పుడు ఏదో తుడిచాడు అని చెప్పడానికి శుభ్రం చేసి తన పనిని చేసుకోవడానికి లేదా ఆడుకోవడానికి హడావిడిగా వెళ్లిపోతారు. కుర్చీపై ఉన్నటువంటి తడి మరకలను గుర్తించి ఎందుకు ఈ రోజు కుర్చీ చేతులు తడిగా ఉన్నాయని గమనించి ఆలోచించే సమయం వాడికెక్కడిది. ఆ వృద్ధుడికి శరీరానికంటే మనసుకే ఎక్కువ గాయమైందని ఆ పసివాడికి ఏం తెలుస్తుంది. వాడి పని వాడిదే అంటూ కవి పై వాక్యాల ద్వారా వృద్ధుల మనస్థితిని చిత్రించాడు. ఈ విధంగా కవి భిన్న విధాలుగా వృద్ధుల మనోభావాలను గురించి విశ్లేషించి, వారిలో చైతన్యాన్ని నింపే ప్రయత్నం చేస్తున్నారు.

# మూడవ అధ్యాయం

# ఆచార్య ఎన్. గోపి రచనా శిల్పం

## 3.0. పరిచయం

కవిత్వంలో వస్తువు అంటే చెప్పబడిన అంశమని, శిల్పం అంటే చెప్పిన విధానమని సాధారణ నిర్వచనాలు. అంతే కాక ఈ రెండిటినీ విడదీయలేమనీ, వస్తువుకు తగ్గ శిల్పం అదే అమరుతుందనే అభిప్రాయాలు కూడా ఉన్నాయి. "ఒక రచనలో పైకి కనిపించే వస్తువు వెనుక మరో వస్తువు, దానిని అనుసరిస్తూ మరో వస్తువు అదే విధంగా పైకి కనిపించే శిల్పం వెనుక మరో శిల్పం దాగి ఉంటుందని సిద్ధాంతకర్తల ప్రతిపాదన. ఇలా కనిపించని వస్తుశిల్పాల సమానాశ్రయమే ఆ రచన మొత్తం పాఠకునిలో కలిగించే రసస్పందన అంటారు".[20] అంటే రచనలో పైకి కనిపించే వస్తు, శిల్పాలకు అతీతంగా అంతర్గతంగా భిన్న వస్తువులు శకలాలు శకలాలుగా, భిన్న శిల్ప రీతులు ఛాయలు ఛాయలుగా విస్తరించి ఉండి ఆ రచనను పండిస్తాయని చెపుతారు.

ఆంగ్లంలో 'Technique' అనే పదానికి సమానార్థకంగా తెలుగులో 'శిల్పం' అనే పదాన్ని తెలుగులో ఉపయోగిస్తున్నారు. ఏ వస్తువు ఏ రూపంలో వ్యక్తమౌతుందో ఆ రూపాన్ని శిల్పం అంటారు. ఈ ప్రక్రియ భావ ప్రతిమల భాషా శిల్పంలో ముఖ్యమైన భాగాలనే శిల్పం అంటారు. శిల్పం వ్యూహాత్మకమైంది. స్థూలంగా చెప్పాలంటే కావ్యాన్ని మలిచే పద్ధతిలో కవి చూపే ప్రతిభను శిల్పం అంటారు. రచనలో చమత్కారం శిల్పం. కవి తాను దర్శించింది ఎలా చెప్పాలి, దేని తర్వాత ఏది చెప్పాలి అనేది ఆలోచించి వాటిని తగిన రీతిలో మలచాలి. ఎత్తుగడ, నడక, ముగింపు అనేది శిల్పంలోని ప్రధాన అంశాలు. తెలుగులో మొట్ట మొదట శిల్పం అనే పదాన్ని ఉపయోగించిన ప్రాచీన కవి తిక్కన "శిల్పమునం బారగుండు" అని 'నిర్వచనోత్తర రామాయణ' అవతారికలో

---

[20] ప్రచ్ఛన్న వస్తుశిల్పాలు – ఒక పరిశీలన, శ్రీ సాగర్ శ్రీ రామకవచం. నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రచురణలు, విజయవాడ.

చెప్పుకున్నాడు. 'శిల్పాన్ని నైపుణ్యంగా భావించవచ్చు, వస్తువు, రూపం శిల్పంలో ఏది ముఖ్యమనే చర్చ సాహిత్యంలో నిరంతరం జరుగుతూనే ఉంది. కొందరు కావ్యానికి మూడూ ముఖ్యమేనని, మరికొందరు శిల్పమే ప్రధానమని భావిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ అందమైన వస్తువుకు మంచి రూపాన్నిచ్చి చక్కగా చెక్కితెనే అది పది కాలాల పాటు చక్కగా ఉంటుంది'.[21]

వస్తు శిల్పాలు రచనలో చాలా సన్నిహితంగా కలిసి పోవటం ఉన్నత విలువలు గల సాహిత్య లక్షణం. నిర్దిష్ట వస్తువు శిల్పంలోనే వ్యక్తమవుతుందంటారు. ప్రజాభిప్రాయాల్ని ప్రభావితం చేసిన ప్రముఖ రచనల్ని పరిశీలిస్తే ఈ విషయాన్ని గమనించవచ్చు. ఒక రచనా శిల్పాన్ని మార్చి, ఆ వస్తువును అలాగే చిత్రించడమనేది సాధ్యం కాదు. ఒక సాంఘీక దశ శిథిలమై కొత్త శక్తులు వికసించని దశల్ని క్షీణయుగాలు అంటాం. ఇలాంటి యుగాల్లో శిల్పానికి వస్తువుకు వైరుధ్యం వస్తుంది. కేవలం శిల్పవాద ప్రాధాన్యం పెరుగుతుంది. వాస్తవానికి ఇలాంటి సందర్భాల్లో వస్తు శిల్పాలు రెండు క్షుద్రంగానే ఉంటాయి. బాగా పాతబడి, ప్రభావితం చేసే శక్తిని కోల్పోయిన వస్తు శిల్పాలు క్షీణయుగాల్లో మాత్రమే ఉంటాయి.

'పాలక వర్గాలు ఆ వర్గాల కళ సాహిత్య నిపుణులు సాహిత్యంలో శిల్పం ప్రధానం అనే వాదాన్ని బలంగా ప్రచారం చేస్తారు. ఆ విధంగా వస్తువులో నవ్యత రాకుండా ఆటంకపరచటమే వాళ్ళ ఉద్దేశ్యం. కొత్తగా పుడుతున్న వర్గాల భావాలను రచనల్లోకి రాకుండా అణచివేయడం ఈ వాద సారాంశం. దేశా దేశాల్లోని ప్రగతివాద, విప్లవ రచయతలు ఈ శిల్పవాదాన్ని నిరాకరించి అధిక సంఖ్యాక ప్రజల్లోకి సాహిత్యాన్ని తీసుకుపోవటాన్ని దృష్టిలో పెట్టుకొని శిల్ప ప్రాముఖ్యాన్ని పరిమితం చేయాలన్నారు త్రిపురనేని మధుసూదన రావు.'[22]

అలాగే వర్ణనలు శైలి కథనంలో అంతర్భాగాలు. భౌతిక వాతావరణ పరిసరాల వర్ణనకు పాత్ర చిత్రణను జోడించి కాల స్థలాలు వస్త్వైక్యం సాధిస్తే కథనం రమణీయమవుతుంది. మాట్లాడేటప్పుడు కానీ, రాసేటప్పుడు కానీ భాషాభివ్యక్తంలో కనబడే తీరును 'శైలి' అంటాం. చెప్పే

[21] ఎన్. గోపి సాహిత్యం వస్తు రూప వివేచన. శ్రీలత. పరిశోధన సిద్ధాంత గ్రంథం. 2015.

[22] సాహిత్యంలో వస్తు శిల్పాలు – త్రిపురనేని మధుసూదన రావు. పుట. 13

విషయాన్ని ఏ కోణంలో చెప్తున్నాడని పరిశీలించి పరిశోధించడం శిల్పం. కవిత్వంలో శైలి ఎంత అవసరమో శిల్పం అంతకన్నా ఎక్కువనే అవసరమని చెప్పవచ్చు. ప్రస్తుత ఆధునిక కవులు ఎంచుకనే కవితా వస్తువు ఒక్కటే అయినా ఎంచుకున్న శైలిలో విన్యాసం చూపిస్తున్నారు. కథా సంవిధానం మాండలిక భాషను ఉపయోగించి శైలిలో నూతన సిద్ధాంతాలకు పునాదులు వేస్తున్నారు. మాండలిక భాష ప్రయోగం మూలంగా శిల్ప నైపుణ్యం పెంచుకునేందుకు కవులు కసరత్తులు చేస్తున్నారు.

వస్తుగత, రూపగత, సంవిధానగతమైన వివిధాంశాల కూర్పులో నైపుణ్యం ప్రదర్శించే కవిత్వం పదికాలాలపాటు నిలిచి పాఠకులను ఆకట్టుకుంటుంది. అయితే మంచిదనిపించే ప్రతి కవిత్వంలోనూ పైన పేర్కొన్న అంశాలు అన్నీ లేకపోవచ్చు. ఒక్కొక్క కథలో ఒక్క అంశమే శిల్ప పారమ్యాన్ని అందుకోవచ్చు. అది వస్తు విన్యాసంలో కానీ, పాత్ర చిత్రణలో కానీ, సంవాదశైలిలో కానీ సంఘర్షణోత్పాదనలో కానీ, సన్నివేశ కల్పనలో కానీ, మరే అంశంలోనైనా ప్రస్ఫుటం కావచ్చు. అయితే కేవలం శిల్పపరంగా లోప రహితమైన కథలన్నీ మంచి కథలనిపించుకోడానికి అర్హమైనవి కావు. ఎన్నుకొన్న వస్తువు, చెప్పదలచిన పరమార్థం, నిర్దిష్ట వస్తువు పట్ల రచయిత ప్రదర్శించే దర్శనం ఉదాత్తమైనప్పుడు తప్ప సంవిధాన శిల్పం రాణించదు, మంచి కథ అనిపించుకోదు.

మంచి కవిత్వం–గొప్ప కవిత్వం: మంచి కవిత్వమే ఒకానొక విలక్షణతను సంతరించుకుంటే గొప్ప కవిత్వమవుతుంది. మంచి కవిత్వం కావడానికి జీవితంలోని ఒకానొక మహత్తర సత్యాన్ని అద్భుత శిల్ప నైపుణ్యంతో కళ్ళకు కట్టించి, హృదయాన్ని ఒకానొక మహత్తర అనుభూతితో నిండించి, పదే పదే చదవాలనిపించే విధంగా రాయడం 'గొప్ప కవిత్వం' గా గుర్తింపు పొందుతుంది.

కవి తాను చెప్పదలచుకున్న విషయాన్ని ఒక ప్రత్యేకమైన పద్ధతిలో చెప్పటాన్నే శిల్పం అంటారు. అయితే చెప్పదలచకున్న విషయాన్ని అందంగా, శక్తివంతంగా, స్పష్టంగా ఉత్కంఠతను రేకెత్తించే విధంగా చెప్పటంలోనే ఒక రచయిత ప్రతిభ ద్యోతకమవుతుంది. విషయం ఎంత

గొప్పదైనా ఆ విషయానికి అక్షర రూపం ఇచ్చిన పద్ధతి పేలవంగా ఉంటే ఆ రచన విఫలమౌతుంది. కథ ఒకే సంఘటనతో నిండి ఉంటుంది. మిగిలిన విషయాలన్నీ ఆ సంఘటనలోనే ఇమిడి ఉంటాయి. కథా రచనలో భాష సరళంగాను అర్థమయ్యేటట్లుగా ఉండాలి.

'కవి భావాభివ్యక్తిలో వర్ణనా వస్తువును ప్రత్యక్షర శిల్ప సుందరంగా ప్రతిపాదించడమే నిర్మాణ శిల్పం. కావ్యం చిన్నదైనకొద్దీ అందులోని ప్రతి అక్షరానికి విలువ వస్తుంది.'[23]

కవిత్వ రచనలో కొందరికి భావ వ్యక్తీకరణ కన్నా భాషా ప్రదర్శన మీద వ్యామోహం ఎక్కువ ఇది ప్రాచీన కవుల్లోనూ, ఆధునిక కవుల్లోనూ అనేక మంది కవులలో గమనించవచ్చు. స్మశానాల వంటి నిఘంటువులని శ్రీ శ్రీ నిర్దేశించినా ఇంకా కొంత మందికి ఆ వ్యామోహం పోలేదు. గోపి శబ్ద వ్యామోహితుడు కాడు భావప్రేమికుడని చెప్పవచ్చు. అందుకే ఆయన అంటారు...

భాషతో చెక్కితే/భావం ఏర్పడదు

భావమే / మాటల్ని వేధిస్తుందన్నాడు

అలంకారాల విషయంలో ఆధునిక కవులు కొందరు ప్రాచీన సంప్రదాయాన్ని తిరస్కరించి, పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో సరికొత్త కఠిన, అస్పష్ట కవి సమయాలను సృష్టిస్తూ పాఠకుణ్ణి కవిత్వానికి దూరం చేస్తున్నారు. అందుకే కొంత మంది సాంప్రదాయవాదులే కాక ఆధునిక పాఠకులు సైతం ఇవాలటి కవిత్వం అర్థం కావడం లేదంటూ ఉంటారు. కానీ గోపి ప్రతి పాఠకుడిని దృష్టిలో ఉంచుకొని కవిత్వం రాస్తారు. వారు ముందు పాఠకుణ్ణి ప్రేమిస్తారు. తన నాజూకైనా దేశీయ భావుకతతో కవిత్వాన్ని దేశీయం చేస్తారు[24].

## 3.1. శిల్పం – నిర్వచనం

ఆచార్య తిరుమల రామచంద్రరావు సంపాదకత్వంలో వెలువడిన 'ఆధునిక కవిత అభిప్రాయ వేదిక' అనే పుస్తకంలో గుంటూరు శేషేంద్ర శర్మ శిల్పం గురించి చెప్తూ " కవిత్వంలో

---

[23] మినీ కవిత్వ నిర్మాణ శిల్పం భావాభివ్యక్తి. యం. చంద్రిక, 1987. పుట. 46.

[24] ఆధునికాంధ్ర కవిత్వం–ఉద్యమాలు– సందర్భాలు. రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి. 2002. పుట. 115

మనం శిల్పం అనే దాన్ని ఇంగ్లీషులో 'Form' అని గాని 'Craft' అని గాని అంటారు. కవిత్వపు ఉపరి రూపాన్ని మాత్రమే పరిశీలించి ఆ లక్షణాల్ని వర్ణించేటప్పుడు శిల్పమని సౌకర్యం కోసం వాడవచ్చు., పై మాటలలో వస్తువును అందంగా, మనసుకు హత్తుకునే విధంగా చెప్పడమే శిల్పం అని అర్థమవుతుంది.

మహీధర రామమోహనరావు శిల్పం గురించి వివరిస్తూ "అన్నింటికన్నా శిల్పానికి అతి ముఖ్య లక్షణం చదివించగలగడం, తర్వాత ఆలోచనకు అవకాశం ఇవ్వడం. చివరకు బాధో, ఉల్లాసమో, నవ్వో, చిరునవ్వో, కోపమో, తాపమో (రచయిత మీదకాదు) కలిగించడం". పై విషయాన్ని గమనిస్తే శిల్పం చదివించే గుణంతో పాటు ఏదో ఒక అనుభూతికి గురిచేస్తుందనే భావం ఇందులో కనబడుతుంది.

"తాను చూసిన సంఘటనలు, ఎదురయ్యే సమస్యలు, సుఖదుఃఖాలు కవి హృదయంపై ప్రగాఢ ముద్రను వేస్తాయి. హృదయాన్ని కలచివేసిన ఆ తీవ్రవేదనలు, ఆనందానుభవాలు అంతర్మథనానికి గురై కవి హృదయం నుండి తనదైన శైలిలో అభివ్యక్తీకరింపబడతాయి"[25] అంటూ గొట్టె శ్రీనివాసరావు గోపి గారి కవిత్వంలోని ప్రత్యేక అభివ్యక్తి, శిల్పం గురించి వివరించడం జరిగింది.

## 3.2. ఆచార్య ఎన్. గోపి గారి రచన శిల్పం

మానవ జీవితంలో ఏ జీవికయిన మూడు దశలు ఉంటాయి. అందులో మొదటిది బాల్యం, రెండవది యౌవనం, మూడవది వృద్ధాప్యం. ఈ మూడు దశలూ మనిషిని రూపాంతరం చెందిన క్రమాన్ని చూపిస్తాయి. ప్రతి జీవి పుట్టుకనుంచి చావు దాకా తాను చేసిన కార్యాలు అన్నీ కూడా పరిశీలించి పరిశోధించినప్పుడు ఒక్కో దశలో ఒక్కో జ్ఞాపకం ఉంటుంది. కవి **"మూడు ప్రపంచాలు"** అనే కవితలో మనిషిలోని మూడు దశలను గురించి మూడు కవితా పంక్తులలో శైలి విన్యాసంతో తెలియజేశారు. తెలిపిన క్రమం వస్తువు కంటే కూడా శిల్ప ప్రాధాన్యం కలిగి ఉంది.

---

[25] చిత్రదీపాలు – అధ్యయనం, గొట్టె శ్రీనివాసరావు. ఎం. ఫిల్. అముద్రిత సిద్ధాంత వ్యాసం, 1999. పుట. 3.

జీవితంలోని ప్రతి దశను మెరుపు నుంచి మరుపు వరకు వివిధ వస్తువులతో పోల్చి చెప్పడం జరిగింది ఈ పోల్చే క్రమంలో ప్రతి కవితలో అంత్యప్రాసను పాటించడం మూలంగా ఇతివృతం  శిల్పం తారా స్తాయికి చేరుకున్నాయి.

'బాల్యం
ఒక బంగారు వన్నె
యౌవనం
కలల్లోకి  వచ్చే కన్నె
వృద్ధాప్యం
చల్లారిన పాలగిన్నే'                    (పుట : 18)

అంటూ ప్రతీ పాదం చివరన అంత్యప్రాసను పాటిస్తూ మనిషి జీవితాన్ని వన్నె అంటే ఉషస్సు, కీర్తి, తేజస్సు వరకు వివిధ పరిణామాలను వివరించిన క్రమం శిల్ప ప్రధానంగా ఉందని చెప్పాలి. కవి అన్నట్లు బాల్యం అందరికీ అనందదాయకంగా సాగుతుంది కాబట్టే బంగారంలోని వన్నెతో పోల్చి చెప్పడం జరిగింది .యౌవనం అంటేనే రసాత్మక భావాల ప్రవేశం కాబట్టి చదివిన ప్రతి కావ్యం కూడా పాఠకులకు యౌవనంలో అయితే కావ్యనాయికలతో ప్రేమలో పడిపోయి కళల ప్రపంచంలో విహరిస్తూ ఉంటారు. అదే విషయాన్ని గోపి గారు తెలిపారు. ఎన్ని పరిణామాలు పొందినా జీవించే ప్రతి మనిషికీ వృద్ధాప్యం ఖచ్చితమే. బాల్యం, యౌవనం ఉన్నంత ఆనందంగా వృద్ధాప్యం ఉండదని శరీరంలోని తేజస్సుతోపాటు ఆలోచనలలోని ఉషస్సు కూడా తగ్గుతుందంటున్నారు.

బాల్యం అంటేనే తాతలు, నానమ్మలు, అమ్మమ్మలు అలాగే నాన్న, అమ్మ చెప్పే కథలతో ఎంతో ఆనందకరంగా ఉత్సాహంగా సాగిపోతుందన్న విషయాన్ని మొదటి పాదంలో తెలియజేశారు. అదే యౌవనం గురించి వివరించేటప్పుడు యౌవనం అంతా కూడా ఊహ ప్రపంచంలో తేలియాడే జీవితమని అందరికీ తెలిసిన విషయాలనే మరోకొత్త కోణంలో వివరించి

యౌవనాన్ని రాజకుమారి విరహ వ్యధగా పోల్చి వర్ణించిన తీరు పాఠకులను యౌవన ఛాయలు తొడిగే విధంగా ఉంది. అదే వృద్ధాప్యాన్ని అంతే అద్భుతంగా, అంతే ఉత్తేజంతో వివరిస్తూ వచ్చి "వృద్ధాప్యం ఒక ఒడువని ఆత్మకథ" అని అన్నారు . బాల్యం, యౌవన, ఛాయలు మనిషి జీవితంలో ఒక ఆనంద దాయకమైన పార్శ్వాలుగా ఎంతో తొందరగా గడిచిపోతాయనీ, అదే వృద్ధాప్యం అయితే ఇంకా ఎన్ని రోజులు ఈ అవస్థలు అన్న భావంతో మరణం వరకు కూడా నిరాశనే వెంట పెట్టుకొని పయనించాల్సి వస్తుందన్న భావాన్ని చివరి దశ అయిన వృద్ధాప్యానికి అన్వయించి చెప్పారు.

అందుకే పాఠకులలో నిరుత్సాహాన్ని ప్రోత్సహించేందుకు ఇష్టపడని గోపి కవిత చివరి పంక్తులలో 'వృద్ధాప్యం అనుభవాల తేజస్సు' అని పాఠకుల హృదయాలలో వృద్ధాప్య అనుభవాలను జ్ఞాన పార్శ్వాన్ని గురించి వివరించాడు. అందరూ కవితో ఏకీభవిస్తే వృద్ధాప్యం అనేది నిజంగా అనుభవాల తేజస్సు అన్న భావం మనలో కూడా కలుగుతుంది. గోపి గారి శైలి విన్యాసం ఆధారంగానే 'మూడు ప్రపంచాలు' అన్న కవిత మనిషి మూడు దశలలో ఉండే ఆనందాలు, ఆప్యాయతలను కళ్ళ ముందు ఉంచారు. అదేవిధంగా యౌవన దశను విరహ వ్యధతోను , ఏడురంగుల ఇంద్రధనస్సుతో పోల్చారు. వృద్ధాప్యాన్ని మాత్రం చల్లారిన పాలగిన్నే అని మొదటి పదాలలో చెప్పి తర్వాత పాదాలలో ఓడువని ఆత్మకథ అంటూ కొంత నిరాశ వాదాన్ని ప్రదర్శించిన కూడా చివరి పాదాలలో 'వృద్ధాప్యం అనుభవాల తేజస్సు' అనే ముగింపుతో పాఠకుల హృదయాలలో ఆర్ధతను నింపే విధంగా చెప్పారు.

### 3.2.1. భావచిత్రాలు

భావచిత్రం కవిత్వం ఆవిర్భవించినప్పటి నుండి ఉంటున్నది. నూటికి నూరు పాళ్ళు నేటిరూపంలో కాకపోయినా, భావచిత్రాలకు ఆయువుపట్టు అనదగిన లక్షణాలు ప్రాచీన సంస్కృత సాహిత్యంలో కూడా కనిపిస్తున్నాయి.

"మూర్తిమత్వం పునాదిగా కలిగి, పోలికల ద్వారా (అంటే ఒక అంశానికి మరొక అంశం చెప్పడం ద్వారా) ఒక అనుభవాన్ని కాని, భావావేశాన్ని కాని తెలియపరిచేదే భావచిత్రం"[26] అంటారు. ఆంధ్రసాహిత్యంలో ఎన్నో కావ్యాలలో భావచిత్రాలు ప్రస్ఫుటమయ్యాయి. అయితే ప్రాచీనాలంకారికులు వాటిని కేవలం అలంకారాలుగా మాత్రమే భావించారు. ఆధునికులలో కొందరు భావచిత్రం కవిత మొత్తంలో వ్యాపించి ఉంటుందన్నారు. కాని అలంకారం రెండు పదాలకు మాత్రమే పరిమితమవుతుందని అభిప్రాయపడ్డారు. కానీ అది పూర్తిగా సరికాదు. ఎందుకంటే ఒక విషయం యొక్క అనేక పార్శ్వాలను చెప్తూ, పద్యంలో ఒక దృశ్యాన్ని మూర్తి కట్టించే లక్షణాలు ప్రాచీన సాహిత్యంలో కోకొల్లలు. వీటిని లాక్షణికులు అలంకార పరిధిలోనే చర్చించారు తప్ప ప్రత్యేక భావచిత్రాలుగా స్వీకరించలేదు.

"కవిత్వంలోని అనుభూతి గాఢత, చిత్రలేఖనంలోని అభివ్యక్తి విశిష్టత కలిసి ఏర్పడిన సమగ్ర కవితాకళ భావచిత్రం"[27] అన్నారు పెన్నా శివరామకృష్ణ.

ఒక భావచిత్రం మరొక అంశానికి ప్రతినిధిగా చిత్రింపబడినప్పుడు అది విశేషార్థ స్ఫురణను కలుగజేస్తుంది. కవి చిత్రించిన ప్రతి అంశం వెనుక ఒక నిగూఢ అర్థం దాగి ఉంటుంది. దీని ఆధారంగానే పాఠకుడు కావ్యాన్ని అవగాహన చేసుకోవడం ప్రారంభిస్తాడు. అప్పుడు కవిత్వం నుండి వెలువడే అంశాలు అతన్ని అలౌకిక స్థితిలో నుండి కావ్యానందం కలిగినప్పటి స్థితికి తీసుకుపోతాయి. అప్పుడే 'అల్పాక్షరాలలో అనల్పార్థ రచన' అనేదానికి అర్థం పాఠకునికి స్ఫురిస్తుంది. ఎజ్రా పౌండ్ పేర్కొన్న 'ఏకకాలంలో తృటిలో సంభవించే మేథోద్వేగాల సంక్లిష్ట స్థితి' ఇది. కవి వక్రతా వ్యాపార ఫలితం ఇది.

ఆధునిక కవిత్వాభివ్యక్తి అయిన భావచిత్రానికి, పూర్వం నుండి వస్తున్న అభివ్యక్తి అంశాలయిన అలంకారాలు, ముఖ్యంగా రూపకం, ఉత్ప్రేక్ష, పరిణామ, ప్రతీప, సమాసోక్తి, లలిత, ముద్రాలంకారాలకు, ధ్వనికి, అట్లే ప్రతీకకు పోలికలు కొన్ని ఉన్నా, భేదాలు లేకపోలేదు.

---

[26] 1975–85 నడిమి ఆధునిక తెలుగు కవిత్వంలో కళాతత్వశాస్త్ర రీత్యా భావచిత్ర పరిశీలన. పద్మజ. చెన్నమనేని, 1995. పుట. 1

[27] శేషేంద్ర కవిత్వానుశీలనం. పెన్నా శివరామకృష్ణ. పుట. 74

వీటన్నింటి పరిణత రూపంగానే భావచిత్రం ఏర్పడిందని చెప్పవచ్చు. ఇవి వ్యస్తంగా గాని, సమస్తంగాగాని భావచిత్రాలలో అంగాలుగా ఉంటూ అవన్నీ కలిసి ఒక భావచిత్రాన్ని ఏర్పరచవచ్చు. లేదా అవి వేర్వేరు భావచిత్రాలుగా ఉన్నా ఆ భావచిత్రాలన్నీ కలిసి ఒకభావానికి పోషకంగా ఉండవచ్చు. తద్వారా పాఠకునికి అనుభూతి కలిగించే రూపు కట్టడం వంటివి ఏర్పడే అవకాశం కలుగుతుంది. సూక్ష్మంగా వివేచిస్తే భావచిత్రానికి, ఇతర కవిత్వాభివ్యక్తి అంశాలకు గల భేదాలను గుర్తించవచ్చు.

గోపిగారు ప్రయోగించిన భావచిత్రాలను గమనిస్తే **"పాపం! శరీరం"** కవితలో

'తెల్లని వెంట్రుకల నడుమ
ఒక్క నల్లటి మెరుపూ మిగల్లేదు
దంత రాహిత్యంతో
నోరు గుహలా మారింది'. (పుట : 34)

వృద్ధాప్యంలో మానవుడి బాహ్య రూపంలో వచ్చే మార్పులను చిత్రించారు రచయిత. పూర్వ కాలంలో వృద్ధాప్య వయస్సు వస్తేగాని తల నెరిసేది కాదు. నేటి ఈ ఆధునిక వాతావరణంలో జీవన శైలిలో జరుగుతున్న మార్పుల కారణంగా ఆహారంలో నాణ్యత లోపించి పసిపిల్లలకు సైతం తలలు నెరసిపోతున్నాయి. ఆ నెరుస్తున్న తలలపై ఒక్క నల్లటి వెంట్రుక కూడా మిగలలేదనే విషయాన్ని భావచిత్రం రూపంలో వివరించారు. ఇక్కడ కవి వెంట్రుకలు తెల్లబడ్డాయనడంలో వృద్ధాప్యం కూడా సంభవించిందనే విషయాన్ని కూడా స్ఫురింపజేస్తున్నాడు.

చివరి రెండు కవితా పంక్తులలో సంపూర్ణ వృద్ధాప్యం సంభవించిందనే అర్థం వచ్చేలా నోట్లోని పళ్ళు ఊడిపోయి నోరు గుహలా మారిందనే భావచిత్రాన్ని **"ముది ముది"** కవితలో ప్రయోగించాడు.

'నా కిప్పుడనిపిస్తున్నది
కాలం ఒక మొసలి
దాని నోరు ఎప్పుడూ

తెరుచుకొనే ఉంటుంది

మృత్యువుతోనే అది

మూతబడుతుందనుకుంటా.' (పుట : 46)

పై కవితా పాదాలలో కాలాన్ని ముసలి మాదిరిగా దాని ఆకలి తీర్చుకోవడానికై దేహమనే ఆహారం కోసం మృత్యువు ఎప్పుడూ వేచిచూస్తుందనే భావన వచ్చేలా పదచిత్రాలలో వివరించాడు. మరణంతోనే దేహానికి సంప్రాప్తి కలుగుతుందనే మరో అర్థం వచ్చేలా ఈ కవితా పాదాలున్నాయి.

**"మనసుకు వయసు లేదు"** కవితలో దేహంలో వచ్చే మార్పులను సృష్టిలో వచ్చే మార్పులతో పోల్చుతూ ప్రతీ పదంలో పద చిత్రం ప్రస్ఫుటమయ్యేలా వివరించాడు.

'కనులు అందాన్ని నేర్పుతాయి

చెవులు శ్రావ్యతను

అలవాటు చేస్తాయి

నాణ్యతలు మారిపోతున్నప్పుడల్లా

హెచ్చరికలు లేకుండానే

వర్షాలు కురుస్తాయి.' (పుట : 59)

కుటుంబ భారాన్ని మోస్తూ ఆర్థిక ఆర్జన చేస్తున్నంత కాలం కుటుంబంలోని వారందరూ గౌరవిస్తారు. అదే వయసు భారమయినప్పుడు అంతకు ముందున్న ఆదరాభిమానాలు కోల్పోతాడనే అర్థం వచ్చేలా 'నాణ్యత మారిపోతుంది' అనే భావచిత్రంతో అభివ్యక్తికరించాడు. అలాగే అతడు సమాజంలో బాధలకు గురవుతున్న వారికి వచ్చే కన్నీళ్లను 'వర్షం' అనే భావచిత్రంతో ప్రస్ఫుటికరించాడు.

**"అతను మరణించటానికి వీల్లేదు"** కవితలో వ్యక్తి కాలాన్ని జయించి జీవించినవాడికి మరణం సంభవించడానికి వీల్లేదంటూ కాలునితో కయ్యానికి దిగిన భావన స్పష్టంగా గోచరిస్తుంది.

"నిశ్శబ్దాన్ని

కారుణ్య శతాబ్దంగా మార్చినవాడు

ఇప్పుడా నిశ్శబ్దమీ్మదే పడుకున్నాడు." (పుట : 78)

జీవితమంతా ప్రశాంతతనే మార్గంగా నడిచిన వ్యక్తి మృత్యువు తర్వాత కూడా మరణశయ్యపై ప్రశాంతంగా శయనించాడనే అర్థం వచ్చేలా 'నిశ్శబ్దం మీదే పడుకున్నాడు' అన్న పదచిత్రంతో మృత్యు సందర్భాన్ని చిత్రించాడు.

దేహంలో సత్తువలేదు శక్తి నశించింది అని భావించే వారికి దీటైన సమాధానం ఇస్తూ **"శేష జీవితం"** కవితను కొనసాగించారు.

'రక్తంలో

ఎండవేడి లేదనుకోవద్దు

ఎందుకు లేదు!

అది వెన్నెల రూపంలో వుంది'. (పుట : 80)

వృద్ధాప్యం సంభవించగానే దేహంలోని రక్త ప్రవాహం చల్లబడుతుంది అనుకోకు, అది చంద్రుని నుంచి వచ్చే చల్లని కాంతి రూపంలో జ్ఞాపకాలుగా శేష జీవితంలో కూడా మిగిలే ఉందనే భావం స్ఫురించేటట్టు పదచిత్రాలను కూడా ఉపయోగించారు.

## 3.2.2. ప్రతీకలు

ప్రతీక ఆధునిక కవిత్వాభివ్యక్తికి తోడ్పడే కవితా ద్రవ్యాలలో ఒకటి. ఇది ఎంత ప్రాచీనమో అంత ఆధునికమైంది. 'అల్పాక్షరాలను అనల్పార్థ రచనము అనదగ్గ అత్యంత పరిణత స్థితి ఇది. ప్రతీక ద్వారా భావజాలాన్నంతటిని సూచించే మరొక వస్తువును ప్రతినిధిగా నిలపడం ద్వారా తత్సంబంధిత సమగ్రానుభూతి పాఠకుడిలో ఆవిష్కరించడం'[28]. 'వృద్ధోపనిషత్' కావ్యంలో గోపి గారు కొన్ని శక్తివంతమైన ప్రతీకలను ఉపయోగించారు.

"చెట్టునుంచి రాలుతున్న

[28] చిత్రదీపాలు–అధ్యనం. గొట్టె శ్రీనివాసరావు. అముద్రిత ఎం. ఫిల్ సిద్ధాంత వ్యాసం. పుట. 08.

ఆకులను లెక్కిస్తూ

లెక్క తప్పటం,

కాలం మూలల్లోంచి

పాకి వస్తున్న ఒక చీమ

చటుక్కున మాయమైపోవటం'. (పుట : 23)

ఇక్కడ చెట్టు అంటే మానవ జీవితంలోని ఒక సగటు జీవితకాలం. ఆకులు అంటే ఆ జీవితంలోని రోజులు. కాలం అంచున అంటే ఆ సగటులోని చివరి ఘట్టం. చీమ అంటే మృత్యువు. ఆ మృత్యువు సమీపించినప్పుడు మనం ఈ బాహ్య ప్రపంచం నుండి మాయమైపోవటాన్ని పై ప్రతీక ద్వారా గోపిగారు భావాన్ని వ్యక్తీకరించారు.

**"పాత ప్రేయసి"** కవితలో జ్ఞాన సముపార్జనకు ఆధారంగా నిలిచే జ్ఞాపకాలను చక్కటి ప్రతీకల రూపంలో వివరిస్తూ...

'జ్ఞాపకాలు పచ్చగానే వుంటాయి

వాస్తవాలకే మసక'. (పుట : 55)

జ్ఞాపకాలు అంటే జీవితంలో ఎదుర్కొన్న ఒడిదుడుకల సంఘర్షణల ఫలితం. ఇందులో కొన్ని సంఘటనలు జీవితాన్ని వెంబడిస్తూనే ఉంటాయి. ఇక్కడ కవి వృద్ధ జీవితంలో కూడా తన యుక్త వయస్సులో సహజంగా అందరి జీవితాలలో జరిగే ప్రేమానుభూతులు ఇంకా తనను వీడలేదంటూ అవి 'పచ్చగానే' అనే ప్రతీక తో తనలో పదిలంగానే ఉన్నాయని తెలియజేస్తున్నాడు. మసక అంటే అప్పటి వాస్తవ జ్ఞాపకాలను నెమరేస్తూ దూరమైన ప్రేయసిని తలుచుకుంటూ దుఃఖిస్తున్నాడనే అర్థం వచ్చేలా ఈ ప్రతీక ప్రయోగించారు.

**"పూర్ణకుంభం"** కవితలో అశేష జ్ఞాన సంపదను సముపార్జించిన వ్యక్తి జీవితానికి ప్రతీకగా..

'సంధ్యాకాలం అందమైందే

కాని అది రాత్రికి

ఇవతలి అంచు'                                        (పుట : 57)

ఉదయం సూర్యుడు ఉదయిస్తూ వెలుతురును, చైతన్యాన్ని ప్రసరింపజేస్తాడు. సంధ్యాకాలం సూర్యుడు తేజోమూర్తిగా ప్రకాశిస్తూనే అస్తమించడానికి సిద్ధమవుతుంటాడు. ఆ సమయంలో నీలి మేఘాల దృశ్యం చూపరులకు ఎంతో అందంగా కనిపించినప్పటికీ అది చీకటికి నాంది అని వారు గ్రహించలేకపోతారు. ఆ విషయాన్నే కవి 'అది రాత్రికి ఇవతలి అంచు' అనే విషయాన్ని వృద్ధాప్యంలో చివరి దశ అందంగా కనిపించినప్పటికీ అది మరణానికి సంకేతాన్ని ఇస్తుందని సంధ్యాకాలం అనే ప్రతీకతో పోల్చి వివరించారు.

వృద్ధాప్యం శేషజీవితంలో నిస్సహాయ పడిఉన్నపుడు మృత్యువుతో సంభాషించడాన్నీ గోపిగారు అద్భుతమైన ప్రతీకలతో పోల్చుతూ **"మృత్యువుతో ముఖాముఖి"** కవితను కొనసాగించారు.

'వేళగాని వేళ ఇదేమి రాక
బిజీగా వున్నాను.
అనుకున్నాను
ఇక్కడే ఎక్కడో తిరుగుతున్నావని'.                    (పుట : 65)

ఈ కవితలో మృత్యువునే ప్రశ్నించిన విధానం కనిపిస్తుంది. పై కవితా పంక్తులలో కవి తన జీవితకాలం పూర్తి కాకుండానే తాను చేయదలచుకున్న భవిష్యత్తు కార్యాచరణలు ఇంకా పూర్తికాకుండానే మృత్యువు సమీపిస్తున్నదని భావించి వేళ గాని వేళ అంటే ఈ ప్రతీకలో కవి జీవిత సగభాగాన్నే మృత్యువు తనను సమీపిస్తుందని ముందుగానే ఊహించినట్టుగానే అది నిజమేనన్న భావనను ప్రతీకల రూపంలో తెలియజేస్తున్నాడు. అలాగే

'ఇన్నాళ్లుగా నిన్ను
నా ఛాయలక్కూడా రానివ్వలేదు
ఎప్పటినుంచో స్నేహితుడివి నువ్వు
ఎప్పుడూ గీత దాటింది లేదు'.                    (పుట : 66)

పుట్టుకతో పాటు మరణం కూడా జనిస్తుందనేది వాస్తవం. చివరి దశలో ఉన్నటువంటి వృద్ధుడు తనలో తాను మృత్యువుతో సంభాషిస్తూ తనలో అంతర్గతంగా దాగివున్న బాధను వ్యక్తపరుస్తున్న సన్నివేశాన్ని ఈ కవితలో చూడవచ్చు 'ఇన్నాళ్లుగా' అంటే తన జీవితంలో నిన్ను అంటే 'మృత్యువు' నా అంటే వృద్ధాప్యం. ఛాయా అంటే తన దరిదాపులకు కూడా రానివ్వలేదు. ఎప్పటినుంచో నువ్వు అంటే జీవం పోసుకున్నప్పటి నుంచి స్నేహితుడివి అనడంలో ప్రాణం అనే భావన స్ఫురింపజేస్తూ ఆ ప్రాణం తన దేహాన్ని విడిచి వెళ్ళలేదని. ఆ ప్రాణం తన దేహాన్ని విడిచే సమయం ఆసన్నమైనదని గీత అనే ప్రతీకలో ప్రస్ఫుటం అయ్యేలా గోపిగారు వివరించారు.

**"అతను మరణించటానికి వీల్లేదు"** సంధ్యాకాల సమయాన్ని మనిషి జీవితానికి ప్రతీకగా భావించి ఎంతో అద్భుతంగా రచించారు.

'పగలు రాత్రితో కలిసే
ఎరుపైన సన్నివేశం
అందమైందే కావచ్చు
కానీ చీకటి
అతన్ని కూడా కబళించటాన్ని
జీర్ణించుకోలేము.' (పుట : 78)

ప్రకాశవంతంగా వెలిగే సూర్యుడు అస్తమించే సమయంలో ఎరుపు రంగెత్తి ఎంతైతే అందంగా కనిపిస్తాడో జీవిత కాలంలో జ్ఞాన సముపార్జన చేసి వార్ధక్యంలోకి చేరుకున్న వృద్ధాప్య జీవితం కూడా అంతే ప్రకాశవంతంగా జీవిస్తున్న వ్యక్తికి మృత్యువు ప్రాప్తించడం విషాదకరమన్నారు.

పగలు అనేది పుట్టుకకు ప్రతీక. రాత్రి అంటే గిట్టుకకు ప్రతీక. ఈ పుట్టుక గిట్టుక మధ్యన ఉన్న కాలమే జీవితం. ఉదయిస్తున్నప్పుడు సూర్యుడి నుండి వెలువడే కాంతి అస్తమిస్తున్నప్పుడు వెలువడే రంగు, రూపం ఒకటే అయినప్పటికి మొదటిది మాత్రం చైతన్యానికి ప్రతీక అయితే సంధ్యా కాలంలోని కాంతి జీవితంలోని అంధకారానికి ప్రతీక అవుతుంది. ఆ అంధకారం వృద్ధాప్య

జీవితాన్ని కబళించడాన్ని జీర్ణించుకోలేక పోతున్నామని కవి వృద్ధుల మనో వేదనలోని భావాన్ని అద్భుతమైన ప్రతీకల ద్వారా వివరించారు.

### 3.2.3. అలంకారాలు

'అలంక్రియతే ఇతి అనేన ఇత్యలంకార' అని అలంకార శబ్ద వ్యుత్పత్తి. అనగా వస్తువును సుందరంగా తీర్చిదిద్దే దానికి 'అలంకారం' అని పేరు. లౌకిక వ్యవహారంలో అలంకారాలను సొమ్ములు, నగలు అంటారు.

ఆలంకారికులు కావ్యాన్ని శరీరంతో పోల్చారు. ఏ విధంగానైతే మనిషి అందంగా ఉండడానికి అలంకారాలు పెట్టుకుంటాడో అదేవిధంగా కవిత్వంలో కూడా అలంకారాలను వినియోగించి ఆ రమణీయకతను, సొగసును, సౌందర్యాన్ని సాధిస్తారు.

అయితే అలంకారాలు శబ్దాలంకారాలు, అర్థాలంకారాలని రెండు విధాలు. శబ్దాన్ని ఆశ్రయించుకొని ఉండేవి శబ్దాలంకారాలు. అక్షరాలు, పదాల ఆవృత్తి వల్ల శబ్దాలంకారాలు ఏర్పడుతాయి. ఇవి చెవులకు ఇంపును కలిగించి, బాహ్యాశోభకు కారణమౌతాయి. అర్థాలంకారాలు అర్థాన్ని ఆశ్రయించుకొని ఉంటాయి. అవి అందించే అర్థమే ప్రధానం.

అయితే ఎన్ని అలంకారాలను చెప్పినా అవన్నీ ఉపమాలంకారంలోనే అంతరిస్తాయనే వాళ్ళు కూడా ఉన్నారు. అంతే కాకుండా ఒక్కొక్క అలంకారంలో అంతర్విభాగాలు కూడా ఉన్నాయి.

#### 3.2.3.1. ఆధునిక కవిత్వంలో అలంకారాలు

కథా సహితమైన ప్రాచీన కవిత్వానికీ, కథారహితమైన ఆధునిక కవిత్వానికీ, కవితా నిర్మాణంలో అలంకారాల ఉపయోగంలో మౌలిక భేదం ఉంది. ఆధునిక కవిత్వంలోని అలంకారాలు ప్రాచీన అలంకార శాస్త్ర గ్రంథాల్లో చెప్పబడిన అలంకార సూత్రానికి పూర్తిగా ఒదిగిపోయేట్లు కొన్ని చోట్ల కనిపించవు. ప్రాచీన, ఆధునిక కవిత్వ నిర్మాణంలో వచ్చిన మార్పు ఎంతో వేరుగా ఉంది. ఆ మార్పులను అనుసరించి నేటి ఆధునిక కవిత్వానికి తగిన విధంగా అలంకార ప్రకరణాన్ని పెంచాల్సిన అవసరం ఉంది. అయితే ఆధునిక కవిత్వ నిర్మాణంలో

అలంకారాల్లో మార్పు ఎంత వచ్చినా, అది ప్రాచీన అలంకారం వివేచన పైననే మౌలికంగా ఆధారపడి ఉంటుంది.

### 3.2.3.2. అలంకార ప్రయోజనం

అలంకారాలు సామాన్య భాషకి అందాన్ని చేకూర్చి దాన్ని కవిత్వంగా మారుస్తాయి. కవితకు రమణీయకతను, సొగసును చేకూరుస్తాయి. ఈ అలంకారాలు చమత్కారాన్ని కలిగించి పాఠకుడిని పఠింపజేస్తాయి, పరవశింపజేస్తాయి.

### 3.2.3.3. అలంకార నైపుణ్యం

ఏ కావ్యమైనా చాలా కాలం నిలవడానికి కారణం వస్తువు, రచనా శిల్పం రెండూ బాగుండటం. రచనకి నాద చతురత అందాన్ని తీసుకువస్తుంది. రచనా శిల్పంలో శబ్దానిదే ప్రథమ స్థానం.

### 3.2.3.4. శబ్దాలంకారాలు

తెలుగులో అలంకారాలు రెండు రకాలు. ఒకటి శబ్దాలంకారాలు, రెండు అర్థాలంకారాలు. శబ్దాలంకారాలు శబ్దాన్ని ఆశ్రయించి ఉండగా, అర్థాలంకారాలు అర్థానికి ప్రాధాన్యతను ఇస్తాయి.

అర్థం కంటే శబ్దానికే ప్రాధాన్యం గలవి శబ్దాలంకారాలు.

#### 3.2.3.4.1. వృత్త్యనుప్రాస అలంకారం

ఒక హల్లు లేదా వర్ణం అనేక పర్యాయాలు ఆవృత్తం కావడం లేదా వచ్చిన హల్లు మళ్ళీ మళ్ళీ రావడాన్ని వృత్త్యనుప్రాస అలంకారం అంటారు.

గోపిగారు కొన్ని కవితలలో అక్కడక్కడా వృత్త్యనుప్రాసను పాటించారు.

'నన్ను పెద్ద కవి అంటున్నావే
పెద్ద కవిని కాదు నీకు సీనియర్ కవిని' (పుట:72)

పై కవితా పంక్తులలో **'కవి'** అనే పదాన్ని మళ్ళీ మళ్ళీ రావడాన్ని గమనించవచ్చు.

**"ముది మది"** కవితలో కూడా వృత్త్యనుప్రాస అలంకార లక్షణాలను చూడవచ్చు.

'కాపలా కాసేవాళ్ళు

నా జ్ఞాపకాలను కాపాడితే బాగుండు' (పుట : 46)

పై కవితా పంక్తులలో **'క'** అనే వర్ణం అనేక సార్లు పునరావృత్తం అయ్యింది. ఇది వృత్త్యనుప్రాస అలంకారానికి ఉదాహరణగా చెప్పవచ్చు.

### 3.2.3.4.2. అంత్యానుప్రాస అలంకారం

పదాల చివరన లేదా పాదాల చివరన వచ్చిన అక్షరాలే మళ్ళీ మళ్ళీ పునరావృత్తం కావడాన్ని అంత్యానుప్రాస అలంకారం అంటారు. పాదాంతంలో ప్రాసను పాటిస్తే అదే 'అంత్యానుప్రాస'. అన్ని పాదాల్లో చివరి అక్షరాలు ప్రాసాక్షర నియమంతో సమానంగా ఉంటే అది అంత్యానుప్రాస అవుతుంది. ఒకే రకమైన ముగింపు పాటించడం వల్ల పద్యాన్ని లేదా కవిత్వాన్ని చదివేటప్పుడు భావస్ఫూర్తితో పాటు మనస్సుకి ఉల్లాసం కలుగుతుంది.

గోపిగారు **"ఘోస్ట్ రైటర్"** కవితలో ఎక్కువగా అంత్యానుప్రాసను పాటించారు.

'నువ్వు రాసిన కథలన్నీ

ఒకప్పుడు

కుతూహల రసరమ్య పేటికలు,

నీ జ్ఞానానుభావాలు

స్వచ్ఛహరిత వాటికలు,

నీ వ్యాఖ్యానాలు

పారవశ్య వీచికలు.' (పుట : 47)

ఈ పై కవితా పాదాలలో చివరగా 'లు' అనే అక్షరం మళ్ళీ మళ్ళీ పునరావృత్తం కావడం జరిగింది. అదే విధంగా...

'మళ్లీ మళ్లీ మాట్లాడమనేవారు

మళ్లీ మళ్లీ వినేవారు'                    (పుట : 47)

పై రెండు కవితా పాదాలలో చివర 'వారు' అనే పదం పాదాంతంలో వచ్చేలా అంత్యానుప్రాసను పాటించారు.

**"మునిమనుమరాలితో ముత్తాత ముచ్చట్లు"** కవితలో ప్రత్యేకంగా అంత్యానుప్రాస అలంకారాన్ని పాటించే ప్రయత్నం చేశారు.

నీ ఆలోచనల్లో ఎంత పరిణతి!

ఇదే కాబోలు నేటి సామాజిక గతి.                    (పుట : 73)

ఈ కవితా పంక్తులలో **'పరిణతి, గతి'** అనే రెండు పదాల చివర **'తి'** అక్షరాన్ని అంత్యానుప్రాసతో ముగించాడానికే పాటించారని స్పష్టమవుతుంది.

మరో కవిత అయిన **"వయోధిక స్పృహ"** కవితలో కూడా అంత్యానుప్రాస అలంకారాన్ని గమనించవచ్చు.

'తెల్లని వెంట్రుకలు అబద్ధం కాదు

శరీరం పై ముడతలు అబద్ధం కాదు

తడబడే అడుగులు అబద్ధం కాదు'                    (పుట : 81)

పై రెండు కవితా పాదాల చివర **'కాదు'** అనే పదం పాదంతంలో మళ్ళీ మళ్ళీ రావడం కనిపిస్తుంది.

## 3.2.3.5. అర్థాలంకారాలు

శబ్దం కంటే అర్థానికే ప్రాధాన్యం ఉండేవి అర్థాలంకారాలు.

### 3.2.3.5.1. రూపకాలంకారం

ఉపమేయ ఉపమానాలకు అభేదం చెప్పడమే రూపకాలంకారం. ఉపమేయంలో ఉపమాన ధర్మాన్ని ఆరోపించి చెప్పడం రూపకాలంకారం.

గోపిగారు వారి కావ్యం మొత్తంలో కొన్ని చోట్ల రూపకాలంకారాన్ని పాటించారు.

**"వృద్ధుడు"** అనే కవితలో రూపకాలంకారాన్ని చూడవచ్చు.

'సంసార మహాసాగరంలో

తడిసిపోయిన మమతల ముద్దలు.' (పుట : 14)

పై కవితా పాదాలలో సంసారాన్ని ఉపమేయంగా, మహాసాగరాన్ని ఉపమానంగా అభేదం చేసి చెప్పారు.

ఈ కవిత పంక్తులలో నడుము అనేది ఉపమేయం, ధనుస్సు ఉపమానం. ఈ రెండు వాక్యాలలో వొంగిన కుర్చీకి వృద్ధాప్య నడుముతో అభేదం చెప్పడం జరిగింది.

**"శేష జీవితం"** కవితలో కూడా రూపకాలంకార లక్షణాలు కనిపిస్తున్నాయి.

'కాలవృక్షం నుండి

ఒక ఆకు రాలింది

మరోరోజు గడిచింది.' (పుట : 79)

అన్న కవితా పదాలలో వృక్షానికి ఆకుకు అభేదం పాటించారు.

## 3.2.3.5. ఉపమానాలు

గోపి గారు 'వృద్ధోపనిషత్' కావ్యంలో అనేక రకాల ఉపమానాలను ప్రయోగించి కావ్యశిల్పంలో వైవిధ్యాన్ని కనబరిచారు.

**"కృతజ్ఞత"** అనే కవితలో కొన్ని ఉపమానాలను చూడవచ్చు. ఉదాహరణకు

'వృద్ధుడు

నిన్నటి వార్తాపత్రిక లాంటివాడు కాదు' (పుట : 15)

ఇక్కడ వృద్ధులను వార్తా పత్రికలతో పోల్చి చెప్పారు. అలాగే

'ఒక పాతబడని

కావ్యం లాంటివాడు.' (పుట : 15)

అంటే వృద్ధుల జ్ఞానాన్ని మహా కావ్యంతో పోల్చి చెప్పారు. ఎందుకంటే కావ్యం ఎప్పటికీ పాతబడదు. అందుకే వృద్ధులను కావ్యంతో పోలిక చేసి చెప్పారు.

**"పాపం శరీరం"** కవితలో

"దంత రాహిత్యంతో

నోరు గుహలా మారింది". (పుట : 34)

అంటూ వృద్ధ వయసులో నోట్లో పళ్ళు ఊడిపోవడం సహజం. ఆ సన్నివేశాన్ని గోపిగారు గుహతో పోల్చి చెప్పారు.

**"ముది మది"** కవితలో గోపిగారు ఏంతో చక్కటి ఉపమానాన్ని ప్రయోగించారు.

'చిత్తవైకల్యం వల్ల శరీరం

ఒక ఎముకల సంచిలా తోస్తుంది.' (పుట : 46)

అవసాన దశలో శరీర అవయవాలు సత్తువను కోల్పోవడం సహజం. అప్పుడు సత్తువ లేని శరీరం ఒక ఎముకల సంచిలా కనిపిస్తుందనే ఉపమానంతో పోల్చి చేపడం గోపి గారి శిల్ప నైపుణ్యానికి మచ్చు తునకగా తోస్తుంది.

## 3.2.4. రసం

గోపిగారు 'వృద్ధోపనిషత్' కవితా సంపుటిలో కరుణ రసాత్మక కవితల ద్వారా వృద్ధాప్య జీవితాన్ని చిత్రించారు. ఈ కవితా సంపుటి వృద్ధులు చరమాంక దశలో అనుభవించేటటువంటి కష్టాలను, వారు అనుభవించే మనోవేదనను తెలియజేశారు. ఈ కావ్యంలో అక్కడక్కడ కొన్ని కవితలలో వృద్ధులను చైతన్యపరుస్తూ వారిలో ఆత్మవిశ్వాసం నింపే ప్రయత్నం చేశారు. ఈ కావ్యం కరుణ రసం ఉండడానికి కారణం వృద్ధుల చివరి దశలో వారికి ఆనందాలు దూరం కావడం, కుటుంబ సభ్యుల ఆదరణ లేకపోవడం, సమాజంలో వారికి తగిన స్థానం ఇవ్వకపోవడం. ఇలాంటి వారి జీవితంలో నవ్వులు, ప్రేమ ఉండడానికి ఆస్కారం లేదు. వ్యక్తులను అవసాన దశలో ఎవరన్నా ఒక చిన్న మాట అన్నా వారి కళ్ళల్లో కన్నీరు జనిస్తుంది. అలాంటి కొన్ని కవితలు మనం ఈ 'వృద్ధోపనిషత్' కావ్యంలో చూడవచ్చు.

**"ఓల్డేజ్ పెన్షన్"** అనే కవితలో కరుణరసాత్మకమైన కవితా పంక్తులను గమనించవచ్చు.

'మొట్టమొదటిసారి కొడుకులు
గద్దల్లా కనిపిస్తున్నారు.
వద్దురా!
నా మందులగ్గావాల్రా
ఆకు వక్కలు కొనుక్కుంటా బిడ్డా!
అని శోఖాలు పెట్టింది ముసల్ది.' (పుట : 42)

పైన తెలిపిన కవితా పంక్తులలో సర్కారు ఇచ్చే ఆసరా పెన్షన్లను పిల్లలు వారి కనీస అవసరాలకి ఉంచకుండా గద్దల్లా వచ్చి లాక్కుపోయే సందర్భాన్ని గోపిగారు కరుణరసాత్మకంగా వివరించారు. ఈ కవితా పంక్తులు వాస్తవ సంఘటనలను సజీవంగా చిత్రిస్తున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. దీనినే గోపి గారిలోని ప్రత్యేక శైలిగా చెప్పుకోవచ్చు.

**"ఒంటరితనం"** కవితలో ఒంటరితనం మనిషిని ఎంత నిరాశా, నిస్పృహలకు గురిచేస్తుందో కరుణరసాత్మకంగా గోపిగారు చిత్రించారు.

'ఎదుటివారు మాట్లాడే ప్రతీమాటా
ముల్లుగా మారి
హృదయానికి గుచ్చుకోవటం.
ఒక కన్నీటిచుక్క
యేరులై, నదులై
సముద్రమై పొంగిపొర్లటం
చనిపోయిన సహచరి
ఫోటోలోంచి జాలిగా పలుకరించడం' (పుట : 24)

అనే కవితా పంక్తులలో ఒంటరిగా మిగిలిపోయిన వృద్ధజీవితం అనుభవిస్తున్న మనోవేదనను గోపి కరుణ రసం ప్రస్ఫుటయ్యేలా వివరించారు. ఒంటరితనంలో కన్నీరుగా

ప్రారంభమైన భాష్ప బిందువులు ప్రవాహంగా మారి మహాసముద్ర స్థాయిని చేరుకునే బాధ గుండెలోతుల్లో కలుగుతుందని హృదయవిదారకంగా గోపిగారు కవిత్వీకరించారు.

### 3.2.5. మానవతావాదం

నేటి ఆధునిక కాలంలో సమాజంలో జరుగుతున్న సంఘటనలకు, సన్నివేశాలకు చలించి మానవతా దృష్టితో కవిత్వం రాస్తున్నవారిలో గోపిగారు అగ్రస్థానంలో ఉంటారు. అందుకు వీరు రచించిన ఎన్నో కావ్యాలను ఉదాహరణగా చెప్పవచ్చు. అందులో 'వృద్ధోపనిషత్' కావ్యం ఒకటి. 'మానవుని ప్రాథమిక సమస్యలతో వ్యవహరించే తత్వమే మానవతావాదం. ఏ వ్యక్తి మానవ శ్రేయస్సుని ఆశిస్తాడో, ఏ వ్యక్తి ఈ భూమిపైన మానవుని సంక్షేమాన్ని ఆపేక్షిస్తాడో, ఏ వ్యక్తి అయితే ప్రస్తుత మానవుని అభ్యుదయానికి ప్రత్యక్ష సంబంధాన్ని కలిగి ఉంటాడో అతడినే నిజమైన మానవతావాదిగా నిర్ణయించవచ్చు'[29]. ఈ లక్షణాలన్నీ గోపి గారిలో నిగూఢంగా దాగున్నాయి కనుకనే ఆయన సాహిత్యంలో మానవతావాద ఛాయలు ప్రధానంగా కనిపిస్తున్నాయి.

మూడు దశాబ్దాలకు పైగా అవిశ్రాంతంగా రచనా వ్యాసాంగాన్ని కొనసాగిస్తున్న మానవతావాది గోపి గారు. తెలంగాణ ముద్రతో అఖిలాంధ్ర దేశంలో ఏ ఉద్యమం వచ్చినా దానిని తనదైన ధోరణిలో తన కవిత్వంలో ప్రతిబింబించేట్లుగా రాసే కవి ఆయన. వర్తమాన కాలంలోని ఆర్థిక, రాజకీయ, సామాజిక సంఘటనలకు ప్రతిస్పందిస్తూ మౌలికమైన మానవీయ సూత్రంతో వస్తువును ముడివేసే వైనం ఆయన కవిత్వంలో కనిపిస్తుంది. గోపి గారి కవిత్వానికి కేంద్రబిందువు మనిషి, మానుషత్వం ఏమాత్రం గాయపడినా ఆగ్రహంతో ఆర్ధ్రతతో ఎలుగెత్తే కవి గోపి.

గోపిగారు మానవతావాదంతో వృద్ధులను, వారి మనోభావాలను కవితా వస్తువుగా ఎంచుకొని గొప్ప అనుభూతివాద కవితా రూపంలో చిత్రించారు. 'వృద్ధోపనిషత్' కావ్యంలో ప్రతీ కవితలో భావుకతను ప్రసరింపజేస్తూ అనుభూతివాదం, మానవతావాద దృష్టికోణంలో వృద్ధ జీవిత వ్యధలను, గాధలను, వారికి కావాల్సిన చైతన్యాన్ని తెలియపరుస్తూ **"పాపం శరీరం"** కవితో ఇలా అన్నారు

[29] ఆధునిక కవిత్వంలో మానవతావాదం – విభిన్న ధోరణులు. జి. అరుణకుమారి. పుట. 04

'నేను బయటికి రావడం
సబబు కాదు.
మళ్ళీ ప్రవేశించి
అతనికి ధైర్యం నూరిపోస్తాను.
శరీరం కేవలం
ఎముకల సంచి కాదని
సంచిత ఐతిహాసిక ప్రకాశమనీ
ఎరుకపరుస్తాను.
మరణం ఒక భూతం కాదని
వొట్టి గాలి సరుకని విశదపరుస్తాను'. (పుట : 34)

అంటూ కవిలోని మానవతా దృష్టి బయటపడితే కాని ఇలాంటి వాక్య ప్రయోగం రాదు. కవి ఇక్కడ వృద్ధులకు భరోసా ఇస్తూనే ప్రాణం అంటే భయం ఉండకూడదనే అభయాన్ని ఇస్తున్నారు.

### 3.2.6. ప్రశ్నార్థకాలు

'వృద్ధోపనిషత్' కావ్యంలో అక్కడక్కడా కొన్ని ప్రశ్నార్థకాలు కనిపిస్తున్నాయి. కవితా పంక్తులలో వచ్చే ప్రశ్నార్థకాలు చదివే సహృదయ పాఠకుడిలో సమాజంపట్ల, వృద్ధులపట్ల ఒక ఆలోచన, అవగాహనను తలెత్తేల చేస్తుంది.

**"ముది మది"** కవితలో గోపిగారు ప్రయోగించిన ప్రశ్నార్థకాన్ని గమనిస్తే..

ఇప్పుడు చెప్పండి
ఇంతకూ నేనెవరు? (పుట : 46)

పై కవితా పంక్తులలో కవి ఆరంభం నుంచి వృద్ధాప్య జీవితంలో ఎదురయ్యే శారీరక, మానసిక సమస్యలను గురించి వివరిస్తూ కవితా ముగింపులో ఇవన్నీ తెలియజేస్తున్నాను కాని ఇంతకు నేనెవర్ని? అనే ప్రశ్నను సంధించి అందులోనే నిగూఢంగా సమాధానాన్ని తెలియజేశారు.

ఈ ప్రశ్నకు సమాధానం ఈ లక్షణాలు అన్నీ నాలో కనిపిస్తున్నాయి కాబట్టే నేను 'వృద్ధుడిని' అనే అర్థం స్ఫురింపజేశారు.

**"మునిమనుమరాలితో ముత్తాత ముచ్చట్లు"** కవితలో రెండుచోట్ల ప్రశ్నార్థకాలను సంధించాడు.

'అమెరికాలో
కవిత్వాన్ని ఆదరిస్తారా? (పుట : 72)

ఇక్కడ ఈ పై పంక్తులలో కవి తెలుగుదేశంలో తెలుగు ప్రజలు తెలుగు సాహిత్యాన్ని ఆదరించినంతగా అమెరికాలో ఎవరైనా సాహిత్యాన్ని ఆదరిస్తారా, అసలు అమెరికాలో కవిత్వమనేది ఉన్నదా అనే ప్రశ్నార్థకాన్ని ప్రయోగించి, తెలుగు సాహిత్యమంతటి గొప్ప సాహిత్యం రాలేదనే సమాధానం వచ్చేలా కవితా రచన కొనసాగించారు.

'ఇంట్లో
ఇంతమంది ఉన్నారు
వారితో నీ సంబంధాలు ఎలా ఉన్నాయి? (పుట : 73)

పై కవితా వాక్యాలలోని భావన నేటి సమాజంలో ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్న తరుణంలో వృద్ధాప్య జీవితం దుర్భరంగా తయ్యారయ్యింది. ఇలాంటి సందర్భంలో ఇంట్లో అంతా సవ్యంగానే ఉందా అంటూ వృద్ధాప్యానికి ఒక ప్రశ్నను సంధించాడు.

ఈ విధంగా గోపిగారు వారి రచనా శైలిని విభిన్న పార్శ్వాలలో ప్రదర్శిస్తూ 'వృద్ధోపనిషత్' కావ్యాన్ని రచించి నేటి సమాజంలో జరుగుతున్న సంఘటనలను తెలియజేస్తూ పాఠకలోకంలో నూతన చైతన్యాన్ని తీసుకొచ్చి, నిరుత్సాహ స్థితిలో ఉన్న వృద్ధుల జీవితాలలో వెలుగులునింపే ప్రయత్నం చేశారు.

# నాల్గవ అధ్యాయం

# వృద్ధోపనిషత్ కవి సందేశం

## 4.0. పరిచయం

పుట్టిన ప్రతి ప్రాణి జీవిత ప్రయాణంలో వృద్ధాప్యమనేది ఒక మజిలీ. అదే జీవన సాఫల్యదశ. మనుషులలో కూడ అది ఒక సామాన్యమైన, ప్రకృతిసిద్ధమైన దశ. జన్మించిన ప్రతి వ్యక్తి శరీరం కాలంతోపాటు వికాసం చెందుతుంది. మనిషి ఎల్లకాలం పసిబాలుడుగా, నవ యౌవనుడుగా ఉండడమనేది జరగని పని, అది సృష్టికి విరుద్ధం కూడా. వయసు మీదపడే కొద్దీ శరీరంలో సామర్థ్యం తగ్గడం ప్రారంభమవుతుంది; వృద్ధాప్యం సంభవిస్తుంది. ఇది అతి సహజమైన పరిణామం. జీవిత చక్రంలో బాల్యం, యవ్వనం, వృద్ధాప్యమనే మూడు దశలనూ సహజ పరిణామాలుగానే స్వీకరించాలి.

జీవితంలోని ప్రతి దశలోనూ ఆనందంగా గడపాలని ప్రతి ఒక్కరూ అభిలాషిస్తారు. కానీ అన్ని దశలలో అది సాధ్యపడకపోవచ్చు. సమాజం వేగంగా పరిగెడుతుంది. అందరి కంటే నేనే ముందుండాలి. రేపటిని ఈ రోజే చూడాలి. ప్రపంచాన్ని గెలవాలనే లక్ష్యంతో అనేక మంది జీవితంలో నిరంతరం పరుగులు పెడుతునే ఉన్నారు. ఆ వేగంలో పడి జీవితాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. అయినవాళ్ళను కూడా పట్టించుకోకుండా బంధాలు, బంధుత్వాలను మరిచిపోతున్నారు. జీవితంలో వేగం ఉండాలి; కాని వేగమే జీవితం కాకూడదన్న విషయాన్ని గుర్తించడం లేదు. బాధల్లో, కష్టాల్లో ఉన్నప్పుడు మన వాళ్లు తోడుంటే ఆ ధైర్యమే వేరుగా ఉంటుంది. డబ్బు పోతే మళ్ళీ సంపాదించుకునే అవకాశం ఉంటుంది. కానీ బంధువులు, బాంధవ్యాలను తెంచుకుంటే తిరిగి రావని బంధాలకై కొంతైనా సమయం కేటాయించాలని కవి వివరించారు.

బతికిన వంద సంవత్సరాలు ఆరోగ్యంగా ఎలా జీవించాలో ఆయుర్వేద శాస్త్రమయిన యజుర్వేదంలో పేర్కొనడం జరిగింది.

**'తచ్చఛుర్దేవహితం పురస్తాచ్ఛుక్రముచ్చరత్ | పశ్యేమ శరదః శతం, జీవేమ శరదః శతమ్ శృణుయామ శరదః శతం, ప్రబ్రవామ శరదః శతమదీనాః స్యామ శరదః శతం, భూయశ్చ శరదః శతాత్॥ – (యజుర్వేదం 36/24)**

అనగా మనం వంద సంవత్సరాలకుపైగా జీవించాలి. మన కళ్లు, చెవులు, వాణి వంటి జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు అన్నీ అంతమయ్యేవరకు పనిచేయాలి.[30] మనిషి ఎంత ఆరోగ్యంగా ఉంటే వృద్ధాప్యం అంత ఆనందంగా గడపడానికి అవకాశం ఉంది.

వార్ధక్యాన్ని సుఖంగా గడపడానికి మొట్టమొదట చేయాల్సిన కర్తవ్యం వృద్ధాప్యాన్ని గురించిన భ్రమలు, అపోహలవలలో పడకుండా ఉండడం. యధార్థాన్నీ, వాస్తవిక పరిస్థితినీ వివేకంతో గుర్తించినప్పుడు వ్యక్తిలో సాహసం, ఆత్మవిశ్వాసం, భవిష్యత్తుపట్ల నమ్మకం ఏర్పడతాయి. అప్పుడే ఆశ, ఉత్సాహం, జీవం, జవం ఉరకలు వేస్తాయి. మనిషి పుట్టి, పెరిగి, యవ్వనంలో ఎన్నో బాధ్యతలు మోస్తూ చివరికి వృద్ధాప్య దశకు చేరుకున్నాక నిస్సహాయతకు గురికావడమనేది విచారించ దగ్గ విషయం. కుమారులు, కూతుళ్ళంటూ వారి జీవితాలకు బాట చూపించి, మనవళ్లు, మనవరాళ్లతో కబుర్లు చెబుతూ గడిపే సమయం వృద్ధాప్యం. ఆ వయసు వచ్చినా కూడా వారి ఆలోచనలు అంతాకూడా వారసుల గురించే, వారికి ఏ కష్టం రాకూడదని, జీవితాంతం హాయిగా ఉండాలని పరితపిస్తుంటారు. ఆ ఆరాటంలో కొన్ని విషయాల్లో తలదూరుస్తూ మార్గ నిర్దేశం చేయడానికి ప్రయత్నిస్తూ, అనుకున్నది చెప్పేస్తుంటారు. చాలా మందికి వృద్ధాప్య దశలో ఉన్న తల్లిదండ్రులు ఇచ్చే సలహాలు నచ్చవు. సంతానం వారిని ఇంట్లో నిరుపయోగంగా ఉన్న ఒక వస్తువులా భావిస్తూ వారి జీవితకాల అనుభవ జ్ఞానాన్ని స్వీకరించే ప్రయత్నం చేయరు. ఇది వృద్ధులకు శాపం లాంటిదనే చెప్పాలి.

పిల్లలు తమను పలకరించాలని, తమతో కొంత సమయం గడపాలని పెద్దవారు కోరుకుంటారు. కానీ మారుతున్న కాలం, వేగవంతమైన జీవన విధానం వారిని తెరచాటుకు

---

[30] వృద్ధాప్యం జీవిత నవనీతం– ప్రకాశకులు గాయత్రి చేతన మరియు ధ్యాన కేంద్రం, హైదరాబాదు. పుట. 11.

నెట్టేస్తున్నాయి. వారి త్యాగాలపై నిర్మించుకున్న జీవితాల్లో వారికే చోటు దొరకడం లేదు. ఊతకర్రల సాయంతో నడివీధుల్లో తిరుగుతున్న అభాగ్యులు ఎందరో..! ఒక్కపూట అన్నం పెట్టలేక, ఆలనా పాలన చూడలేక కొంతమంది అయితే వృద్ధులను ఆశ్రమాల్లో వదిలేస్తున్నారు. ఈ 'వృద్ధోపనిషత్' కావ్యం ద్వారా కవి వృద్ధుల పట్ల జరుగుతున్నటువంటి నిరాదరణను తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నారు. వృద్ధాప్యాన్ని దైన్యంతో కాక ఒకానొక చైతన్యంతో అధిగమించవచ్చన్న భావనను కలిగిస్తున్నారు. దాంతోపాటు నేటి యువతరం వృద్ధులను కొంతైనా అర్థం చేసుకోవాలని కాంక్షిస్తున్నారు. అందుకే "విలువైన జీవితానుభవాల కవిత్వం వృద్ధోపనిషత్"[31] అని మెట్ట నాగేశ్వరరావు పలికారు.

వాల్మీకి రామాయణంలోని అయోధ్య కాండలో శ్రీరాముడు భరతునికి మృత్యువు గురించి బోధించే క్రమంలో ఈ విధంగా అన్నాడు, 'తథైవ సీదంతి నరా జరా మృత్యు వశం గతా:'[32] "అత్యంత ధృఢమైన స్తంభాలతో నిర్మితమైన ఎంతటి పటిష్ఠ భవనమైన కాలాంతరంలో శిథిలం కావడం సహజం. డబ్బెంత కూడబెట్టినా చివరికి ఖర్చయిపోయేదే. ఎంతెంత గొప్ప గొప్ప పదవుల్లో వుండినా చివరికి పడిపోవలసిందే. ఎంత కలిసిపోయినా చివరికి విడిపోవలసిందే. ఎంత బతుకు బతికినా చివరికి మృతి పొందవలసిందే. చక్కగా మగ్గిన పళ్ళకు పడిపోవడం తప్ప మరోభయం లేనట్టే, పుట్టినవానికి చనిపోవడం తప్ప మరో భయం లేదని గ్రహించాలి. సముద్రంలో కలిసిన నది మళ్ళీ వెనక్కి ఏ విధంగా అయితే మళ్ళదో అలాగే, గతించిన రాత్రి కూడా మళ్ళీ వెనక్కి రాదు". మానవులు కూడా ముసలివారైన తరువాత యవ్వనం మళ్ళీ తిరిగి రాదు. ఏదో ఒక రోజు మరణించడం సహజమని శ్రీరామచంద్రుడు సోదరుడు భరతునితో అన్న మాటలు నిత్యసత్యాలు. అయితే ఉన్నంత కాలం భవనాన్ని కాపాడుకున్నట్లే మానవ మనుగడ సుఖంగా సాగాలన్న పరమార్థమూ ఆయన పలుకులలో దాగి ఉందని గమనించాలి.

---

[31] నిరంతర. డా. ఎన్. గోపి సప్తతి సందర్భం, ఎస్. రఘు సంపాదకత్వం. అథర్వ, అభవ్ ప్రచురణలు, హైదరాబాద్. 2022. పుట. 269.

[32] శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, వాల్మీకి మహర్షి విరచితం రామాయణం. అయోధ్య కాండ. ప్రతిభ పబ్లికేషన్స్, హైదరాబాదు. 2005. పుట. 196.

'భూమేర్ గరీయసీ మాతా/స్వర్గం దుచ్చతరం పితా:' భూమి కంటే తల్లి గొప్ప, స్వర్గం కంటే తండ్రి గొప్ప అని ఆర్యోక్తి. తల్లిదండ్రులు, గురువులు అత్యున్నతమైన శిక్షణ ఇస్తే ఆ సంతానం సమర్థమైన జాతిగా తయార వుతుందని అని శతపథ బ్రాహ్మణం బోధిస్తోంది.

"Old age is not a disease – it is strength and survivorship, triumph over all kinds of vicissitudes. and disappointments, trials and illnesses." (Samuel Johnson)

"వృద్ధాప్యం అనేది ఒక వ్యాధి కాదు. అది మనిషి మనుగడకు బలం. అన్ని రకాల ఒడిదుడుకులను ఎదుర్కొని ఆరోగ్య సమస్యలపై విజయం సాధించాలని" శామ్యూల్ జాన్సన్ పలికిన వాక్యాలు గోపి గారు 'వృద్ధోపనిషత్' కావ్యం ద్వారా వృద్ధాప్యం జీవితానికి నవనీతమని, దానిని శాపంగా భావించకండి అని ఇస్తున్న సందేశం ఒకే విధంగా ఉన్నాయనీ చెప్పవచ్చు. ఇద్దరు కూడా వృద్ధాప్యం అనే భావనను జయించి అనందంగా జీవితాన్ని ముగించమని తెలుపుతున్నారు.

కవి వృద్ధాప్యాన్ని ఒడువని కథగా, తీరని వ్యధగా పేర్కొన్నప్పటికి ఆ శేష దశలో నిరాశ చెందకుండా ఉన్న కాస్త జీవితకాలంలో మృత్యువును సహజ ప్రక్రియగా స్వీకరిస్తూ ఆనందంగా కాలం ఎల్లదీయమంటాడు. "వృద్ధులు మారుతున్న దశతోపాటు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తాను మారడానికి ప్రయత్నిస్తే, వ్యక్తి తన గత జీవితం అంతటిలో పొందనంతటి ఆనందాన్ని వార్ధక్యంలో పొందగలుగుతాడు"[33]. గోపి కూడా వృద్ధులంటే జ్ఞాన వృద్ధికి తోడ్పడుతూ, మార్గనిర్దేశం చేసేవారుగా ఉండాలని వివరించారు. అంటే వృద్ధుడు నేటి యువతరంలో మమేకమై భవిష్యత్ తరాలకు మార్గదర్శం కావాలంటున్నాడు.

వృద్ధులనేవారు సంపూర్ణ జీవితానికి నిలువెత్తు నిదర్శనాలు. కుటుంబ వ్యవస్థకు ఆయువు పట్టు, వార్ధక్యమనేది మనిషి జీవితంలో చివరి దశ అయినప్పటకీ అది జీవన సారాంశ దశ.

[33] వృద్ధాప్యం జీవిత నవనీతం– ప్రకాశకులు గాయత్రి చేతన మరియు ధ్యాన కేంద్రం, హైదరాబాదు. పుట 2

వృద్ధులు వారి జీవితానుభవం ద్వారా తరువాత తరాలకు జ్ఞానాన్ని ప్రసాదిస్తూ, మార్గదర్శకంగా నిలిచేవారని ప్రతి కవితలో కవి వృద్ధుల నూతన తేజస్సును కాంక్షించారు. దీనికి ఉదాహరణగా **"వృద్ధుడు"** కవితలో చెప్పిన వాక్యాలు.

'వృద్ధుడంటే
ముసలివాడు కాదు
వృద్ధి పొందిన వాడు'. (పుట : 13)

అంటూ యువతరం, వృద్ధులను గౌరవించాలానే భావనను కలుగజేస్తున్నారు. వృద్ధి వయసులో మాత్రమే కాదు అనుభవ పరిణతిలో కూడా ఉంటుందని, సంసారమనే మహాసాగరాన్ని ఈది, శిగి పొదలు నిండిన భయానక అరణ్యంలో తరువాత తరాలకు పిల్లబాటలను చెక్కడంలో కూడా ఆ వృద్ధిని గమనించవచ్చని తెలిపారు. వృద్ధులే జీవన వేదికపై తల్లి, తండ్రి, తాతా, గురువుల పాత్రలు నిర్వహించి మన జీవితాలను సరైన మార్గంలో ప్రయాణించేలా చేసిన సిద్ధ పురుషులని అందుకైనా వారిని నేటి తరం భారంగా కాకుండా తమలో భాగంగా, వారికి ఆధారంగా చేసుకోవాలన్నారు. ఈ 'వృద్ధోపనిషత్' అనే కావ్యం మూలంగా ఈ రోజైన కాసేపు వృద్ధులను తలుచుకుని మసకబారిన మన వెలుగులో కొత్త ప్రకాశాలు మొలుస్తాయేమో చుద్దామంటూ వృద్ధాప్యం యొక్క చింతన చిత్రిస్తూనే యువతరం వృద్ధులను కొంతైనా అర్థం చేసుకోవాలని ఆకాంక్షిస్తూ వృద్ధుల జీవితాలలో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నారు గోపి.

ఆధునికత పేరుతో, సాఫ్ట్ వేర్ ప్రపంచ మోహంలోపడి మసకబారిపోయిన మనసులలో మనుషుల పట్ల చూపించాల్సిన ప్రేమను చిగురింపజేసే ప్రయత్నం చేస్తున్నారు. 'మూడు ప్రపంచాలు' కవితలో మనిషి జీవితంలోని బాల్యం, యవ్వనం, వృద్ధాప్యమనే మూడు దశలను వివరిస్తూ మొదట వృద్ధాపాన్ని చల్లారిన పాలగిన్నెతో పోల్చిన కవి చివరి పంక్తులకు వచ్చేసరికి వృద్ధాప్యం చల్లారిన పాలగిన్నె కాదు, వృద్ధాప్యమనేది ఒడువని ఆత్మకథ అని, వృద్ధాప్యం అనుభవాల తేజస్సని వృద్ధ జీవులలో వృద్ధిని పెంచే వాక్యాలతో పాఠక హృదయాలలో ఆలోచనను

రేకెత్తించారు. వృద్ధాప్యమనేది ఒక ఒడువని ఆత్మకత అంటారు. ఎందుకంటే వృద్ధాప్యం అనేది చెట్టుకు ఏ విధంగా అయితే పండుటాకులు  రాలిపోయి వసంతంలో నూతన తేజస్సుతో ఎలా అయితే చిగురిస్తుందో వృద్ధాప్యం కూడా జీవిత అనుభావాల జ్ఞానంతో నూతన తేజస్సు పొంది నిత్య నూతనంగా మారాలంటున్నారు. అందుకే **"వృద్ధాప్య ప్రవేశం"** కవితలో గోపి గారు ఈ విధంగా వృద్ధాప్యాన్ని గురించి ఇలా అన్నారు.

'దీనితో పేచీ పడొద్దు

స్నేహంగా ఆహ్వానిద్దాం.'                (పుట : 20)

అంటున్నారు. అనివార్యమైన మరణానికి ఎందుకు భయపడాలి? దాన్ని స్వాగతించడానికై నిండు మనసుతో సిద్ధపడండి. వృద్ధాప్యాన్ని సగౌరవంగా ఆహ్వానించి, సంతోషంగా గడపాలని భావిస్తున్నారు. వయసు మళ్ళిన జీవితంలో సోగసుకు తావుండదు. వయసు పెరిగేకొద్ది నడక మందగించడం, శరీరంలో శక్తి నశించిపోవడం సహజం. మరణమంటే భయమెందుకు? చావుని గురించి ఎప్పుడూ ఏడవడం ఎందుకు? వాస్తవానికి మనం మరణానికి స్వాగత సన్నాహాలు చేయాలి. మన సంకుచిత పాప కర్మలు నశించడానికీ, పుణ్య కర్మలను పెంచడానికీ శేష జీవితాన్ని సద్వినియోగపరచుకోవాలని వివరిస్తూ, నాకు ఈ వృద్ధాప్యం ఎందుకు వచ్చింది, దేవుడు నన్ను తొందరగా తీసుకుపోతే బాగుండె అని దిగులు చెందకుండా వృద్ధాప్యాన్ని ఇష్టపూర్వకంగా ఆహ్వానించాలని కవి ఈ కవిత ద్వారా సందేశం ఇస్తున్నారు.

కుటుంబంలో పెద్దలను ఏ విధంగా గౌరవించాలనే  విషయాలను తెలియజేస్తూ కుటుంబ సభ్యులు తల్లిని ఏ విధంగా చూసుకోవాలి, వృద్ధ తల్లికి అందించాల్సిన కనీస సేవలు గురించి వివరించి, బ్రతికుండాగానే తల్లి రుణం తీర్చుకో ఆమె మరణిస్తే మళ్ళీ నీవు కావాలన్న నీ తల్లి నీ దగ్గర ఉండదంటూ **"అమ్మ ఒక మనిషి"** కవితలో ఈ విధంగా వివరించారు.

'కొంచెం ఓపిక పట్టాలి

ముసల్ది

నా పాల బడ్డదని అనుకోవద్దు.

కొంచెం ఆలోచించాలి.

'అమ్మ రా' అని

సెంటిమెంటును రాజెయ్యను

'రుణం రా' అని

నీ కర్థం కాని అనుబంధాన్ని ఆవిష్కరించను' (పుట : 26)

అంటూ నేటితరం యువతలో మానవతా విలువలను పెంచేలా కవిత్వాన్ని రాసారు గోపి. ఇక్కడ వృద్ధ తల్లి దీన స్థితిని వివరిస్తూనే ఆ తల్లికి కుటుంబం అందిచాల్సిన చేయూత ఏమిటన్న విషయాన్ని అందరికి అర్థమయ్యే సులభమైనా శైలిలో వ్యక్తీకరించారు. మరలా

"రేపటి అపరాధభావం

నిన్ను మెలి పెడుతుంటే మాత్రం

ఓదార్చటానికి ఆమె ఉండదు." (పుట : 27)

అంటూ హెచ్చరిస్తారు. తర్కవితర్కాల మర్మాన్ని ఒక జాగ్రత్తలో పడేస్తారు. ఏమో రేపు నీకు ఇదే గతి పట్టవచ్చన్న నిజాన్ని, అదే అబద్ధంగా చేసి చూపిస్తున్నాడు. అసహ్యాభావాల, కసిరింతల , చీదరింపుల నుండి నిన్ను పక్కకు లాగి, మరో దృశ్యాన్ని చూపబోయేముందు ' అమ్మ ఒక మనిషి' అని గుర్తుంచుకుంటే చాలనే విషయాన్ని ఉద్భోధిస్తారు .

మరో కవితలో తల్లిపై అపారమైన ప్రేమ కల్గిన సంతానం యొక్క ఆవేదన ఎలా ఉంటుందో తెలిపారు. జీవన పర్యంతం తనతల్లి చేసిన కార్యాలకు, సేవలను గుర్తించిన కుమారుడు, కూతురు తల్లి మరణించినప్పుడు పొందే రోదనను, వేదనను ఎంతో హృదయవిదారకంగా చిత్రించాడు. అదే **"మరణ సందర్భం"** కవిత. ఈ కవితలో ముగింపుకు వచ్చే సరికి కాలాన్ని కన్నీరుగా చేసుకొని రాసిన హృదయావేదనకరంగా తల్లి మరణ సందర్భానికి ఏ ఆటంకం రాకుండా పంచభూతాలను ప్రార్థించే క్రమాన్ని ఒక కన్నీటి కావ్యంగా రూపొందించాడు. నిజంగా ప్రతి మనిషి తల్లి మరణ సందర్భంలో పొందే వేదన ఎలా ఉంటుందో ఈ కవితలో చూపించారు. ఇందులో వర్షాన్ని,

మేఘాన్ని, గాలిని, నదిని మొదలైన ప్రకృతి సంబంధమైన ప్రవాహాన్ని హృదయ వేదనతో అర్థించి, తన తల్లి మరణ సందర్భాన్ని సఫలం చేయమని కోరిన కోరిక కనిపిస్తుంది. ఈ కవితలో అడుగడుగునా తల్లి పట్ల అపారమైన ప్రేమ కలిగిన పుత్రుని శోకాన్ని చిత్రించారు.

## 4.1. నిరాశ నిస్పృహలను జయించడం

సంపూర్ణమైన జీవితం అంటే ఒక సముద్ర ఘోష లాంటిది.! ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా నిలదొక్కుకొని నిలకడగా సంసారమనే బండిని లాగేవారిని సముద్రునితో పోలుస్తారు. భూగర్భ వాతావరణాన్ని బట్టి, తుఫానులు, సైక్లోన్లు, హరికేన్లు, తీవ్ర కెరటాలు, వాయుగుండాలు, ఉప్పెనలు ఎన్ని వచ్చినా, ఆకాశం ఎంత గర్జించినా తట్టుకొని తన మనో నిబ్బరాన్ని సముద్రం చూపినట్టే, మనుషులు కూడా రక్త సంబంధీకులనే సంసార చక్రబంధంలో అన్ని భావోద్వేగాలను, ఆటుపోట్లను తట్టుకొని నిలబడి తనువు చాలించినప్పుడు సముద్రం అనే సంసార సాగరాన్ని ఈదిన సంపూర్ణ వ్యక్తిగా ప్రశంసిస్తారు.

సాధారణంగా వృద్ధాప్యంలో ప్రతి వ్యక్తి నిరాశ, నిస్పృహలకు లోనవుతుంటారు. అంతవరకు ఎంతో చురుగ్గా తిరుగుతూ అందరినీ శాసించినవారు క్రమంగా నిస్సహాయత ఆవరించడంతో ఏ పని చేసుకోలేక తమలో తాము మదనపడుతుంటారు. అలాగే వయసు పెరిగే కొద్దీ వచ్చే దీర్ఘకాలిక వ్యాధులు కూడా నిరశా నిస్పృహలకు దారి తీస్తాయి. నిరాశ నిస్పృహలను అధిగమించేందుకు జీవన శైలిలో మార్పులు చేసుకోవడం, కుటుంబం, స్నేహితుల సాయంతో ఉల్లాసంగా గడపడం, ఏదో ఒక వ్యాపకం పెట్టుకోవడం ద్వారా నిరాశవాద ఛాయలు మనసులోకి రాకుండా చేయవచ్చు. ఆ వ్యాపకాలు ఏమిటో కూడా కవి తెలిపారు. **"జ్ఞాని, జీవించే కళ"** కవితలలో వృద్ధాప్య జీవితంలో ఉత్తేజం నింపే ప్రయత్నం చేస్తున్నారు.

"అతడు
ప్రతిక్షణం జీవిస్తాడు.
గతంలోకి రాలుతున్న

కాలం ఆకులను
ముచ్చటగా గమనిస్తాడు.
మమకారాల చెట్టుకు
కొత్తపూలు పూయిస్తాడు
దేనికీ భయపడ్డట్టు కనపడదు
ఇంత శాంతి అతడు
ఎక్కడి నుండి పొందుతాడో తెలియదు." (పుట : 61)

అంటూ తొంభై సంవత్సరాల ప్రాయంలో కూడా జీవితాన్ని ఆనందంగా గడిపే క్షణాలు ఏ విధంగా ఉంటాయో వాటికి కారణాలేమిటి అన్న విషయాన్ని ఈ కవితలో వివరించాడు. గడిచిపోతున్న కాలాన్ని గమనించకుండా గడిచిన కాలంలో దాగిన మధుర స్మృతులను స్వీకరించి భవిష్యత్ కాలానికి వాటిని ఉపయోగించుకోవాలంటున్నాడు కవి. కాటికి చేరే గమ్యం దగ్గర్లోనే ఉన్న జీవితాన్ని ప్రేమించి మరణాన్ని జయించమంటున్నాడు. ఈ కవిత డెబ్బై నుండి తొంభై సంవత్సరాలు పైబడిన వృద్ధులలో నిరాశను తొలగించి జీవితంపై ఆశను చిగురింపజేస్తుందని చెప్పవచ్చు. ఈ కవిత చదివే పాఠకుడికి ఒక తాత్విక సందేశంగా తోస్తుంది.

రోజులు గడిచే కొద్ది మనిషిలో ఆవేదన పెరుగుతుంది. సమయం గడుస్తున్న కొద్ది జీవితకాలం దగ్గర పడుతుంది. ఈ సందర్భంలో వృద్ధులలో కలిగే ఆలోచన వేరే విధంగా ఉంటుంది. అదే విషయాన్ని కొంత చైతన్యం కలిగించే విధంగా కవి **"శేషజీవితం"** అనే కవితలో చివరి దశకు చేరుకున్నాక పొందిన పరిణతిని వివరించాడు.

'శేషజీవితం కాదిది
అశేష అనుభూతుల నిధి.
శేష జీవితం కాదిది.
స్నేహజీవితానికి నాంది.' (పుట : 79)

అంటూ వృద్ధాప్య జీవితం చేరువయ్యే కొద్ది మనిషి అనుభవించాల్సిన సంతోషకరమైన విషయాలను గురించి వివరించాడు. జీవితమంతా పరుగులు తీశారు. ఆ ప్రయాణంలో ఎన్నో అనుభూతులను కప్పిపుచ్చుకున్నారు. ఈ శేషజీవితంలో ఆ అనుభూతుల మూటను విప్పి తోటివారితో స్నేహ పూర్వకంగా, ఆనందదాయకంగా గడపమని తెలుపుతున్నారు. ఈ దశ చివరిదే అయినా జీవిత సాఫల్య ప్రదేశమిది అంటున్నారు. దేహంలో ఉడుకు రక్తం చల్లబడిందని బాధపడకుండా వెన్నెల రూపంలో మనసులో దాగిన చల్లదనాన్ని, ప్రశాంతతను నలుగురితో పంచుకుంటూ ముక్తి పొందాలంటున్నాడు.

'వృద్ధాప్యం ఒక మజిలి
అదొక కొత్త జాబిలి అనీ
దాని వెన్నెలపై
కవిత్వం రాయాలనుకోవడం మాత్రం
ఒక సుందరమైన వాస్తవం' (పుట : 82)

అని జీవితంలోని చివరి మజిలి అయిన వృద్ధాప్యాన్ని గురించి **"వయోధిక సృహా"** అనే కవితలో వివరించాడు కవి. జీవితంలోని ఈ చివరి మజిలి మనలోని కొత్త జాబిలి అంటూ ప్రతీకారాత్మక ధోరణిలో మనిషి వృద్ధాప్య జీవితంలో గడపాల్సిన క్షణాలను నిశీధిలోని ఉషస్సుతో పోల్చి చెప్పారు.

## 4.2. చిరకీర్తికై పాటుపడడం

సమాజంలో స్మశాన వైరాగ్యాలను ప్రదర్శించే వృద్ధులు చాలా మంది నిజ జీవితంలో మనకు తారస పడతారు! "ఏమీ తీసుకు రాలేదు... ఏమీ తీసుకుపోలేదు" అనే మాట వారి నుంచి పదే పదే వినిపిస్తుంది.! సముద్రానికి మనిషికి ఎన్నో పోలికలున్నాయని చెప్పవచ్చు. సముద్రం తనంతట తాను ఆవిరై వాతావరణంలోకి మేఘంగా మారుతుంది. ఆ మేఘం భూమి మీద వర్షంగా మారుతుంది. అదే నీరు హిమాయలయాల్లో ఘనీభవించి మంచుగా మారుతుంది,

తరువాత హిమానీనదం అవుతుంది. ఆపై అది కరిగి గంగ యమునా మొదలైన నదులుగా రూపాంతరం చెందుతుంది.

మనిషి జీవితం కూడా అంతే! ఈ సాపేక్ష ప్రపంచంలో భ్రమ అయిన జీవితంలో తాను పొందిన భౌతిక జ్ఞానాన్ని తన వారసులకు పంచాలి... అది వారిని సన్మార్గం వైపు నడిపించాలి... పవిత్ర నదులన్ని సాగరంలో కలిసే ముందు పంటలను, భూమిని ఏ విధంగా అయితే సస్యశ్యామలం చేసి సిరులు పండిస్తున్నాయో! మనిషి జీవితం కూడా ఒక విజ్ఞాన ఖని, తనలోని మేధస్సును ఒక దీపంగా పంచి పరులకు వెలుగునిచ్చినప్పుడే సంపూర్ణ మానవుడై చిరకీర్తి పొందుతాడు. కానీ జనం స్వార్థపరులై, సంకుచితులై, వయసు మళ్ళిన తర్వాత కూడా కుటుంబానికీ, సంతానానికీ తమ శక్తి సామర్థ్యాలను వినియోగించడం ప్రారంభించిన నాటినుండి ఉదాత్త భావనతో లోకకళ్యాణం కోసం కృషిచేసే ప్రజాసేవకులు లేకుండాపోయారు. ఆ చివరి దశనైనా సమాజ శ్రేయస్సుకై వినియోగించినట్లయితే దేశం సంపన్నంగా, సంస్కారయుతంగా తయారవుతుంది.

అందుకే కవి వార్ధక్య జీవితాన్ని చిరకీర్తి పొందడానికి సమర్పించమన్నాడు. "జనం స్వార్థపరులై, సంకుచితులై, వయసు మళ్ళిన తర్వాత కూడా కుటుంబానికీ, సంతానానికీ తమ శక్తి సామర్థ్యాలను వినియోగించడం ప్రారంభించిన నాటినుండి ఉదాత్త భావనతో లోక కళ్యాణంకోసం కృషిచేసే ప్రజాసేవకులు లభ్యం కావడం లేదని"[34] ఎంతో మంది విశ్లేషకులు భావిస్తున్నారు. కవి గోపి ఈ కవితా సంపుటికి "వృద్ధోపనిషత్" అని శీర్షిక పెట్టడంలో ఏంతో సమయస్ఫూర్తిని ప్రదర్శించాడు. నిజానికి ఈ సంపుటికి ఈ పేరును సమర్థించవలసిన విషయం.

ఇంత ప్రశాంతమైన వృద్ధాప్యంపై కవిత్వం రాయడం సుందరమైన వాస్తవంగా నిలిచి తర్వాత తరాలకు దారిని చూపుతుందనడంలో సందేహం లేదు. వృద్ధుల అనుభవాన్ని, మేధస్సును నడిచి వచ్చిన సమాజపు తరగని గనిగా భావించడమే కాదు, గౌరవించాలి. తగు రీతిలో వారికి

[34] వృద్ధాప్యం జీవిత నవనీతం– ప్రకాశకులు గాయత్రి చేతన మరియు ధ్యాన కేంద్రం, హైదరాబాదు. పుట. 3

సామాజిక గౌరవం, ప్రాధాన్యమిచ్చి పోషించి సరికొత్త మానవ సంబంధాలు, అనుబంధాలకు కొత్త దారులు వేయాలని ఆశిస్తున్నారు. చివరగా జీవన పరమార్థం తెలుసుకున్న వ్యక్తి ఎలా ఉంటాడో రామాయణంలో రాముడు భరతునితో అయోధ్య కాండలో ఇలా చెప్పాడు.

**"దార నిలిచిపోవు గృహ**
**ద్వారముకడ, పుత్రమిత్రబాంధవ్యంబుల్**
**దీరు జితితో, ధర్మమె**
**వారక తోడగు నరునకు బరలోకగతిన్."**[35]

సముద్రంలో కొట్టుకువచ్చిన కర్రలు ఏదో ఒకప్పుడు కలుస్తాయి, మరొకప్పుడు విడిపోతాయి. అలాగే భార్యలూ, పుత్రులూ, జ్ఞాతులూ, ధనమూ ఒక్కొక్కప్పుడు కలుసుకోవడమూ, మరొక్కప్పుడు విడిపోవడమూ జరుగుతూ వుంటుంది. ఎటుచూసినా దేనికదే గాని కలిసివుండడం లేనేలేదు. కోరిందల్లా సాధ్యపడదు. కనుక ఎంత దుఃఖించినా చనిపోయినవారు మళ్ళీ బతకడు. నువ్వు మరణించిన తర్వాత కూడా నీ వెంటవచ్చేది నీ ధర్మమే, నీ కీర్తే అన్నాడు.

మనిషనేవాడు ఎన్ని ఆస్తులు సంపాదించినా, మేడలు మిద్దెలు కట్టి రాజభోగాలు అనుభవించినా అవన్నీ బ్రతికున్నంత వరకే, నీవు మరణించిన తర్వాత నీ వెంట ఏవిరావు. నీవు బ్రతికినంత కాలం ఎంత మందికి ఆదర్శంగా నిలిచావు? ఎంత మందిని ఆదర్శులుగా తీర్చిదిద్దావన్నదే ప్రధానం, నీవు సమాజంలో పొందిన కీర్తి ఎలాంటిది? అనేదే నీవు మరణించిన తర్వాత కూడా మానుషుల హృదయాలలో నిన్ను సజీవంగా ఉంచుతుంది. అప్పుడే నీ జీవితం నలుగురికి ఆదర్శంగా నిలుస్తుందంటున్నాడు కవి. ఈ శేషజీవితంలోనైనా నీ జీవితం సాఫల్యం పొందేలా చేసుకుని చిరకీర్తి పొందమని కవి వృద్ధులకు బోధిస్తున్నాడు. అదే **"చిరకీర్తి"** అనే కవితలో...

[35] శ్రీరామకథాకందము అయోధ్యకాండ (పద్యకావ్యము), యడవల్లి వీరరాఘవస్వామి, శుక్ల వైషకము. 1989, గాయత్రీ ఆర్ట్ ప్రింటర్సు, హైదరాబాదు. పుట. 304.

'హృదయాల్లో ఉండటమంటే

ప్రేమను పంచటమే.

స్వీయజీవితాన్ని మీరి

అన్యుల జీవితాల్లో

వెలుగులు నింపటమే.' (పుట : 87)

అదే నీ కీర్తిని పది కాలాలపాటు కాపాడుతుందన్నాడు. మనం ఒకరికి చేసిన ఉపకారం ఒట్టిగా పోదు. అదే మనకు ఏదో ఒక రోజు దేవుని రూపంలో మనల్ని కాపాడుతుందన్న విషయాన్ని కవి ఎంతో అద్భుతంగా తెలిపాడు. వ్యక్తి పుట్టినప్పటినుండి వార్ధక్యం వరకు ఎలాంటి కార్యాలు చేయాలో ప్రాచీన గ్రంథాలు భోదిస్తున్నాయి 'బ్రహ్మచర్య జీవితంలో వ్యక్తి విద్యాధ్యయనం చేయాలి. ఆ తర్వాత గృహస్థ జీవితంలో వ్యక్తి కుటుంబాన్ని ఏర్పరచుకోవాలి. సంపదను ఆర్జించాలి. సమాజపు భౌతిక ప్రగతికి దోహదం చేయ్యాలి. సంపాదించిన దానిలో కొంత భాగాన్ని ప్రజోపయోగ కార్యాలకు వినియోగించాలి. ఆ తర్వాత జీవితపు మలి సగాన్ని పారమార్థిక ప్రయోజనాల కోసం కేటాయించాలి. వానప్రస్థ, సన్యాస వ్యవస్థ ఇందుకోసం ఏర్పరచబడింది"[36] అని చెప్పబడింది. గోపి కూడా వ్యక్తి జీవితంలో చేపట్టిన కార్యాలన్నీ కూడా కవితలుగా మారి చిరకాలం పరిమళించాలని, జీవితంలో ఇప్పటివరకు పొందిన గుర్తింపు ఏమి లేదంటే ఇకనైనా నీ కీర్తి నలుదిక్కులు విస్తరించేలా, దేశ నలుమూలల పాకేల పుణ్యకార్యాలు చేయమంటూ హితవు భోధిస్తున్నాడు.

'వ్యక్తి చనిపోవచ్చు

కానీ

మనిషి మాత్రం మిగిలిపోతాడు'. (పుట : 88)

పై వాక్యాలు అక్షర సత్యాలు. ఈ వాక్యాలలో ఒక తాత్విక దృక్పథం బోధపడుతుంది. ఎంత కాలం బ్రతికావన్న ది కాదు ఎలా బ్రతికావన్నదే ప్రధానం. ప్రతిరోజు ఎంతోమంది పుడుతూ

[36] వృద్ధాప్యం జీవిత నవనీతం– ప్రకాశకులు గాయత్రి చేతన మరియు ధ్యాన కేంద్రం, హైదరాబాదు. పుట. 6

ఉంటారు మరణిస్తూ ఉంటారు. పుట్టిన ప్రతివాడిని ఎవరు గుర్తుంచుకోకపోవచ్చు, కాని మరణించినవాడు మాత్రం భవిష్యత్తరానికి ఏమి ఇచ్చారన్నదే ప్రధానం. కోట్ల మందిలో నువ్వు ఒకడవడం కాకుండా కోట్ల మంది జీవితాలకు నీవు ఆదర్శమై కీర్తిని సంపాదించుకోవడం గొప్ప. అదే చిరకీర్తి, ఈ కీర్తి విశ్వం ఉన్నంత వరకు సజీవంగానే ఉంటుంది. అటువంటి కీర్తి సంపాదించుకోవడం కోసం వృద్ధాప్య దశలోనైనా మంచి కార్యాలు చేపట్టాలంటున్నారు గోపి. అప్పుడు జీవితంలో పొందే సాఫల్యాన్ని "ఫలశృతి" కవితలో ఇలా వివరించాడు.

‘వృద్ధుడా!
సప్తసాగర సతత తరంగ పీడితుడా!
నిరంతర నావికుడా!
చిరకాల యోధుడా!
నీకు నువ్వే బ్రహ్మవు
సార్ధక్య మానవ జన్మవు
మరణం నీకు
మరో ఆవరణం
జీవన మంటపానికి తోరణం
ఇవాళటి కొత్త జీవితం
కలకాలం పరిమళించే మరకతం’. (పుట : 90)

మొదట డెభ్బై సంవత్సరాల జీవితంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని జీవనం సాగించినప్పటికి నీ కీర్తి చిరకాలం నిలిచి నువ్వు దేవునిగా రూపాంతరం చెందావంటూ వృద్ధునిలో ఉత్తేజాన్ని నింపి జీవితంలోని చివరి మజిలిలో పొందిన సాఫల్యతను వివరించాడు. నీ ప్రయాణం ద్వారా జీవితాన్ని సార్ధక్యం చేసుకున్నావంటాడు. ఈ వృద్ధాప్య జీవితాన్ని నవరత్నాలలో ఒకటైన 'మరకతం' తో పోల్చి శేష జీవితం మరకతం కంటే గొప్పదని దానిని స్నేహ పూర్వకంగా

ఆహ్వానించమని పేర్కొన్నాడు. ఉన్న చిన్న జీవితంలో ఇతరులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, ప్రేమానుబంధాలతో ఉండేవారికి ఎక్కువ కాలం జీవించే అవకాశం ఉంటుందన్నారు.

## 4.3. సమాజానికి వృద్ధుల పురస్కృతి

మానవ సమాజంలో అనుభవం, జ్ఞానం, వారసత్వ సంపదను, సంస్కృతిని భవిష్యత్తు తరాలకు అందించే సమూహమే వృద్ధులు. వార్ధక్యం ఒక వరం. కోరి వరించాల్సిన వరం అని చెప్పవచ్చు. ఎందుకంటే ఎంతో జీవితానుభవం తర్వాత వచ్చే జ్ఞాన సంపద వృద్ధాప్యం. ఆపలేని ఈ వృద్ధాప్యము సహజ పరిణామమై ఆఖరి శ్వాసవరకూ మనతోనే ఉంటుంది. గతంతో జీవితాన్ని పోల్చుకుంటూ 'నేనేమి చేయలేకపోతున్న! నా పెద్దరికం ఎవరికీ పనికి రాకుండా పోతుంది, ఇతరులకు భారంగా నాజీవితం వుంది' అనే ఆత్మన్యూనతా భావనకు కొందరు లోనయ్యే అవకాశముంది. ఇక్కడ మనం గుర్తెరగవలసింది ఏమిటంటే వృద్ధాప్యం అనేది అనుభవ పాఠశాల గని. ప్రకృతి పరమైన శారీరక ధర్మాలలో పరిణతి సాధించే ఉత్తమదశ. హుందాగా భావితరాలకు ఆదర్శంగా, అండగా నిలబడాల్సిన పరిపక్వత కలిగిన దశ. మన కీర్తి మూలంగా రాబోయే పది తరాలు పదిలంగా ఉంటాయి.

వృద్ధాప్యం అనగానే జీవితం అయిపోయిందని కాదు. అనుభవాల పరిణతితో కొత్త జీవితంలోకి అడుగుపెడుతున్నామని, జ్ఞాన ప్రపంచంలోకి ప్రవేశిస్తున్నారని గ్రహించాలంటున్నారు కవి.

'వృద్ధుడంటే
ముసలివాడని కాదు
వృద్ధి పొందినవాడని' (పుట : 13)

కవి కావ్యంలోని మొదటి కవిత అయిన **"వృద్ధుడు"** అనే కవితలో వృద్ధున్ని పరిణతి పొందినవాడుగా విశ్లేషించారు. వృద్ధాప్యాన్ని చాలామంది శాపంగానే భావిస్తారు కాని భగవంతుడిచ్చిన ఈ సంధ్యాకాలాన్ని మనిషి అందంగా తీర్చిదిద్దుకొని ఆనందంగా గడిపి

అస్తమించాలని కవి విన్నవించుకుంటున్నాడు. వృద్ధాప్యం అన్నది శరీరానికే కానీ మనసుకు కాదని గ్రహించాలని కవి ఈ వృద్ధోపనిషత్ కావ్యం ద్వారా తెలియజేస్తున్నారు.అరవై ఏళ్లు పైబడిన అనుభవజ్ఞుల శక్తిని, అనుభవ సారాన్ని ఉపయోగించుకుంటే తప్పకుండా ఏ దేశమైనా పురోగమిస్తుందనడంలో అతిశయోక్తి లేదు.

మనిషి జీవితంలో బాల్య, కౌమార, యౌవన, వృద్ధాప్య దశలు సహజం. వృద్ధాప్యమంటే మరోమారు బాల్యదశకు చేరినట్లేనని పెద్దలు చెపుతుంటారు. వయసు పెరిగి వృద్ధాప్యం ముదిరే కొద్దీ వారిని పసిపిల్లల్లాగా జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన అవసరం కుటుంబంలోని వ్యక్తులపై ఉంటుంది. వయసు పైబడుతున్న కొద్దీ ప్రతి జీవిలో అనేక మార్పులు జరుగుతుంటాయి. మనుషుల్లో అయితే వయసు మీరే కొద్దీ జుట్టు తెల్లబడడం, చర్మం ముడతలు పడడం, మతిమరుపు పెరగడం వంటివి గమనించవచ్చు. అలాగే శరీరంలో రోగనిరోధక శక్తి తగ్గి రకరకాల ఆనారోగ్య సమస్యలు కూడా ఎదురవుతాయి.

ప్రస్తుత కాలంలో మెరుగైన ఆరోగ్య విధానాలు అందుబాటులోకి రావడంతో మనిషి జీవన ప్రమాణం పెరుగుతోంది. అదేవిధంగా వృద్ధాప్య సమస్యలకు పరిష్కారాలు కూడా పెరిగాయి.
వృద్ధాప్య దశను నిర్వహించడం కష్టం. వయసును బట్టి మాత్రమే చూసి ఒక వ్యక్తిని వృద్ధుడు అనడానికి విలులేదు. వృద్ధాప్యం అనేది ఆ వ్యక్తి మనోభావన పైన ఆధారపడి ఉంటుంది. శారీరక ఆరోగ్యాన్ని, మానసిక ఆహ్లాదాన్ని సమతుల్యంగా సంరక్షించుకొని, క్రియాశీలకంగా, చురుకుగా ఉన్న వ్యక్తులను వయసు మీరిన వాళ్ళు అయినా సరే, వృద్ధులు అనడం కంటే పెద్దలు అనడమే సమంజసంగా ఉంటుంది. డెబ్బై ఎనబ్బై ఏళ్ళ వయసులో కూడా హుషారుగా, చలాకిగా ఉంటూ, జీవ కళ ఉట్టిపడే వాళ్ళను ఈనాడు ఎందరినో చూస్తున్నాము. వాళ్ళు వృద్ధులు కాదు పెద్దలు మాత్రమే.

## 4.4. వృద్ధులలో సమాజం గుర్తించిన ప్రయోజనాలు

ప్రస్తుతం సమాజంలో ఉమ్మడి కుటుంబాలు చీలిపోతున్నాయి. భార్య, భర్త, వాళ్ళ పిల్లలు మాత్రమే కలసి బ్రతికే కేంద్రీయ కుటుంబాలు పెరిగిపోతున్నాయి. వీటినే ఆంగ్లంలో 'Nuclear Family' (చిన్న కుటుంబం) అని అంటారు. పట్టణ ప్రాంతాలలోని మనుషులలో అయితే చాలీ చాలని ఆదాయం, పరిమితమైన వసతి సౌకర్యాలు, పిల్లల పెంపకం, పెరుగుతున్న ఖర్చుల మూలంగా ఉమ్మడిగా ఉండలేకపోతున్నారు. స్వార్థంతో కూడిన పోటీ బ్రతుకులు, ఈనాటి యువతరంలో మానవతా విలువల విధానాన్ని సమూలంగా మార్చేస్తున్నాయి. పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను వృద్ధాప్య దశలో తమ వద్ద ఉంచుకొని వాళ్ళకు భద్రత కల్పించే యువతరం రాను రాను కనుమరుగై పోతుంది. ఇది ప్రస్తుత పరిస్థితుల ప్రభావమనే చెప్పాలి.

వృద్ధాప్యం అన్నది ఏ ఒక్క వ్యక్తికో ప్రత్యేకించబడిన జీవిత పరిణామం కాదు. 'ఏ వయసుకు ఆ ముచ్చట' అన్న ధోరణిలో, పెద్దల జాబితాలో చేరిన తర్వాత సమాజానికి హితం చేకూర్చే పనులపై దృష్టి పెట్టాలి. వృద్ధులు సమాజానికి ఏంత అవసరమో ఒక చిన్న కథ ద్వారా తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

ప్రాచీన కాలంలో ఒక రాజు ముసలివాళ్లందరూ ఎందుకూ పనికిరాని వాళ్లని తలచి, అందరినీ నిర్మూలించడానికి ఆదేశాలు ఇచ్చాడు. దేశంలో ముసలివాళ్లంటూ లేకుండాపోయారు. అయితే, ఒక మనవడికి మాత్రం వాళ్ల తాతంటే ప్రాణం. సైనికుల కంటబడితే తాతను ఎక్కడ చంపుతారోనని తాతను అటక మీద దాచాడు. ఇరుగు పొరుగు వారు గమనించకుండా అన్నం నీళ్లు అందిచ్చేవాడు. కొంత కాలం గడిచాక రాజ్యంలో తీవ్రమైన కరువు వచ్చింది. ఆహార నిల్వలు అడుగంటాయి. ఏం చేయాలో ఎవరికీ పాలుపోవడం లేదు. పంట వేద్దామన్నా గుప్పెడు ధాన్యపు గింజలు లేని కరువు. ఇదే సంగతి యువకుడు తాతకు చెప్పాడు. ఆ తాత ఆలోచించి ఒక సలహా ఇచ్చాడు. ఇంటి పైకప్పుగా వేసిన వరి గడ్డికట్టలు మొత్తం కిందికి దించి దులిపి చూడు; ఎక్కడైనా ఒక తప్పుడు వరిగింజ ఉండకపోదా అన్నాడు. మనవడు అలాగే చేశాడు. గింజలు రాలిపడ్డాయి.

వాటిని పొలంలో చల్లాడు. తెల్లారే సరికల్లా అవి పెరిగాయి, తర్వాత కంకులు వేశాయి. రాజుకు విషయం తెలిసి ముందు సంతోషించినా, చట్ట ధిక్కారానికి వివరణ అడిగాడు. ఉన్నది ఉన్నట్టుగా చెప్పాడు మనవడు. వాళ్ల ప్రేమకు, అది చేయించిన సాహసానికి, వృద్ధుడు కనబరిచిన వివేకానికి ఆశ్చర్యపోయి, రాజు తన తప్పు తెలుసుకొని, బతికినంత కాలం మనుషుల్ని బతకనిచ్చేలా చట్టానికి సవరణ చేశాడు.

సంప్రదాయ సమాజంలో వృద్ధాప్య సమస్య తలెత్తేదే కాదు. అప్పటి సమాజంలో వృద్ధులకు తమ జీవిత చరమాంకంలో ఆనందాన్ని ఆరబోసుకుని, బాధ్యతల భారంతో అలసి సొలసిన ఒక తరం ప్రతినిధులుగా కుటుంబ ఆత్మీయత, అనుబంధాలకు మధ్య ఆడి పాడే పసిపాపలలో ఒకరిగా మమేకంగా గడిపి, మహాప్రస్థానాన్ని ముగిస్తూ మహాభినిష్క్రమణం చేసే మహోన్నత ఘట్టంగానూ నాటి వార్ధక్య దశ అనుభవించేవారు. అయితే నేటి సమాజంలో విలువలు కరువై మానవత్వం లోపించి నగరవాసంలో ఇరుకు గదుల నివాసాల వల్ల సమాజంలోని వ్యక్తుల మనసు గదులు కూడా ఇరుకై కొందరు వృద్ధులకు వృద్ధాప్యం ఒక శాపంలా, జీవితం దుర్భరంగా మారిపోయింది.

తల్లితండ్రులకు, పిల్లలకు పొసగని లోకంలో ఆర్థిక సంబంధాలే తప్ప సామాజిక, మనసు, మమతలతో కూడిన సంబంధాలను, అనుబంధాలను శాసిస్తున్నా, కన్నవారి మమకారాన్ని కాదనుకునే ప్రబుద్ధులు పెరుగుతుండడం వల్ల చాలామంది వృద్ధులకు కాటికి కాళ్ళు చాపుకుని, చావుకోసం ఎదురుచూసే దుర్వ్యవస్థ ఏర్పడింది. ఆర్థిక క్లేశాల్లో చిక్కుకుని బిడ్డల ప్రేమపాశం కోసం అలమటిస్తూ ఒంటరిగా బిక్కు బిక్కు మంటూ అనాథల్లాగే ఆర్తిగా తిండికి సైతం ముఖం వాచి బ్రతుకుతున్న వారు కొందరయితే, కన్నబిడ్డలు చూడటం లేదని వీధిన పడుతున్నవారు ఇంకొందరు. మారుతున్న కాలానికి అనుగుణంగా సమాజం మార్పులకు లోనవుతుంది. జీవితంలో వేగం పెరిగిన కారణంగా మానవ సంబంధాలలో సైతం మార్పులు చోటు చేసుకుంటున్నాయి.

గత దశాబ్దంలో ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన ప్రపంచీకరణ ఆర్థిక సరళీకరణలు దానికి సంబంధించిన పెనుమార్పులు కూడా సమాజంపై మానవ సంబంధాలపై ప్రభావాన్ని చూపిస్తున్నాయి. వీటన్నిటి ఫలితమే ఇటీవల పెరుగుతున్న వృద్ధాశ్రమాలు. ఉద్యోగాలు చేస్తూ వృద్ధులకు సేవ చేసే తీరిక లేక కొందరు తమ తల్లితండ్రులను వృద్ధ శరణాలయాల్లో చేరుస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా సంభవిస్తున్న పెనుమార్పులు, ఆర్థిక సరళీకరణల ప్రభావం మానవ సంబంధాల్లో అనూహ్య మార్పులకు శ్రీకారం చుదుతున్నాయి.

"వృద్ధుల సమస్యల మీద కథలు వస్తున్నాయి. అవి సానుభూతికి మాత్రం పరిమితమవుతున్నాయె తప్ప అవి మనిషిలో చలనం తీసుకురాలేక పోతున్నాయి. పెద్దలకి ధైర్యం చెప్పే విధంగా పిల్లలే ప్రపంచంగా భావించకుండా ఉండేలా వెన్ను తట్టే కథలు అరుదుగా వస్తున్నాయి. అలాంటి కథలను కథకులు అందించవలసిన అవసరం చాలా ఉంది".[37] కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన ముదిమి వయసు తల్లిదండ్రులపై సంతానమే దురుసుగా ప్రవర్తించడం, చేయి చేసుకోవడం, ఇంటి నుంచి వారిని గెంటివేయడం వంటి వార్తలు తరచూ మాధ్యమాల్లో కనిపిస్తూనే ఉన్నాయి. సాధారణంగా వయోధికులు తెలివైనవారు, అనుభవశీలురు. శారీరకంగా, మానసికంగా దుర్బలురు. సమస్యలను పరిస్థితులను అర్థం చేసుకొని పిల్లలతో సయోధ్యకు ప్రయత్నించేందుకే ఎక్కువగా మొగ్గు చూపుతారు. అయినా వారి మాటలను వినిపించుకోకుండా– పిల్లలు వారిని వేధిస్తున్న ఉదంతాలెన్నో. బయటికి చెబితే పరువు పోతుందనే భావనతో పలువురు వృద్ధులు– బంధువులు, స్నేహితులు, పొరుగువారి వద్ద ఈ విషయాలను దాస్తున్నారు. తద్వారా వారు రకరకాల మానసిక, శారీరక వ్యాకులతలకు గురై అంతిమంగా ప్రాణాలు కోల్పోతున్నారు.

భారతీయ సంస్కృతిలో తల్లిదండ్రులకు ఉన్నతమైన స్థానం ఉంది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ చెక్కుచెదరనంతవరకు మనదేశంలో వృద్ధులు గౌరవంగానే జీవించారు. ప్రపంచీకరణ

[37] తెలుగు కథ–వృద్ధుల సమస్యలు. డాక్టర్. గురజాడ శోభ పెరిందేవి, నెచ్చెలి వనిత, మాస పత్రిక.

నూతన ఆర్థిక, సామాజిక అంశాలు ఉమ్మడి కుటుంబ వ్యవస్థను చిన్నాభిన్నం చేశాయి. ఉద్యోగాల వేటలో పిల్లలు తల్లిదండ్రులకు దూరమై, చిన్న కుటుంబాలు ఏర్పాటయ్యాయి. కొందరు తల్లిదండ్రులతో కలిసే జీవిస్తున్నా నేటి ఆధునిక నాగరికత వారి మధ్య విభజనరేఖ గీసింది. ఇంకొందరయితే తల్లిదండ్రులను బలవంతంగా వృద్ధాశ్రమాల్లో చేర్పించి చేతులు దులిపేసుకుంటున్నారు. వారిని రెండు మూడు నెలలకు ఒక్కసారైనా పలకరించిన పాపాన పోవడంలేదు. పెద్దవారు ఇంట్లో ఉంటే పిల్లలకు తోడుగా ఉంటారు. వారికి చిన్నతనం నుంచే మన సనాతనధర్మం, ఆచార వ్యవహారాలు, నైతిక విలువల గురించి చెబుతారు. వారి సందేహాలను తీరుస్తారు. తద్వారా ఆ చిన్నారులు పెరిగి బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతారు. వారి అపార జ్ఞానం తరవాతి తరాలకు చేరే పరిస్థితులను నేటి యువ సమాజం కల్పించాలి.

పెద్దవారిని ఈసడించుకోవడం, తిట్టడం వంటి మానసిక వేధింపులతోపాటు, కొట్టడం, ఇంట్లో నుండి తోసివేయడం, హింసించడం, భోజన వసతి, దుస్తులు, వైద్యసేవలు కల్పించకపోవడం, స్వేచ్ఛను హరించడం లాంటి శారీరక వేధింపులు వారి అభీష్టానికి భిన్నంగా బెదిరించి మోసగించి వారి వద్ద ఉన్న ధనం, ఆభరణాలు, స్థలం, ఇల్లు, పొలం, భూములు, వ్యాపారాలను బలవంతంగా లాక్కోవడం వంటివి వృద్ధులపై జరుగుతున్నాయి.

అరవై ఏళ్ళు రాగానే జీవితం ఆగిపోదని మరో నలభైఏళ్ళు ముందున్నాయి కనుక వృద్ధులు విజయపథంలో పయనించే అవకాశాలు ప్రోత్సాహకారకాలు ఉన్నాయని తెలిపి, పిల్లలే ప్రపంచంగా భావించి వాళ్ళు రెక్కలొచ్చి పిల్లలు వెళ్ళిపోగానే వ్యథ చెందక అంతవరకూ కుటుంబం కోసం ఆలోచించిన వారు ఆపైన సమాజ శ్రేయస్సు కోసం శక్తి ఉన్నంతవరకు శ్రమించాలని, 'కాటికి కాళ్ళు చాచుకున్నవాడు వృద్ధుడు' అని కాక 'అనుభవాల సంపదలు ఆర్జించుకున్న వయోశ్రేష్టుడిగా' వృద్ధుల ప్రత్యేకతలను వివరించిన గోపి నేటి తరం వృద్ధులను, వారి మేధాశక్తిని ఆధారంగా చేసుకొని అభివృద్ధి బాటలో పయనించమని 'వృద్ధోపనిషత్' ద్వారా సందేశం ఇస్తున్నాడు.

# ముగింపు

వృద్ధాప్యం వచ్చిందంటే ఎవరైనా భయపడతారు. ఎందుకంటే వృద్ధాప్యంలో ఉన్న సమస్యలు అటువంటివి. ఒక్కటి కాదు శారీరకంగా శిథిలమవ్వడం, తరాల అంతరం, నిరాదరణకు గురికావడం, ఒంటరితనం, మతిమరుపు, మృత్యుభయం, కుటుంబ ఆదరణ లభించకపోవడం, సమాజంలో వారికి తగిన స్థానం ఇవ్వకపోవడం మొదలైన కారణాల మూలంగా వృద్ధాప్యం అంటేనే మనిషిలో తెలియని భయాందోళన మొదలవుతుంది.

మహాభారతంలోని యయాతిచరిత్రలో సైతం వృద్ధాప్య సమస్యలను గురించి ప్రస్తావన ఉంది. యయాతిని శుక్రాచార్యుడు జీవితాంతం వృద్ధుడుగా ఉండమని శపించినప్పుడు యయాతి వృద్ధాప్య సమస్యలను తలుచుని రోధించిన సన్నివేశాన్ని గమనించవచ్చు.

వృద్ధాప్యం అంటే భయపడేవారికి గోపి గారు చక్కటి ఉపదేశంగా రచించిన రచననే "వృద్ధోపనిషత్". కవి ఇందులో వృద్ధుల సమస్యలు మొదట వివరించి, తర్వాత వారి వల్ల సమాజానికి కలిగే ప్రయోజనాలను గురించి తెలియజేసి చివరకు వృద్ధులలో ధైర్యాన్ని నింపే ప్రయత్నం చేశారు. ఈ 'వృద్ధోపనిషత్' కావ్యాన్ని ప్రతిఒక్కరు చదవాలి. ముఖ్యంగా యువకులు చదివితే వృద్ధులు వృద్ధాశ్రమాలపాలు కాకుండా సమాజాన్ని మార్చగలుగుతారు. ఈ వృద్ధోపనిషత్ కుటుంబంలోని వారు చదివితే వృద్ధులు రోడ్డున పడకుండా ఉంటారు. సమాజానికి ఒక చక్కటి సందేశం ఈ వృద్ధోపనిషత్ కావ్యం.

మనిషి తన జీవితంలో రెండు దశలలో బలహీనంగా, నిస్సహాయంగా జీవిస్తాడు. మొదటి దశ జన్మించినప్పటినుండి ప్రారంభం అయ్యి శైశవ జీవితం ముగిసే వరకు కొనసాగుతుంది. ఈ దశలో ప్రాణికి తగిన ఆసరా అందకపోతే, శిశువు మనుగడకే ముప్పు వాటిల్లుతుంది. తగిన పోషకాలు అందకపోతే శిశు దశ నుంచే అనేక రోగాణువులు స్థిరపడే ప్రమాదం ఉంది. ఈ దశలో మనిషి బుద్ధి, వివేకం వికసించవు. స్వతంత్రంగా ఆలోచించి, నిర్ణయం తీసుకునే శక్తి ఉండదు. ఇతరులపై ఆధారపడి జీవించాల్సి ఉంటుంది. దాదాపు ఇలాంటి పరిస్థితే వృద్ధాప్యంలో సంభవిస్తుంది. ఇది ప్రతి ప్రాణి జీవితంలోచివరి దశ. ఈ దశలో ఇంద్రియాలు పట్టు తప్పుతాయి.

శరీరంలో సత్తువ క్రమేపి నశిస్తూ వస్తుంది. ప్రస్తుత ఆధునిక జీవనాలను దృష్టిలో ఉంచుకొని మనిషికి అరవై(60) సంవత్సరాల వయస్సును వార్ధక్యంగా భావిస్తున్నారు. అరవై(60) సంవత్సరాల వయస్సు దాటిందంటే శరీరంతో పాటు, సమాజంలో కూడా మార్పులు సంభవిస్తుంటాయి. ఆ మార్పును సాదరంగా ఆహ్వానించి శేషజీవితాన్ని అశేష జీవితంగా గడపాలని గోపి గారు ఈ "వృద్ధోపనిషత్" కావ్యం ద్వారా ప్రబోధిస్తున్నారు.

జ్ఞాన సముపార్జనకు నిలయం ఈ 'వృద్ధోపనిషత్' కావ్యం. ఈ కావ్యాన్ని పసిపిల్లలకు బోధిస్తే వయోధికులతో ఎలా ఉండాలో నేర్చుకుంటారు. యువకులు చదివితే వృద్ధులతో ఏ విధంగా మెలగాలో తెలియవస్తుంది. అలాగే వృద్ధులకు ఎలా మర్యాద ఇవ్వాలో తెలుసుకుని మానవతా విలువలతో కూడిన భవిష్యత్ సమాజాన్ని నిర్మించగలుగుతారు. వివాహమైనవారు పఠిస్తే తల్లిదండ్రులను, అత్తమామలను ఎలా చూసుకోవాలి, వారి పరిణత జీవితాన్ని గౌరవించి వారికున్న అనుభవ జ్ఞానాన్ని ఉపయోగించుకుని వారిని ఎలా మార్గదర్శకం చేసుకోవాలో తెలుసుకుంటారు.

అదే వృద్ధోపనిషత్ కావ్యాన్ని వృద్ధులు చదివితే వృద్ధాప్యం దేహానికే గాని మనసుకు కాదని గ్రహించి గొప్ప చైతన్యాన్ని పొందుతారు. వారు భవిష్యత్తు తరాలను సరైన మార్గంలో తీర్చిదిద్దే జ్ఞాన సంపన్నులమన్న భావన వారికి కలుగుతుంది.

ఏ ఒక్క దశకు పరిమితం కాని ఒక విశిష్ట ఉపనిషత్ ఈ "వృద్ధోపనిషత్". అన్ని దశల వారిలో కూడా ఆర్ద్రతను నింపి, ఆలోచన రేకెత్తించి, మనస్సులో సంతృప్తి అనే బీజాన్ని మొలిపిస్తుందనడంలో సందేహం లేదు.

జీవితంలోని ప్రతి దశలోనూ ఆనందంగా గడపాలని ప్రతి ఒక్కరూ అభిలషిస్తారు. కానీ అన్ని దశలలో అది సాధ్యపడకపోవచ్చు. సమాజం వేగంగా పరిగెడుతుంది. అందరి కంటే నేనే ముందుండాలి. రేపటిని ఈ రోజే చూడాలి. ప్రపంచాన్ని గెలవాలనే లక్ష్యంతో అనేక మంది జీవితంలో నిరంతరం పరుగులు పెడుతూనే ఉన్నారు. ఆ వేగంలో పడి జీవితాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. అయినవాళ్లను కూడా పట్టించుకోకుండా బంధాలు, బంధుత్వాలను మరిచిపోతున్నారు. జీవితంలో వేగం ఉండాలి; కాని వేగమే జీవితం కాకూడదన్న విషయాన్ని గుర్తించడం లేదు. ఈ కావ్యాన్ని చదివి కొంతవరకైనా సమాజంలో మార్పు వస్తుందని చెప్పవచ్చు.

# ఉపయుక్త గ్రంథసూచి

# (Bibliography)

1. అరుణకుమారి, గడ్ల. 1989. ***ఆధునిక కవిత్వంలో మానవతావాదం – విభిన్న ధోరణులు.*** (సిద్ధాంత వ్యాసం) ప్రథమ ముద్రణ.హైదరాబాదు: ఎస్. వి. ప్రింటర్స్.
2. ***గోపి సాహిత్యదర్శనం దృక్కోణాలూ సమీక్షలూ.*** 1998. సంపాదకవర్గం. అఫ్సర్, ఎస్వీ. రామారావు, ఎండ్లూరి సుధాకర్, మచ్చ హరిదాసు మొ.. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
3. గోపి, ఎన్. 2019, ***వృద్ధోపనిషత్ (oldege poems).*** హైదరాబాదు: అభవ్ ప్రచురణలు.
4. చంద్రశేఖర్ రెడ్డి, రాచపాళెం. 2002. ***ఆధునికాంధ్ర కవిత్వం–ఉద్యమాలు– సందర్భాలు.*** హైదరాబాదు: అనుపమ ప్రింటర్స్.
5. చంద్రిక, యం. 1987. ***మినీ కవిత్వ నిర్మాణ శిల్పం భావాభివ్యక్తి***. సూల్తన్ బజార్ హైద్రాబాదు: రాఘవేంద్ర ప్రచురణలు.
6. పద్మజ, చెన్నమనేని. 1995. ***1975–85 నడిమి ఆధునిక తెలుగు కవిత్వంలో కళాతత్వశాస్త్ర రీత్యా భావచిత్ర పరిశీలన.*** హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పిహెచ్. డి. పరిశోధన గ్రంథం.
7. ప్రభాకర్ రెడ్డి, తాతిరెడ్డి. 1987. ***తెలుగు కవిత్వంలో ప్రతీక.*** అనంతపురం. ప్రభాకర్ ప్రచురణలు.
8. మధుసూదన రావు, త్రిపురనేని. 1997. ***సాహిత్యంలో వస్తు శిల్పాలు***. హైదరాబాదు: హైదరాబాద్ పర్ స్పెక్టీవ్ ప్రచురణలు.
9. ముకుందరావు, పి. 2008. ***ఎన్. గోపి జలగీతం – మానవీయ మహాకావ్యం.*** హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పిహెచ్. డి. పరిశోధన గ్రంథం.

10. రఘు, ఎస్. (సంపా.) 2010. ***గోపి సాహిత్య వివేచన.*** హైదరాబాదు: అభవ్ ప్రచురణలు.

11. రఘు, ఎస్. (సంపా.). 2022. ***నిరంతర*** *(డా. ఎన్. గోపి సాహిత్యంపై విమర్శ, సమీక్షా వ్యాసాలు).* హైదరాబాదు: అథర్వ్, అభవ్ ప్రచురణలు.

12. రవికుమార్, గట్ల. 2011. ***గోపి కవిత – మానవత.*** హైదరాబాదు: అన్నపూర్ణ ప్రచురణలు.

13. రవికృష్ణ, మోదుగుల. (సంపా.) 2017. ***ఎన్. గోపి సాహిత్య స్ఫూర్తి.*** గుంటూరు. బొమ్మిడాల కృష్ణమూర్తి ఫౌండేషన్ ప్రచురణలు.

14. రామచంద్ర, తిరుమల. ***ఆధునిక కవిత అభిప్రాయ వేదిక.***

15. రామచంద్రరావు, కందర్ప. ***వృద్ధాప్య జీవిత నవనీతం.*** హైదరాబాదు: గాయత్రి చేతన మరియు ధ్యాన కేంద్రం.

16. రామారావు, చేకూరి. 1991. ***చేరాతలు సాహిత్య విమర్శ – పరామర్శ.***

17. వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. 2002. ***విమర్శ శిల్పం.*** హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

18. శివరామకృష్ణ, పెన్నా. 1993. ***శేషేంద్ర కవిత్వానుశీలనం***. హైదరాబాదు: ప్రవాహినీ ప్రచురణలు.

19. శివరామకృష్ణ, పెన్నా. 2020. ***ఎన్. గోపి కవితా తత్వ వివేచన.*** హైదరాబాదు: ప్రవాహినీ ప్రచురణలు.

20. శివశంకర్, పాపినేని. 1996. ***సాహిత్యం – మౌలిక భావనలు.*** గుంటూరు. పాపినేని ప్రచురణలు.

21. శోభ పెరిందేవి, గురజాడ. ***తెలుగు కథ – వృద్ధుల సమస్యలు.*** నెచ్చెలి వనిత. మాస పత్రిక.

22. శ్రీ సాగర్ శ్రీ రామకవచం. **ప్రచ్ఛన్న వస్తుశిల్పాలు – ఒక పరిశీలన.** విజయవాడ: నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రచురణలు,

23. శ్రీదేవి, కె.ఎల్.ఎస్. 2004. ***ఆధునిక తెలుగు సాహిత్యంలో వృద్ధాప్య చిత్రణ.*** హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పిహెచ్. డి. పరిశోధన గ్రంథం.


24. శ్రీనివాసరావు, గొట్టె. 1999. ***చిత్రదీపాలు – అధ్యయనం.*** హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన ఎం. ఫిల్. పరిశోధన సిద్ధాంత వ్యాసం.

25. శ్రీలత. 2015. ***ఎన్. గోపి సాహిత్యం వస్తు రూప వివేచన.*** హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పిహెచ్. డి. పరిశోధన గ్రంథం.

**అంతర్జాలం:**

26. www.Google.com

27. www.Youtube.com



# అనుబంధం

**ప్రముఖ కవి, పరిశోధకులు, విమర్శకులు ఆచార్య ఎన్. గోపి గారితో పరిశోధకురాలు జరిపిన ముఖాముఖి...**

1. **వృద్ధోపనిషత్ కావ్యం రాయడానికి గల కారణాలు ఏమిటి?**

   జ. వృద్ధాప్యం చాలా విలువైనదని నా ఉద్దేశం. ఇది జీవన సారాంశ దశ. దీనిలో పరిణత ప్రజ్ఞ, ధిషణా పటుత్వం, బౌద్ధికశక్తి కలగలిసి ఉంటాయి. జీవితం నిందించుకుంటూ కూర్చునేది కాదని, వృద్ధుడంటే జ్ఞానవృద్ధికి తోడ్పడుతూ మార్గదర్శనం చేసేవాడని నా అభిప్రాయం.

2. **వృద్ధోపనిషత్ అనే శీర్షిక పెట్టడానికి గల కారణమేంటి?**

   జ. ఉపనిషత్ మన భారతీయ తత్త్వాన్ని బాగా ప్రతిబింబించిన ఒక ప్రాచీన ప్రక్రియ. ఉపనిషత్ అంటే గురువు ముందు కూర్చుని జ్ఞానాన్ని పొందే ఒక పద్ధతి. ఇది ప్రశ్నా, జవాబుల రూపంలో ఉంటుంది. మొత్తానికి వృద్ధేతరులకు, వృద్ధులకు సంబంధించిన పరిజ్ఞానం అని అర్థం. అలాగే వృద్ధులకు కూడా వృద్ధాప్యం కొత్తదే, వచ్చినప్పుడు తెలుస్తుంది దాని సంగతి.

3. **సాహిత్యంలో వృద్ధాప్యానికి సంబంధించిన అంశాలను ఏ విధంగా పరిశీలించాలి?**

   జ. సానుభూతితో చూడాలి. మనల్ని ఆ స్థానంలో పెట్టుకొని ఆలోచించాలి.

4. **వృద్ధుల పట్ల కుటుంబానికి ఉండాల్సిన బాధ్యత ఎటువంటిది?**

   జ. కుటుంబంలో ప్రేమలున్నప్పుడు వృద్ధులకు ఎక్కువ ఇబ్బందులు ఉండవు. వృద్ధుడికి శారీరక సమస్యలు ఎలాగు ఉంటాయి, కానీ మానసిక సమస్యలు లేకుండా ఎదుటివారు చూసుకోవాలి. కుటుంబంలో ప్రేమలున్నప్పుడు ఇది సాధ్యమవుతుంది. ఇప్పుడు వ్యష్టి కుటుంబాల సంఖ్య పెరిగింది, వృద్ధులు వృద్ధాశ్రమాల పాలవుతున్నారు ఇది దురదృష్టకరం.

5. **సామాజిక జీవితంలోని వృద్ధప్యం పట్ల మీ ఆలోచనలు తెలియజేస్తారా?**

జ. ఇవాళటి యువకులు రేపు ముసలివారవుతారు. అతడు ముసలవాడయినప్పుడు తప్ప దాని విషయం అర్థం కాదు. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలలో వృద్ధులను పట్టించుకునేవారు లేదా పట్టించుకునేవారు కాదు. వృద్ధాప్యానికి పేదరికం తోడైతే మరీ ఇబ్బందిగా ఉంటుంది. కొన్ని దేశాల్లో వృద్ధులకు ప్రభుత్వపరంగా మంచి ఆదరణ లభిస్తుందని విన్నాను. మన సమాజంలో ఎలా ఉందో మీరే ఆలోచించండి?

6. **వృద్ధుల పట్ల సమాజం మరియు ప్రభుత్వం ఎలాంటి బాధ్యత వహిస్తుందని మీరు భావిస్తున్నారు?**

జ. డబ్బు లేని వారికి ప్రభుత్వాలు అక్కడక్కడ వృద్ధాప్య పెన్షన్లు ఇస్తున్నారు. దానిని ఇతరులు కొట్టేయకుండా వారికి అందేటట్టు చూడాలి.

7. **పద్య కవిత్వంతో సాహిత్యరంగంలోకి అడుగుపెట్టిన మీరు ప్రస్తుతం వచన కవిత్వం రాయడానికి కారణం ఏమిటి?**

జ. నా కవిత్వం పద్యాలతో మొదలవ్వడం నిజమే. కానీ కాలక్రమంగా వచన కవిత్వం కూడా ప్రారంభించాను. కవి కాలగమనాన్ని అందిపుచ్చుకోవాలిగదా, పైగా కొన్ని భావాలు పద్యంలో కంటే వచన కవిత్వంలోనే బాగా రానిస్తాయి.


8. **యాత్రాచరిత్రకారుడుగా మీరు అనేక దేశాలు పర్యటించారు, మీ అనుభవం తెలియజేస్తారా?**

జ. నేను ఇప్పటివరకు ఆరు యాత్రా చరిత్రలు రాశాను. అంటే ఆరు దేశాలు తిరిగోచ్చానన్నమాట. యాత్రచరిత్ర అంటే ట్రావెల్ గైడ్ కాదు యాత్రించే వారి ఉద్వేగయాత్ర, అనుభూతియాత్ర. శరీరం మాత్రమే ప్రయాణించదు మనసు కూడా స్పందిస్తుంది, ఆ స్పందన సమాహారమే యాత్రాచరిత్ర. ఒక కొత్త ప్రదేశం చూసినప్పుడు కలిగే ఆశ్చర్యానందాలు మన సొంత భూమితో పోల్చదగిన అంశాలు వగైరాలు ఉంటాయి. నేను మొదటిసారి విమానం ఎక్కినప్పుడు పైనుంచి కింద మా ఊరు కనిపించిందనీ, మా ఊరి వాళ్ళందరూ నన్ను చేతులపై పైకెగరేస్తే నేనిప్పుడు విమానంలో

ఉన్నానని రాశాను. ఆకాశంలో తిరిగేటప్పుడు భూమిని మరిచిపోకపోవడమే యాత్ర చరిత్ర.

**9. కవిగా, పరిశోధకునిగా, విమర్శకునిగా మీకు ఎదురైన సమస్యలు ఏమిటి?**

జ. సమస్యలు అనేవి ప్రతి పనిలో ఉంటాయి. కానీ అందులో లీనమై పనిచేస్తూపోతే ఆ సమస్యలు అన్ని పువ్వుల్లా విడిపోతై. అప్పుడవి సమస్యలే అనిపించవు. ఉపరితలంలో కునుకులాడినప్పుడే సమస్యల లోతుకు వెళితే అంత స్పష్టత.



★★★★★

AS PER THE UNIVERSITY POLICY, ANTI-PLAGIARISM SCREENING IS NOT REQUIRED FOR THE REGIONAL LANGUAGES

AS PER THE UNIVERSITY POLICY, ANTI-PLAGIARISM SCREENING IS NOT REQUIRED FOR THE REGIONAL LANGUAGES

Librarian
Indira Gandhi Memorial Library
UNIVERSITY OF HYDERABAD
Central University P.O.
HYDERABAD-500 046.